


www.andhrajyothy.com
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 111
శుక్రవారం | 19-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 |
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి రా. 7.41 తదుపరి చతుర్దశి; నక్షత్రం: మూల రా. 2.55 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: ఉ.11.15-12.49, రా.1.21-2.55; దుర్ముహూర్తం: ఉ.8.29-9.20, మ.12.47-1.38; అమృతఘడియలు: రా.1.21-2.55; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 5.54, సూర్యాస్తమయం: 6.48
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గ్రూపు-2 పరీక్షలు వాయిదా!?

నవంబరు లేదా డిసెంబరులో..

ప్రత్యామ్నాయ తేదీలను పరిశీలిస్తున్న అధికారులు

వాయిదా డిమాండ్ నేపథ్యంలో నిరుద్యోగులతో చర్చించిన కాంగ్రెస్ నేతలు 14





సచివాలయంలో పలువురు రైతుల సమక్షంలో రుణమాఫీ చెక్కు విడుదల చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి; కరీంనగర్‌లో సీఎం, మంత్రుల ఫ్లెక్సీకి కాంగ్రెస్ శ్రేణుల క్షీరాభిషేకం

రుణం తీరిన తరుణం

11 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి మాఫీ సొమ్ము

నా జీవితంలో మరపురాని రోజు

నెలాఖర్లో రాహుల్‌గాంధీకి కృతజ్ఞత సభ

దొంగల మాటలు నమ్మొద్దు

సవాళ్లు విసిరి పారిపోతారని తెలుసు

వాళ్ల రాజీనామా కోసం పట్టుబట్టం

కేసీఆర్ 7 లక్షల కోట్ల అప్పుచేసి వెళ్లారు

ఆ సంక్షోభాన్ని భట్టి చక్కదిద్దుతున్నారు

రుణమాఫీ కార్యక్రమంలో సీఎం రేవంత్

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

రేపు ఢిల్లీకి సీఎం.. రాహుల్‌కు ఆహ్వానం

ట్రింగ్.. ట్రింగ్..! సాయంత్రం 4 గంటలు దాటిన తర్వాత రాష్ట్రంలోని రైతుల ఫోన్‌కు మెసేజ్! మీ బ్యాంకు ఖాతాలో ఇంత మొత్తం పడిందంటూ సమాచారం! అంతే.. దాదాపు 11 లక్షల మంది రైతుల ముఖాల్లో ఆనందం! ఏళ్లుగా పెండింగులో ఉన్న బాకీ తీరిపోయిందనే సంతోషం! వానాకాలం పంట ముందు మరోసారి రుణం తీసుకోవచ్చనే ఆశ! రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల సంబురం!! కాంగ్రెస్ సర్కారు చెప్పినట్లే చేసింది! సీఎం రేవంత్ మాట నిలబెట్టుకున్నారు! పంద్రాగస్టులోపే రుణ మాఫీకి శ్రీకారం చుట్టారు! తొలి విడతగా గురువారం లక్షలోపు రుణాలు మాఫీ అయ్యాయి! ఇటు రైతుకూ రుణ భారం తీరింది! అటు ప్రభుత్వమూ ఓటు వేసి గెలిపించిన రైతన్న రుణం తీర్చేసుకున్నట్లు అయింది!!

రుణం మాఫీ..
రైతు ఖుషీ..!
పల్లెపల్లెనా సంబరాలు

13

రైతులకు మళ్లీ రుణాలు ఇవ్వండి

- రూ.31వేల కోట్ల మేర రుణ మాఫీ.. దేశ బ్యాంకింగ్ చరిత్రలోనే ఓ రికార్డు
- రైతులను ఇబ్బంది పెట్టొద్దు.. బ్యాంకుల వద్ద ఉత్సవాలు: ఎస్‌ఎల్‌బీసీ భేటీలో భట్టి
- ప్రతి పైసా తిరిగి రైతులకివ్వాలి.. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి: తుమ్మల



వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎంతో మాట్లాడుతున్న రైతులు శివయ్య, లక్ష్మమ్మ, పక్కన మంత్రి దామోదర

రుణపడి ఉంటాం

బ్యాంకు అప్పు ఏకకాలంలో మాఫీ

రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు

రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేస్తాం

రైతు వేదికల నుంచి అన్నదాతల కృతజ్ఞతలు

ముఖ్యమంత్రితో వీడియో కాన్ఫరెన్స్

2 లక్షల క్యాటగిరికే ఎక్కువ బడ్జెట్!

3వ విడతకు రూ. 18 వేల కోట్లు

రుణమాఫీ బడ్జెట్‌లో 60 శాతం దానికే

పాలమూరు-రంగారెడ్డిదే

పెద్ద పద్దు

- బడ్జెట్‌లో రూ.2,500 కోట్లు ప్రతిపాదించాలని నిర్ణయం
- 75% పైన పూర్తయిన ప్రాజెక్టులకు రూ.7,406 కోట్లు
- త్వరలో పూర్తి కానున్న వాటికి రూ.240 కోట్లు
- మొత్తంగా రూ.11 వేల కోట్లు కేటాయించాలని యోచన



హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రానున్న బడ్జెట్‌లో రూ.2,500 కోట్లు కేటాయించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ పథకం కింద 30 లక్షల ఎకరాలకు నీరందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ పథకం సవరించిన అంచనా వ్యయం రూ.55,086 కోట్లు కాగా ఇప్పటిదాకా రూ.31,424.49 కోట్ల మేర పనులు జరిగాయి. ప్రస్తుతం రూ.1,915 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ గత ప్రభుత్వం మిగిల్చినవే. అయితే ఈ పథకం పూర్తి కావాలంటే మరో రూ.21,747 కోట్లు అవసరం. ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ప్రాజెక్టుల నిర్మాణ పనులకు రూ.11 వేల కోట్లను వెచ్చించాలని నిర్ణయించింది. ఇందులో 100 శాతం పూర్తవుతాయని అంచనా వేస్తున్న ప్రాజెక్టులకు రూ.240.66 కోట్లను కేటాయించాలని సర్కారు యోచిస్తోంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే 47,800 ఎకరాలు సాగులోకి వస్తాయని భావిస్తోంది. ఇక 75శాతానికి పైగా పూర్తయిన 12 ప్రాజెక్టులకు రూ.7,406 కోట్లను ప్రతిపాదిస్తున్నారు. ఈ 12 ప్రాజెక్టుల ద్వారా 5.8 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి రానుంది. అంతిమంగా ప్రాధాన్య ప్రాజెక్టులకు రూ.7,650 కోట్లను ప్రతిపాదించారు. అంతేకాకుండా మైనర్ ఇరిగేషన్‌కు మరో రూ.1,000 కోట్లు, మరో కీలకమైన కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రూ.1,000 కోట్లను కేటాయించాలని నిర్ణయించారు. మొత్తంగా ప్రాజెక్టుల పనులకే రూ.11 వేల కోట్లను వెచ్చించడానికి వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

కొడంగల్ ఎత్తిపోతలకు తక్షణమే టెండర్లు

12

డిజైన్లు సిద్ధం చేస్తూనే టెండర్లను పిలవాలని రేవంత్‌రెడ్డి ఆదేశం

ఇకపై 3-4 వారాలకోసారి సీఎం సమీక్ష



చిన్నారులపై కుక్కల దాడి..

హైకోర్టు ఫైర్

ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ పరస్పర ఆరోపణలు తగవు

పరిష్కారాలతో రావాలి

యానిమల్ బర్త్‌కంట్రోల్ కమిటీ, ప్రభుత్వానికి ఆదేశాలు

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చిన్న పిల్లలపై వీధికుక్కలు దాడి చేసి, చంపుతున్న సంఘటనలపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేవలం స్టెరిలైజేషన్(సంతాన నిరోధక శస్త్ర చికిత్స) ద్వారా ఈ సమస్యకు పరిష్కారం లభించదని.. ఆయా రంగాల్లో పనిచేస్తున్న నిపుణులను సంప్రదించి పరిష్కారాలతో రావాలని ప్రభుత్వానికి, యానిమల్

మిగతా 14వ పేజీలో...

రహదారులపై గుంతల సమస్య పరిష్కారానికి.. 14

ప్రత్యేక యాప్

సర్కారుకు హైకోర్టు సూచన



రాష్ట్ర బడ్జెట్ 25న?

23 నుంచి అసెంబ్లీ

రైతు భరోసా, బీసీ రిజర్వేషన్లపై చర్చ! 12

పరీక్ష కేంద్రాల వారీగా

నీట్ ఫలితాలు



నగరాల వారీగానూ.. రేపు మధ్యాహ్నం 12లోపు ప్రకటించాలి

ఎన్‌టీఏను ఆదేశించిన సుప్రీంకోర్టు.. 22న మరోమారు విచారణ

న్యూఢిల్లీ, జూలై 18: నీట్ పేపర్ లీకేజీపై దాఖలైన పిటిషన్ల మీద విచారణ జరుపుతున్న సుప్రీంకోర్టు గురువారం జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ(ఎన్‌టీఏ)కు కీలక ఆదేశాలు జారీ చేసింది. పరీక్ష కేంద్రాలు, నగరాల వారీగా ఫలితాలను ప్రకటించాలని స్పష్టం చేసింది. శనివారం మధ్యాహ్నం 12 గంటల్లోపు ఫలితాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టాలని సూచించింది. విద్యార్థుల గుర్తింపును బహిర్గతం చేయొద్దని పేర్కొంది. నీట్-యూజీ పరీక్షలు మే 5న దేశవ్యాప్తంగా జరగ్గా.. పట్నా, హజారీబాగ్‌లలో పేపర్ లీకేజీ కేసులు నమోదయ్యాయి. గుజరాత్‌లోని గోధ్రా, మరికొన్ని ప్రాంతాల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో.. సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశించిన విషయం తెలిసిందే..! దీంతో మే 5న జరిగిన నీట్ పరీక్షను రద్దు చేయాలని, తిరిగి పరీక్షను నిర్వహించాలని కోరుతూ పలువురు విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎన్‌టీఏ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని కలుపుకొని.. మొత్తం 40 పిటిషన్లను కలిపి విచారిస్తామని సుప్రీంకోర్టు ప్రకటించింది. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల

మిగతా 2వ పేజీలో...

కఠిన చట్టాల పేరుతో బెయిలివ్వకుండా ఆపలేరు

రాజ్యాంగబద్ధ కోర్టులకు ఆ అధికారముంది

జీవించే హక్కు, వ్యక్తిస్వేచ్ఛ పవిత్రమైనవి

రాజ్యాంగ విలువలకు, చట్టబద్ధ పాలనకు కోర్టులు కట్టుబడి ఉండాలి: సుప్రీం కోర్టు

ఉపా కేసులో నేపాలీ పౌరుడికి బెయిల్

2

వయసును ఇక అడ్డుకోవచ్చు!

2



శరీరాన్ని క్షీణింపజేసే ఐఎల్-11 ప్రొటీన్‌ను గుర్తించిన శాస్త్రవేత్తలు

దాని ఉత్పత్తిని అడ్డుకుంటే నెమ్మదిస్తున్న వృద్ధాప్య లక్షణాలు

ఎలుకలపై ప్రయోగాలు.. 25 శాతం పెరిగిన జీవితకాలం

వ్యాధుల నుంచి రక్షణ.. 'యాంటీ ఏజింగ్' పరిశోధనల్లో ముందంజ

జీవితకాలం ఏడాది పెరిగితే రూ.83.62 లక్షల కోట్ల సంపద సృష్టి



శ్రీధర్‌బాబుతో మలబార్ గోల్డ్ చైర్మన్ ఎంపీ అహ్మద్

రాష్ట్రంలో రూ.750 కోట్లతో మలబార్ గోల్డ్ పెట్టుబడులు

1,500 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు

మంత్రి శ్రీధర్‌బాబుతో మలబార్ చైర్మన్ భేటీ

ప్రభుత్వ ప్రాజెక్టులకు ప్రైవేటు అప్పులు

సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజీతో నిధుల సమీకరణ

కన్సల్టెన్సీలతో శ్రీధర్‌బాబు సమావేశం 14

ఉప ఎన్నికలపై బీజేపీ నజర్!

ఐదారుగురు బలమైన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించే ప్లాన్ 12

పార్టీ అధిష్ఠానం ముందు ప్రతిపాదన

వాగుతో పెద్ద డేంజర్

భద్రాద్రి జిల్లా అశ్వారావుపేటలోని పెదవాగుకు భారీ వరద

నారాయణపురంలో 2 వాగుల మధ్య చిక్కుకున్న 25 మంది

హెలికాప్టర్ ద్వారా బాధితులను రక్షించిన సిబ్బంది

రాష్ట్రంలో నేడు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు



పెదవాగు ఉధృతిలో చిక్కుకున్న వ్యక్తిని హెలికాప్టర్ సాయంతో రక్షిస్తున్న దృశ్యం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఒకవైపు ఎడతెరిపి లేని వర్షం.. మరోవైపు ఆకస్మికంగా వచ్చి పడిన వరద.. ఇంతలో మొరాయించిన ప్రాజెక్టు గేటు.. కట్టకు గండ్లు.. దాని పైనుంచి ప్రవాహం.. ఏ క్షణంలోనైనా తెగి ఊళ్లు మునిగే ప్రమాదం..! మధ్యలో చిక్కుకుపోయిన ప్రజలు..! ఇదీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడపల్లి సమీపంలోని పెదవాగు రేపిన కలకలం. గురువారం తెల్లవారుజాము నుంచి ఎగువన భారీ

మిగతా 14వ పేజీలో...

వయసును ఇక అడ్డుకోవచ్చు!

వయసుతోపాటే శరీరాన్ని క్షీణింపజేసే ఐఎల్-11 ప్రోటీన్‌ను గుర్తించిన శాస్త్రవేత్తలు

వాషింగ్టన్, జూలై 18: ఎక్కువ కాలంపాటు జీవించటం, ఆరోగ్యంగా జీవితాన్ని గడపటం.. ఎన్ని తరాలు మారినా, ఎన్ని శతాబ్దాలు గడిచిపోయినా.. ఎప్పటికప్పుడు మనుషులు కోరుకునేది ఇదే. కాలం గడుస్తున్నకొద్దీ మనిషి సగటు జీవిత కాలం పెరుగుతోంది. అయితే, దానిని మరింత పెంచటానికి, ముఖ్యంగా వయసు పెరుగుతున్న కొద్దీ సంభవించే శారీరక దుర్బలత్వాన్ని అధిగమించటానికి అనేక (యాంటీ ఏజింగ్) పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ దిశగా.. సింగపూర్ శాస్త్రవేత్తలు తాజాగా ఓ ముందంజ వేశారు. వయసు పెరుగుదలకు కారణమవుతున్న ఓ ప్రోటీన్‌ను వారు తొలిసారిగా గుర్తించారు. ఈ ప్రోటీన్ ఉత్పత్తిని అడ్డుకోవటం ద్వారా.. వయసు పెరుగుతున్న కొద్దీ సంభవించే శారీరక క్షీణత ప్రక్రియ వేగాన్ని తగ్గించవచ్చని తెలిపారు. తద్వారా దీర్ఘ కాలం జీవించే అవకాశం ఉంటుందన్నారు. సింగపూర్‌లోని డ్యూక్-ఎన్‌యూఎస్ మెడికల్ స్కూల్ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన నిర్వహించారు. మనుషుల్లో గుండె, మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తుల పనితీరులో ఇంటర్‌ల్యూకిన్ (ఐఎల్-11) అనే ప్రోటీన్ కీలక ప్రభావం చూపుతున్న విషయాన్ని వీరు గుర్తించారు. ఈ ప్రోటీన్ ఉత్పత్తి పెరుగుతున్నా కొద్దీ కాలేయంలో, పొట్టలో కొవ్వు పేరుకుపోతోందని, కండరాలు బలహీనపడుతున్నాయని వెల్లడైంది. ఇవన్నీ శారీరక ధృడత్వాన్ని తగ్గించి.. తద్వారా వయసు పెరుగుదల ప్రక్రియను కొనసాగించే లక్షణాలే.

ఆడ ఎలుకల్లో ఆయుర్దాయం మరింత వృద్ధి

సింగపూర్ శాస్త్రవేత్తలు తమ పరిశోధన కొనసాగిస్తూ ఎలుకలపై ప్రయోగాలు నిర్వహించారు. వాటి నుంచి ఐఎల్-11 ప్రోటీన్‌ను తొలగించటం, ఐఎల్-11 నిరోధక చికిత్సను నిర్వహించటం వంటివి జరిపారు. దీని ద్వారా ఎలుకల్లో.. వయసు పెరుగుతున్న కొద్దీ సంభవించే శారీరక క్షీణత, వ్యాధులు, బలహీనత మొదలైన వాటి నుంచి రక్షణ లభించింది. వాటి సగటు జీవితకాలం 24.9% పెరిగింది. 75 వారాల వయసులో ఉన్న ఎలుకల్లో (ఇది మనుషుల్లో దాదాపు 55 ఏళ్ల వయసుతో సమానం) ఐఎల్-11 నిరోధక చికిత్సను ప్రారంభించి అవి మరణించే వరకు కొనసాగిస్తే.. మగ ఎలుకల సగటు జీవిత కాలం 22.5%, ఆడ ఎలుకల సగటు జీవితకాలం 25% పెరిగింది. అంతేకాదు, ఆరోగ్య సమస్యలు తీసుకొచ్చే తెల్ల కొవ్వు బదులు క్యాలరీలను ఖర్చు చేసే బ్రౌన్‌ఫ్యాట్ ఉత్పత్తి ఎలుకల్లో మొదలైంది. గుండె సంబంధిత సమస్యల నుంచి కూడా వాటికి రక్షణ లభించింది. ఈ ఫలితాలపై డ్యూక్-ఎన్‌యూఎస్ డీన్ ప్రొఫెసర్ థామస్ కాఫ్‌మన్ మాట్లాడుతూ, ఐఎల్-11 ప్రోటీన్ గురించి తాజాగా వెల్లడైన అంశాలు.. వృద్ధులు మరింత ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించటానికి దోహదపడతాయని చెప్పారు. కండరాల పటుత్వం, శారీరక ధృఢత్వం పెరగటం ద్వారా వృద్ధులు జారి పడిపోయే ప్రమాదం కూడా గణనీయంగా తగ్గుతుందన్నారు. 'ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఆరోగ్యవంతమైన దీర్ఘకాలిక జీవితాలు గడిపేలా ఐఎల్-11 చికిత్సను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్నది మా లక్ష్యం' అని పరిశోధనలో పాలుపంచుకున్న శాస్త్రవేత్త స్టార్ట్ కుక్ పేర్కొన్నారు. ఈ పరిశోధనకు సంబంధించిన వివరాలు తాజాగా సైన్స్ జర్నల్ నేచర్‌లో ప్రచురితమయ్యాయి. వయసు పెరుగుదల ప్రక్రియను నెమ్మదింపజేసే పరిశోధనలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయి. మనుషుల జీవితకాలాన్ని ఒక ఏడాది కాలం పాటు పొడిగిస్తే.. అది 38 ట్రిలియన్ డాలర్ల (రూ.83,62,225 కోట్ల) సంపదను సృష్టిస్తుందని అంచనాలున్నాయి.

లోకం తీరు



సుప్రీంకోర్టు జడ్జీలుగా కోటీశ్వర్ సింగ్, మహదేవన్ ప్రమాణం



న్యూఢిల్లీ, జూలై 18: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్, జస్టిస్ ఆర్.మహదేవన్ బాధ్యతలు చేపట్టారు. గురువారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ వారితో ప్రమాణం చేయించారు. దీంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 34కు చేరింది. ఈశాన్య రాష్ట్రం మణిపూర్ నుంచి సుప్రీంకోర్టు తొలి జడ్జిగా జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌కు ప్రాతినిధ్యం దక్కిన సంగతి తెలిసిందే.. అంతకుముందు జమ్మూ కశ్మీర్, లడఖ్ ప్రధాన న్యాయమూర్తిగా కోటీశ్వర్ సింగ్, మద్రాస్ హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తిగా మహదేవన్ పనిచేశారు.

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు కరోనా

వాషింగ్టన్, జూలై 18: అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార పర్వం కీలక దశలో ఉండగా.. ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్(81) కరోనా బారిన పడ్డారు. కరోనా పాజిటివ్‌గా తేలడంతో ఎన్నికల ప్రచారానికి తాత్కాలికంగా దూరమయ్యారు. అధ్యక్షుడు జో బైడెన్ కరోనా పాజిటివ్‌గా తేలడంతో టీకా తీసుకున్నారని, తన స్వగృహంలో ఐసోలేషన్‌లో ఉన్నారని వైట్ హౌస్ వర్గాలు బుధవారం ప్రకటించాయి. బైడెన్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఇంటి నుంచే విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నాయి. తాను అనారోగ్యానికి గురయ్యాయని బైడెన్ కూడా ఎక్స్(ట్విటర్)లో పోస్ట్ చేశారు. కరోనా పాజిటివ్‌గా తేలడంతో లాస్‌వెగాస్‌లో బుధవారం తలపెట్టిన ప్రచార కార్యక్రమాన్ని బైడెన్ చివరి నిమిషంలో రద్దు చేసుకున్నారు. లాస్‌వెగాస్ నుంచి తిరుగు ప్రయాణమైనప్పుడు తన అధికారిక విమానం ఎయిర్ ఫోర్స్ వన్ వద్ద విలేకరులతో మాట్లాడిన బైడెన్.. తాను ఆరోగ్యంగానే ఉన్నానని పేర్కొన్నారు. కాగా బుధవారం ఓ ఇంటర్వ్యూలో బైడెన్ మాట్లాడుతూ.. తనకు తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తితే వైద్యుల సూచన మేరకు అధ్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకోవడంపై ఆలోచిస్తానని చెప్పారు. ఆ ప్రకటన చేసిన కాసేపటికే ఆయన కరోనా బారిన పడ్డారు.

వాహనం అద్దానికి 'ఫాస్టాగ్' అంటించకపోతే రెట్టింపు రుసుము!

న్యూఢిల్లీ, జూలై 18: జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులారా జాగ్రత్త! ఇకపై ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తమ వాహనం ముందు అద్దానికి 'ఫాస్టాగ్‌ను అంటించకపోతే టోల్ ప్లాజాల్లో రెట్టింపు రుసుమును వసూలు చేస్తారు. ఈ మేరకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) గురువారం మార్గదర్శకాలు జారీ చేసింది. ఫాస్టాగ్ ఉన్నప్పటికీ దాన్ని వాహనం ముందు అద్దానికి లోపలి నుంచి అతికించకుండా టోల్ లేన్‌లోకి వచ్చిన వారి నుంచి రెట్టింపు చార్జీ వసూలు చేయాలని స్పష్టం చేసింది. ఇలాంటి వారి వల్ల టోల్‌ప్లాజాల్లో అనవసర జాప్యం చోటుచేసుకుంటుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఫాస్టాగ్ అంటించకపోతే రెట్టింపు రుసుము వసూలు చేసే విషయాన్ని అన్ని టోల్ ప్లాజాల్లో ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించింది.

మళ్లీ తెరుచుకున్న రత్న భండార్

పూరీ, జూలై 18: పూరీలోని 12వ శతాబ్దానికి చెందిన ప్రముఖ పుణ్య క్షేత్రం జగన్నాథ ఆలయం ట్రెజరీ రత్న భండార్‌ను వారంలోనే రెండోసారి గురువారం తెరిచారు. రత్న భండార్‌లో మిగిలి ఉన్న బంగారం, విలువైన నగలను భారీ భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఒడిసా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పర్యవేక్షక కమిటీ సభ్యులు జగన్నాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయంలోకి ప్రవేశించారు. పూరీ మాజీ రాజు గజపతి మహారాజ దివ్య సింగ్ దేవ్ ఆలయ సముదాయంలోని స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ట్రెజరీలోని బంగారం, విలువైన నగలను భారీ భద్రత మధ్య తరలిస్తున్నట్లు మీడియాకు వెల్లడించారు.

రైతును అవమానించిన జీటీ మాల్‌కు 7 రోజులు తాళం: కర్ణాటక మంత్రి వెల్లడి

బెంగళూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): రైతును అవమానించిన బెంగళూరులోని జీటీ మాల్‌కు ఏడు రోజుల పాటు తాళం వేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తామని కర్ణాటక రాష్ట్ర నగరాభివృద్ధి శాఖ మంత్రి భైరతి సురేశ్ తెలిపారు. హావేరి జిల్లాకు చెందిన నాగరాజు, తన తండ్రి పకీరప్పతో కలిసి జీటీ మాల్‌కు వెళ్లారు. పకీరప్ప పంచెకట్టుతో ఉండటంతో జీటీ మాల్‌కు వచ్చినప్పుడు సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్న విషయం తెలిసిందే. దీంతో కన్నడ సంఘాలు, రైతుసంఘాలు బుధవారం ఆందోళనకు దిగాయి. దీంతో మాల్ యాజమాన్యం బహిరంగ క్షమాపణలు చెప్పింది. అవమానానికి గురైన రైతును పిలిపించి సత్కరించింది. ఈ నేపథ్యంలో గురువారం శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగానే రైతును అవమానించిన సంఘటనను కాంగ్రెస్ సభ్యులు ప్రస్తావించారు. దీంతో నగరాభివృద్ధి శాఖ మంత్రి భైరతి సురేశ్ స్పందించారు.

ఉద్యోగాల్లో కన్నడిగులకు మొదటి హక్కు

» 'రిజర్వేషన్ల'పై చర్చలు కొనసాగుతాయి : ప్రియాంక ఖర్గే

బెంగళూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కన్నడిగులకు రాష్ట్రంలోని ఉద్యోగాల్లో మొదటి హక్కు ఉంటుందని ఐటీ బీటీ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే స్పష్టం చేశారు. ప్రైవేటు సంస్థలు, పరిశ్రమల్లో కన్నడిగులకు ఉద్యోగావకాశాలు కల్పించే రిజర్వేషన్ల విషయంపై తదుపరి చర్చలు కొనసాగుతాయని తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగ రిజర్వేషన్లపై వచ్చిన సందేహాలను నివృత్తి చేసేందుకు పారిశ్రామికవేత్తలతో చర్చిస్తామని తెలిపారు. గందరగోళం తలెత్తిన నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా వేశామని అన్నారు. బిల్లు తుది దశకు చేరాలంటే పలు చర్చలు జరగాల్సి ఉంటుందన్నారు. కర్ణాటకలోని పలు కంపెనీలకు ఆంధ్రప్రదేశ్ గాలం వేస్తోందని అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్.. నాస్కాంను తమ రాష్ట్రానికి రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

దేశవ్యాప్తంగా 25 వేల మందికి ఉద్యోగాలిచ్చా

» నా పిల్లలు కర్ణాటకలో ఉద్యోగానికి అనర్హులా?

» ఫోన్‌పే కో ఫౌండర్ సమీర్ నిగమ్

బెంగళూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలో ప్రైవేటు రంగ సంస్థలు, పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలనే విషయమై ప్రభుత్వం వెనకడుగు వేసినా.. ప్రముఖుల అసంతృప్తి మాత్రం కొనసాగుతూనే ఉంది. ఫోన్‌పే కో ఫౌండర్, సీఈవో సమీర్ నిగమ్ ఈ మేరకు 'ఎక్స్' ద్వారా ఆసక్తికర పోస్టు చేశారు. తన వయస్సు 46 ఏళ్లు అని, తన తండ్రి ఇండియన్ నేవీలో పనిచేశారని, తాను ఎక్కడా 15ఏళ్లు కూడా నివసించలేదని పేర్కొన్నారు. తన కంపెనీల ద్వారా దేశవ్యాప్తంగా 25 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చానని తెలిపారు. కానీ తన పిల్లలు కర్ణాటకలో ఉద్యోగాలు చేయడానికి అర్హులు కారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇటువంటి బిల్లులను తీసుకురావాలని భావించడం సరికాదని అభిప్రాయపడ్డారు. సమీర్ పోస్టుకు వ్యతిరేకంగా, అనుకూలంగా నెటిజన్లు స్పందిస్తున్నారు.

దొరల్లో దొంగలు!

నకిలీ ధ్రువపత్రాలతో ఆలిండియా సర్వీసులకు ఎంపిక



నకిలీ సర్టిఫికెట్లు, తప్పుడు చిరునామాలు, అడుగడుగునా ఉల్లంఘనలు, మోసాలతో అక్రమంగా ఆలిండియా సర్వీసెస్‌కు ఎంపికైన ట్రైనీ ఐఏఎస్ పూజాఖేద్కర్ వివాదం నేపథ్యంలో.. అలాంటి అక్రమార్కుల వివరాలు మరిన్ని వెలుగులోకి వస్తున్నాయి! ఉదాహరణకు.. కేరళకు చెందిన 2016 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అసిఫ్ కె.యూసుఫ్ తమ కుటుంబానికి క్రీమీలేయర్ స్థాయి కంటే తక్కువ ఆదాయం ఉందంటూ తప్పుడు సమాచారంతో ఓబీసీ సర్టిఫికెట్ పొందినట్టు తాజాగా వెల్లడైంది. దీంతో.. 'ఇదుగో ఈ అభ్యర్థులు సివిల్స్‌కు అక్రమంగా ఎంపికయ్యారు' అంటూ చాలా మంది 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేస్తున్నారు. వారు పేర్కొంటున్న అధికారులందరూ అక్రమ మార్గాల్లో సివిల్స్‌కు ఎంపికయ్యారని చెప్పడానికి ఆధారాలు లేవుగానీ.. కొందరు మాత్రం నిజంగానే తప్పుదోవ పట్టినట్టు ఫొటోలు, వీడియోలు, ఇతర ఆధారాల ద్వారా బయటపడిపోతోంది. తాజా కేసులే కాదు.. గతంలో ఇలా తప్పుడు పత్రాలు సమర్పించి దొరికిపోయిన వారి వివరాలూ ఇప్పుడు బయటకు వస్తున్నాయి. ఉదాహరణకు.. 2008 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి నవనీత్‌కుమార్.. యూపీఎస్సీ పరీక్ష రాసే వయసు దాటిపోవడంతో ఏకంగా తన పేరు, వయసునే మార్చేసుకుని, నకిలీ పత్రాలతో పరీక్ష రాశారు. ఆ పత్రాలతో ఉద్యోగం సంపాదించి.. 2017 దాకా పనిచేశారు. తర్వాత ఆ విషయం బయటపడడంతో సీబీఐ ఆయనపై కేసు నమోదు చేసింది. నవనీత్ కుమార్ అసలు పేరు రాజేశ్‌కుమార్ శర్మ అనే విషయం సీబీఐ దర్యాప్తులో బయటపడింది. తాజా కేసులను పరిశీలిస్తే.. 2011 బ్యాచ్‌కు చెందిన అభిషేక్ సింగ్ దివ్యాంగుల కోటాలో ఐఏఎస్ అధికారి అయ్యారు. 2023 దాకా ఆయన పదవిలో ఉన్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో చెప్పా పెట్టకుండా సెలవు పెట్టడంతో యూపీ సర్కారు ఆయన్ను సస్పెండ్ చేసింది. దీంతో ఆయన తన పదవికి రాజీనామా చేసి.. నటుడిగా మారారు. నిజానికి ఆయన ఐఏఎస్‌గా ఉండగానే పలు మ్యూజిక్ వీడియోల్లో నటించారు. దివ్యాంగులో కోటాలో ఐఏఎస్ అయిన అభిషేక్ సింగ్ జిమ్‌లో కసరత్తులు చేస్తున్న వీడియోలు, పాటలకు నృత్యం చేస్తున్న వీడియోలు.. ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. అవే కాదు.. సన్నీలియోన్, ఆదా శర్మ వంటివారితో ఆయన చేసిన మ్యూజిక్ వీడియోలనూ పలువురు షేర్ చేసి.. తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు. అలాగే.. 2023లో మధ్యప్రదేశ్‌కు చెందిన దివ్య యాదవ్ సివిల్స్‌కు ఎంపికయ్యారు. ఆమె తండ్రి రాజు యాదవ్ ఏఎస్ఐగా పని చేస్తున్నారు. ఒక ఏఎస్ఐ కుమార్తె సివిల్స్ సాధించిందంటూ మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వచ్చాయి. కానీ.. ఆమె ఎస్సీ కోటాలో ఎంపికయ్యారన్న విషయం బయటపడడంతో.. విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే.. ఐఈఎస్ (ఇండియన్ ఎకనమిక్ సర్వీస్) అధికారి కుమార్తె అయిన సర్నా యాదవ్ 2019లో సివిల్స్‌కు ఓబీసీ-నాన్ క్రీమీలేయర్ కోటాలో ఎంపిక కావడం ఏమిటని విమర్శిస్తున్నారు. ఇలాంటి కేసులు.. ఇంకా చాలానే ఉన్నాయని సమాచారం.

అది మరింత ఆందోళనకరం..

నకిలీ ధ్రువీకరణ పత్రాలతో యూపీఎస్సీ పరీక్ష రాసి ఆలిండియా సర్వీసెస్‌కు ఎంపికైనవారు ఏదో ఒక దశలో దొరికిపోయే అవకాశాలే ఎక్కువని.. దీని కన్నా, తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చే వ్యవస్థే మరింత ప్రమాదకరమని రవికపూర్ అనే ఐఆర్ఎస్ అధికారి ఆందోళన వ్యక్తం చేశారు. సివిల్స్ రాసిన పలువురు దివ్యాంగ అభ్యర్థులు.. తాజా పరిణామాల నేపథ్యంలో తాము పడుతున్న కష్టాల గురించి వివరిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. మరికొందరేమో.. "నీట్, యూపీఎస్సీ, యూజీసీ-నెట్.. ఇలా పరీక్ష ఏదైనా, అక్రమాలు మామూలు అయిపోయాయి. ఇలాంటివన్నీ చూస్తుంటే ఈ పరీక్షల విశ్వసనీయత మీదే నమ్మకం పోతోంది. పరీక్ష రాయాలన్న ఆసక్తీ పోతోంది" అని నిర్వేదంగా అంటున్నారు. వీటన్నింటి నేపథ్యంలో.. పూజా ఖేద్కర్, అసిఫ్ కె.యూసుఫ్, అభిషేక్ సింగ్ వంటివారిని ఎంపిక దశలోనే ఏరివేసేలా యూపీఎస్సీ కఠిన చర్యలు తీసుకోవాలని.. ఎంపికప్రక్రియను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దాలని, సర్టిఫికెట్ల తనిఖీ మరింత మెరుగ్గా చేయాలని పలువురు నిపుణులు సూచిస్తున్నారు. ఇలాంటి కేసులు బయటపడినప్పుడు.. నిందితులపై వేగంగా కఠిన చర్యలు తీసుకుంటే.. తర్వాత మరొకరు ఆ తప్పు చేయడానికి భయపడతారని అభిప్రాయపడుతున్నారు.

– సెంట్రల్ డెస్క్

ఈడబ్ల్యూఎస్ కోటాలో మస్క్.. ఓబీసీ కోటాలో గేట్స్

తప్పుడు ధ్రువపత్రాలతో కొంతమంది ఆలిండియా సర్వీసులకు ఎంపికవుతున్న వార్తలు వరుసగా వస్తుండడంతో.. సోషల్ మీడియాలో ఈ అంశంపై మీమ్స్ వెల్లువెత్తుతున్నాయి. "అపర కుబేరుడు ఎలాన్ మస్క్ ఆర్థికంగా బలహీన వర్గాల (ఈడబ్ల్యూఎస్) కోటాలో సివిల్స్‌కు దరఖాస్తు చేస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం" అంటూ 'ఎక్స్'లో ఒక వ్యక్తి వ్యంగ్య పోస్ట్ పెట్టారు. మస్క్‌ను స్ఫూర్తిగా తీసుకుని బిల్ గేట్స్ సైతం ఓబీసీ-నాన్ క్రీమీ లేయర్ కోటాలో యూపీఎస్సీకి దరఖాస్తు చేయాలనుకుంటున్నారంటూ ఆ వ్యంగ్యపోస్టుకు మరికొంత మసాలా దట్టించారు. చాలామంది.. బాలీవుడ్ చిత్రాల్లోని ఇంటర్వ్యూ సన్నివేశాలతో సివిల్స్ ఎంపిక ప్రక్రియలో లోపాలపై మీమ్స్ సృష్టించి వాటిని వైరల్ చేస్తున్నారు.

పూజా ఖేద్కర్ తల్లి అరెస్టు

హత్యాయత్నం కేసు.. రెండు రోజుల కస్టడీ

ముంబై, జూలై 18: వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ తల్లి మనోరమ ఖేద్కర్‌ను ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. భూ వివాదంలో రైతులను గన్‌తో బెదిరించిన వీడియో వైరల్ అయిన నేపథ్యంలో మనోరమతోపాటు ఆమె భర్త దిలీప్ ఖేద్కర్‌పై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆ దంపతులిద్దరూ పరారీలో ఉన్నారు. పుణె జిల్లా మహద్‌లోని ఓ లాడ్జిలో దాక్కున్న మనోరమను గురువారం ఉదయం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా, జడ్జి రెండు రోజుల పోలీసు కస్టడీకి అప్పగించారు. ఆమెపై భారతీయ న్యాయ సంహిత చట్టంలోని వివిధ సెక్షన్లతోపాటు తాజాగా హత్యాయత్నం అభియోగాలను నమోదు చేశారు. ఇప్పటికే ఆమె కుమార్తె పూజా ఖేద్కర్‌కు నకిలీ పత్రాలతో ఐఏఎస్‌కు ఎంపికైన, అధికార దుర్వినియోగానికి పాల్పడిన కేసుల్లో ఉచ్చు బిగుస్తోంది. మరోవైపు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో దిలీప్ ఖేద్కర్‌పై బహిరంగ విచారణ జరపాలంటూ పుణె ఏసీబీ(అవినీతి నిరోధక బ్యూరో)కి ఫిర్యాదు అందింది. మహారాష్ట్ర రిటైర్డ్ ప్రభుత్వ అధికారి అయిన దిలీప్ వ్యాపార వేత్తలను ముడుపులు డిమాండ్ చేసిన అభియోగాలతో రెండు సార్లు సస్పెన్షన్‌కు గురైనట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. 'దిలీప్‌పై ఇప్పటికే అహ్మద్‌నగర్ యూనిట్‌లో నాసిక్ ఏసీబీ బహిరంగ విచారణ జరుపుతోంది. తాజాగా, ఆయనపై బహిరంగ విచారణ జరపాలని ఫిర్యాదుదారు నుంచి మాకు అభ్యర్థన అందింది. ఫిర్యాదుదారు వాంగ్మూలాన్ని నమోదు చేసి, దానితోపాటు ఆధారాలను ఏసీబీ ప్రధానకార్యాలయానికి పంపించాం' అని పుణె ఏసీబీ ఎస్పీ అమోల్ తాంబే చెప్పారు. తాజా ఫిర్యాదును ఇప్పటికే కొనసాగుతున్న దర్యాప్తులో కలిపి విచారించాలా? లేక విడిగా విచారణ జరపాలా? అనే విషయంపై ఏసీబీ ప్రధాన కార్యాలయం నుంచి మార్గనిర్దేశం కోరామని తెలిపారు.

పరీక్ష కేంద్రాల వారీగా నీట్ ఫలితాలు

(మొదటి పేజీ తరువాయి)

ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ చేపట్టింది. ఈ నెల 11న జరిగిన విచారణలో సీబీఐ, ఎన్టీఏ వాదనలను నమోదు చేసుకుంది. గురువారం మరోమారు విచారణ చేపట్టింది. శనివారం ఫలితాలను నగరాలు, పరీక్ష కేంద్రాల వారీగా విడుదల చేయాలని జస్టిస్ డీవై చంద్రచూడ్ ఈ సందర్భంగా ఎన్టీఏను ఆదేశించారు. ఈ నెల 22న మరోమారు విచారణ చేపడతామని సూచించారు. పేపర్ లీకేజీ దేశంలోని అన్ని ప్రాంతాల్లో జరగలేదని అభిప్రాయపడ్డ ధర్మాసనం.. కేవలం పట్నా, హజారీబాగ్‌కే పరిమితమైనట్లు వెల్లడించింది. గుజరాత్, ఇతర ప్రాంతాల్లో పేపర్ లీక్ అవ్వలేదని చెప్పలేమని పేర్కొంది. గోద్రాలో కేవలం అభ్యర్థుల తరఫున ఇతరులు ఓఎంఆర్ షీట్లను నింపినట్లు తేలిందని వివరించింది. పిటిషనర్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. "పేపర్ లీకేజీ అనేది దేశవ్యాప్తంగా జరగలేదు. అలా జరిగిందనడానికి వేర్వేరు నగరాల్లో కాంటాక్ట్‌లను గుర్తించలేదు. లక్షల మంది విద్యార్థులు ఈ కేసు తీర్పు కోసం ఎదురు చూస్తున్నారు. పరీక్ష పవిత్రత విస్తృత స్థాయిలో దెబ్బతిన్నదని గుర్తిస్తేనే మరోమారు పరీక్ష నిర్వహణకు ఆదేశాలు జారీ చేయగలం. దీనిపై సీబీఐ దర్యాప్తు జరుగుతోంది. సీబీఐ ఇప్పటి వరకు మాకు చెప్పిన దర్యాప్తు వివరాలను మేం బహిర్గతం చేశాం" అని వ్యాఖ్యానించింది. ప్రశ్న పత్రం లీకేజీ కొన్ని కేంద్రాలకే పరిమితమైందా? లేదా దేశవ్యాప్తంగా వ్యాపించిందా? అనే విషయాలు తెలియాలంటే.. పరీక్ష కేంద్రాల వారీగా ఫలితాల విడుదల కీలకమని అభిప్రాయపడింది.

సీబీఐ అదుపులో ఎయిమ్స్ విద్యార్థులు

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ గురువారం పట్నాలోని ఎయిమ్స్‌లో చదువుతున్న నలుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకుంది. వీరిలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న చందన్‌సింగ్, రాహుల్ అనంత్, కుమార్ షాను, రెండో సంవత్సరం విద్యార్థి కరణ్ జైన్ ఉన్నారు. "సీబీఐ అధికారులు హాస్టల్ గదుల్లోనే విద్యార్థులను విచారించారు. ఆ తర్వాత ఆ గదులకు సీల్ వేసి, విద్యార్థులను తమ వెంట తీసుకెళ్లారు" అని పట్నా ఎయిమ్స్ డైరెక్టర్ జీకే పాల్ తెలిపారు. అయితే.. ఈ కేసులో సీబీఐ ఇటీవల అరెస్టు చేసిన పంకజ్ కుమార్ అలియాస్ ఆదిత్య అనే ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌తో ఈ నలుగురు విద్యార్థులకు సంబంధాలు ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కొత్త నేర చట్టాలపై సమీక్షకు బెంగాల్‌లోనూ కమిటీ

కోల్‌కతా, జూలై 18: కొత్త నేర చట్టాలపై మోదీ ప్రభుత్వంతో తలపడేందుకు సిద్ధమయ్యారు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ! మోదీ సర్కారు ఈ నెల 1 నుంచి అమలులోకి తెచ్చిన ఈ చట్టాలను సమీక్షించేందుకు ఆమె ఏడుగురు సభ్యుల కమిటీని నియమించారు. రాష్ట్రస్థాయిలో ఈ చట్టాల్లో చేయాల్సిన సవరణలు, పేర్ల మార్పు అంశాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. కమిటీకి బెంగాల్ లోకాయుక్త అషీమ్‌కుమార్ రాయ్ నేతృత్వం వహిస్తారు.

కఠిన చట్టాల పేరుతో బెయిలివ్వకుండా ఆపలేరు

రాజ్యాంగ విలువలకు కోర్టులు కట్టుబడి ఉండాలి: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, జూలై 18: నేర శిక్షాస్మృతిలోని కఠిన చట్ట నిబంధనలు నిందితులకు బెయిలివ్వకుండా రాజ్యాంగబద్ధ కోర్టులను ఆపలేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 21వ రాజ్యాంగ నిబంధన ప్రసాదించిన జీవించే హక్కు, వ్యక్తి స్వేచ్ఛ విస్తృతమైనవీ, పవిత్రమైనవని తేల్చి చెప్పింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం(ఉపా) కింద అరెస్టయిన నేపాలీ పౌరుడు షేక్ జావేద్ ఇక్బాల్‌కు బెయిలు మంజూరు చేస్తూ విడుదల చేయాలని ఆదేశించింది. జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. ఎంత కఠినమైన శిక్షాస్మృతి చట్ట నిబంధన అయినా దాని అర్థాన్ని తీసుకొనే సమయం లో రాజ్యాంగ న్యాయస్థానం(హైకోర్టు, సుప్రీంకోర్టు) రాజ్యాంగ విలువలకు, చట్టబద్ధ పాలనకు కట్టుబడి ఉండాలని చెప్పింది. ఆ రెండింటిలోనూ వ్యక్తి స్వేచ్ఛ అంతర్లీనంగా ఉంటుందని వివరించింది. ఈ నేపాలీ వ్యక్తి కేసులో రాజ్యాంగ న్యాయస్థానం బెయిలు ఇవ్వొచ్చు.. ఇవ్వకపోవచ్చు కానీ ఫలానా చట్టం కింద బెయిలు ఇవ్వడం కుదరదని చెప్పడం తప్పే అవుతుందని స్పష్టం చేసింది. ఇక్బాల్ నేపాల్లో భారతదేశపు నకిలీ నోట్లను చెలామణి చేస్తున్నట్లు అంగీకరించాడని పోలీసులు ప్రకటించారు. అతని మీద 489(బి), 489(సి) కింద నకిలీ నోట్లు ఉంచుకున్నాడని, నకిలీ నోట్లు చెలామణి చేస్తున్నాడని కేసు పెట్టారు. దానికి తీవ్రవాదులపై ప్రయోగించే ఉపా చట్టాన్ని జోడించారు. ఇక్బాల్ తొమ్మిదేళ్లుగా కస్టడీలో ఉన్నాడని, ఈకేసు ఇప్పట్లో తేలే వాతావరణం కనబడటం లేదని నిందితుడి తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇక్బాల్ తీవ్రమైన నేరానికి పాల్పడ్డాడని, నేపాలీ పౌరుడు అయినందున దేశం విడిచి పారిపోయే ప్రమాదం ఉందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ న్యాయవాదులు సుప్రీంకోర్టుకు విన్నవించారు. నత్తనడకన నడుస్తున్న ఈ కేసు ఎప్పట్లోగా తేలుతుందో స్పష్టత లేదని కోర్టు అభిప్రాయపడింది. పాస్‌పోర్టు, పౌరసత్వ పత్రాలను తీసుకొని అతన్ని విడుదల చేయాలని ఆదేశించింది. ఇప్పటికే స్వాధీనం చేసుకుంటే ట్రయల్ కోర్టుకు అప్పగించాలని పేర్కొంది. ట్రయల్ కోర్టు విచారణకు క్రమం తప్పకుండా హాజరు కావాలని నిందితుడికి చెప్పింది. విచారణ పూర్తయ్యే దాకా పక్షం రోజులకు ఒకసారి పోలీసు స్టేషన్‌కు వచ్చి సంతకం పెట్టాలని ట్రయల్ కోర్టు నిబంధన పెట్టొచ్చని సూచించింది.

పట్టాలు తప్పిన మరో రైలు

» చండీగఢ్- దిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం

» ఒకరి మృతి.. 35 మందికి గాయాలు

గోండా, న్యూఢిల్లీ, జూలై 18: సరిగ్గా నెల రోజుల వ్యవధిలో మరో రైలు ప్రమాదం.. పశ్చిమబెంగాల్‌లో గత నెలలో కాంచన్ జంగా ఎక్స్‌ప్రెస్‌ను గూడ్స్ రైలు ఢీకొట్టిన ఘటనను మర్చిపోకముందే యూపీలోని గోండా జిల్లాలో రైలు పట్టాలు తప్పింది. గోండా-గోరఖ్‌పూర్ సెక్షన్ మోతీగంజ్, ఝులాహీ స్టేషన్ల మధ్య గురువారం చండీగఢ్-దిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో ఒకరు మృతిచెందారు. 35 మందికి గాయాలయ్యాయి. ఈ రైలు బుధవారం అర్ధరాత్రి పంజాబ్‌లోని చండీగఢ్ నుంచి అసోంలోని దిబ్రూగఢ్‌కు బయల్దేరింది. యూపీ చేరాక.. గురువారం మధ్యాహ్నం ఝులాహీ స్టేషన్ సమీపంలో పట్టాలు తప్పింది. మొత్తం 23 బోగీలకు గాను 5 ఏసీ బోగీలు సహా 8 పట్టాలు తప్పాయి. ప్రమాద విషయం తెలియగానే యూపీ సీఎం యోగి సహాయక చర్యలకు ఆదేశించారు. అసోం సీఎం హిమంత ఘటనపై ఆరా తీశారు. 40 మందితో కూడిన వైద్య బృందం, 15 అంబులెన్స్‌లు సహాయ చర్యల్లో నిమగ్నమయ్యాయి. ఈ మార్గంలోని 13 రైళ్లను దారి మళ్లించారు. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది. క్షతగాత్రులకు రూ.2.5 లక్షలు, స్వల్పంగా గాయపడినవారికి రూ.50 వేలు ఇవ్వనున్నట్లు తెలిపింది. దుర్ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. తాను పెద్ద శబ్దంతో పేలుడు విన్నట్లు చండీగఢ్-దిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్ రైలు డ్రైవర్ తెలిపాడు.

బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లపై రగడ

» ఘర్షణల్లో 33 మంది మృతి

» 2వేల మందికి పైగా గాయాలు

ఢాకా, జూలై 18: బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. ఇప్పటి వరకు 33 మంది పౌరులు మృతి చెందగా.. 2వేలకు పైగా ప్రజలు గాయపడ్డారు. గురువారం ఒక్కరోజే 19 మంది మరణించినట్లు అక్కడి అధికారులు తెలిపారు. బంగ్లాదేశ్ విముక్తి కోసం 1971లో అశువులు బాసిన వారి వారసులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 30 శాతం కోటాను కల్పించారు. ఈ పద్ధతిని సంస్కరించి ప్రతిభ ఆధారంగా పట్టం కట్టాలని అక్కడి వర్సిటీ విద్యార్థులు, ప్రజలు కొన్నిరోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం ఆందోళనకారులు రెండు బస్సులకు నిప్పు పెట్టారు. నిరసనలు హింసాత్మకంగా మారడంతో పోలీసులు రబ్బరు బులెట్లు, టియర్ గ్యాస్ ప్రయోగించారు. కొన్నిచోట్ల అధికార అవామీ లీగ్ విద్యార్థి సంఘం నాయకులు.. ఆందోళనకారులను అడ్డుకునే ప్రయత్నం చేయగా ఘర్షణల్లో ఆరుగురు పౌరులు మరణించారు. చాలా మంది గాయపడ్డారు. గురువారం రాంపురా ప్రాంతంలోని టెలివిజన్ భవన్‌లో మీడియా ప్రతినిధులతో సహా చాలా మంది చిక్కుకుపోయారు. ఘర్షణలు తీవ్రతరం కావడంతో ప్రధాని షేక్ హసీనా పరిస్థితిని సమీక్షించారు. భద్రతా బలగాలను రంగంలోకి దించారు. దేశవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. విద్యాసంస్థలు, మదర్సాలను మూసివేయాలని, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు తెరవద్దని అధికారులు ఆదేశించారు.

బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా మౌర్య?

మోదీ, అమిత్ షాలకు అత్యంత సన్నిహిత నేత

» యూపీలో పలు ఎంపీ సీట్లలో ఓటమికి యోగిని బాధ్యుడిని చేయాలని ఎత్తులు



న్యూఢిల్లీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్యను నియమించవచ్చునని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మౌర్య యూపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కాలంలోనే 2017లో యూపీలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని, పార్టీలో కింది స్థాయి నుంచి ఎదిగిన ఆయనకు అవకాశం కల్పించవచ్చని చర్చ జరుగుతోంది. మౌర్య వెనుకబడిన వర్గాలకు చెందిన నేత కావడంతో బీసీలను తమ వైపునకు తిప్పుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని బీజేపీ అగ్రనేతలు భావిస్తున్నారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలకు అత్యంత సన్నిహితుడైన మౌర్యను 2017లోనే యూపీ ముఖ్యమంత్రిగా నియమించాలనుకున్నప్పటికీ.. యోగీ ఆదిత్యనాథ్ రంగంలోకి దిగడంతో అది సాధ్యం కాలేదు. మౌర్యకూ యోగికీ పచ్చగడ్డి వేస్తే భగ్గుమన్నట్లు విభేదాలున్నాయని, యోగి ప్రతి కదలికనూ ఆయన ఢిల్లీకి చేరవేస్తారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాగా, పార్టీ కంటే ఎవరూ గొప్పకాదని బుధవారం మౌర్య చేసిన ప్రకటన చర్చకు దారి తీసింది. మంగళవారం మౌర్య ఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్ షాలను కలిసి వెళ్లిన తర్వాత ఈ ప్రకటన చేయడంతో మౌర్య ద్వారా ఢిల్లీ నేతలు యోగికి సందేశాలు పంపినట్లు భావిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పలు సీట్లు కోల్పోవడంపై యోగిని జవాబుదారీ చేయాలని అధిష్ఠానం భావిస్తోంది. అయితే, ఈ ఓటమితో తనకు సంబంధం లేదని, తనను సంప్రదించకుండా అభ్యర్థులను ఎంపిక చేశారని యోగి అన్నట్లు సమాచారం. త్వరలో యూపీలో పది అసెంబ్లీ స్థానాలకు జరిగే ఉప ఎన్నికలు యోగి భవిష్యత్తును నిర్ణయించవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్‌తో పాటు 9 మంది ఎమ్మెల్యేలు లోక్‌సభకు ఎంపిక కావడం, ఒక సమాజ్‌వాదీ ఎమ్మెల్యేపై అనర్హత వేటు పడడంతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ పది సీట్లలో గతంలో ఐదు సీట్లు ఎస్పీ గెలుచుకున్నవే. ఈ ఉప ఎన్నికలకు ముందే బీజేపీకి జాతీయ అధ్యక్షుడిగా కేశవ్ ప్రసాద్ మౌర్యను నియమిస్తారా..? లేదా..? అన్న దానిపై స్పష్టత లేదు. అయితే యోగి మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న మౌర్యనే జాతీయ అధ్యక్షుడిగా నియమించడం ద్వారా యోగిని ఇరకాటంలో పెట్టాలని బీజేపీ అగ్రనేతలు భావిస్తున్నట్లు సమాచారం.

గడ్చిరోలి ఎన్‌కౌంటర్ మృతదేహాల గుర్తింపు

- మృతులపై రూ.86 లక్షల రివార్డు
- బీజాపూర్‌లో మందుపాతర పేలి ఇద్దరు జవాన్ల మృతి

చర్ల, బీజాపూర్, మహదేవపూర్, జూలై 18: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో బుధవారం మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో మృతి చెందిన 12 మంది మావోయిస్టులను పోలీసులు గుర్తించారు. నక్సల్స్ మృతదేహాలను మహారాష్ట్ర బలగాలు బుధవారం అర్ధరాత్రి గడ్చిరోలికి తరలించాయి. చనిపోయిన మావోయిస్టుల్లో ఏరియా కమిటీ సభ్యులు, డివిజన్ కమిటీ, దళ సభ్యులు ఉన్నారు. డీవీఎంసీ సభ్యులైన యోగేశ్ దావ్‌సింగ్, ప్రమోద్ లాల్సే కచ్లామి, విశాల్ కుల్లే ఆత్రంలపై తలా రూ.16 లక్షల రివార్డు ఉంది. అలాగే ఏరియా కమిటీ సభ్యులైన మహర్ ధోబీ, అనిల్ దేవ్‌సే, విజ్జు, సరితా, రాజోలపై ఒక్కొక్కరి మీద రూ.6 లక్షల రివార్డు.. రోజా, సాగర్, సీతాహాక్, చందం పోద్యంలపై తలా 2 లక్షల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. వీరి నుంచి అధునాతన తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు ఐఈడీ పేల్చి ఇద్దరు జవాన్ల ప్రాణాలు తీశారు. బీజాపూర్, సుక్మా, దంతేవాడ జిల్లా సరిహద్దులో కూంబింగ్ నిర్వహించి వస్తున్న భద్రతా సిబ్బందే లక్ష్యంగా ఈ దాడి జరిగింది. "బుధవారం రాత్రి సోదాలు ముగించుకొని వస్తున్న క్రమంలో బలగాలను లక్ష్యంగా చేసుకుని తెర్రం పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు ఐఈడీ బాంబు పేల్చారు. ఈ ఘటనలో జవాన్లు సత్తార్ సింగ్ బమ్హాని, భరత్ లాల్ సాహు మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు" అని పోలీసులు చెప్పారు.



సీపీఐ నేత రాయల చంద్రశేఖర్ ఆత్మహత్య


చంద్రశేఖర్‌రావు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 18: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిటీ చైర్మన్, కేంద్ర కమిటీ సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ (75) వ్యక్తిగత కారణాలతో ఖమ్మంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే పోలీసులు వివరాలు తెలుసుకుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. రాయల చంద్రశేఖర్ భౌతిక కాయాన్ని గురువారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఖమ్మం కార్యాలయానికి ప్రజల సందర్శనార్థం తరలించారు. ఎంపీలు రేణుకాచౌదరి, రాఘురామరెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సీపీఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. రాయల చంద్రశేఖర్ మృతి పట్ల మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు సంతాపం ప్రకటించారు. అనంతరం పిండిప్రోలులో ఆయన అంతిమ యాత్ర నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే విప్లవోద్యమానికి ఆకర్షితుడైన రాయల చంద్రశేఖర్ పీడీఎస్‌యూలో కీలకంగా పనిచేశారు. 1975లో విప్లవోద్యమంలో రహస్య కార్యకర్తగా అడవి బాట పట్టారు. ఆ తర్వాత రైతు కూలీ సంఘం నాయకుడిగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలో పార్టీ నిర్మాణానికి కృషి చేశారు.

ఉపాధ్యాయులు వేధిస్తున్నారు

- వారి నుంచి నాకు ప్రాణభయం ఉంది
- పోలీసుస్టేషన్‌లో నిజామాబాద్ డీఈవో ఫిర్యాదు

నిజామాబాద్ అర్బన్, జూలై 18: జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు తనను వేధింపులకు గురిచేస్తున్నారని నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈవో) ఎన్.వి.దుర్గాప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు శంతన్, స్కూల్ అసిస్టెంట్లు బాలయ్య, ఓమాజీలు తరచూ తనపై వ్యక్తిగతంగా తప్పుడు ప్రకటనలు చేయిస్తున్నారని డీఈవో ఆరోపించారు. తనను మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై ఈనెల 1న తాను నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని అయినప్పటికీ, తనపై పత్రికల ద్వారా, సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విమర్శల వల్ల తనతో పాటు తన కుటుంబ సభ్యులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, సదరు ఉపాధ్యాయుల నుంచి తనకు ప్రాణభయం ఉందని ఫిర్యాదులో డీఈవో పేర్కొన్నారు. తనకు ఏదైనా జరిగితే వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. కాగా.. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో కొంతమంది ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని, క్యామ్ స్కానర్ పేరుతో అక్రమాలు జరిగాయని విశ్రాంత ఉపాధ్యాయుడు శంతన్, ఇతర ఉపాధ్యాయులు పలుమార్లు పత్రిక ప్రకటనలు ఇచ్చారు.

యువ రైతు ఉసురు తీసిన అప్పులు


సాంబరాజు

నర్మెట, జూలై 18: వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేననే బాధతో ఓ యువ రైతు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా నర్మెట మండలంలోని కన్నెబోయినగూడెం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన తోడేటి సాంబరాజు(29) మూడున్నర ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. భూమి చదును చేయడం, బోర్లు వేయడం కోసం రూ. 10లక్షల వరకు అప్పులు చేశాడు. బాకీలు తీర్చలేననే బెంగతో ఈ నెల 16న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

సింగరేణి కార్మికుల అరెస్టు అప్రజాస్వామికం: కూనంనేని

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి బొగ్గు గనులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టవద్దని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిరసన తెలిపిన నాయకులను అరెస్టు చేయడాన్ని తమ పార్టీ ఖండిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కేంద్రం బొగ్గు గనులను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని కోరారు. మరోవైపు సింగరేణి బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని కోరుతూ తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యవర్గం గురువారం ఎంబీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తీర్మానం చేసింది.

పార్థీ గ్యాంగ్‌లో మరో నిందితుడి అరెస్టు

నల్లగొండ క్రైం, జూలై 18: జాతీయ రహదారి 65పై వరుస దోపిడీలకు పాల్పడుతున్న పార్థీ గ్యాంగ్‌లోని మరో వ్యక్తిని నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ ముఠాలోని అప్ప పాండ్రంగా, శుభం అశోక్‌ను అనే వ్యక్తులను పట్టుకున్నారు. వారి నుంచి రాబట్టిన సమాచారంతో మూడో వ్యక్తి మహారాష్ట్రలోని సంగ్లి జిల్లా మీరజ్, మల్గావ్ ప్రాంతానికి చెందిన రాజ్‌కపూర్ త్రిభువన్‌గా గుర్తించారు. పాండ్రంగా, అశోక్‌కు బెయిల్ ఇప్పించేందుకు మహారాష్ట్ర నుంచి వచ్చిన రాజ్‌కుమార్‌ను చిట్యాల పీఎస్ పరిధిలో పట్టుకున్నామని డీఎస్పీ కొలను శివరాంరెడ్డి తెలిపారు. గత నెల 18న కట్టంగూరు పీఎస్ పరిధిలోని ఎరసానిగూడెం శివారులో కొల్లూరి రాజ్యవర్థన్ అనే డ్రైవర్ రోడ్డు పక్కన గూడ్స్ వాహనం ఆపి నిద్రపోతుండగా.. ఈ గ్యాంగ్ అతని కాళ్లు, చేతులు కట్టేసి, స్క్రూడ్రైవర్‌తో ఛాతిపై పొడిచి, విచక్షణారహితంగా కొట్టి చంపారు. అతని వద్ద ఉన్న రూ.14,500 దోచుకున్నారు. హతుడిది ఏపీలోని కృష్ణా జిల్లా పామర్రు మండలం చాట్లవానితండా. ఈ హత్యతో పాటు మరో 8 దోపిడీ దొంగతనం కేసుల్లో ప్రమేయం ఉన్నట్టు రాజ్‌కుమార్ అంగీకరించినట్టు డీఎస్పీ తెలిపారు.

ఫార్ములా 1540

గంటకు 1,540 కి.మీ.లు.. 48 గంటల్లో 74 వేల కి.మీ.ల ప్రయాణం !

రెండు రోజుల్లో వేల కిలో మీటర్లు చుట్టేసిన ఓ వాహనం



- గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంలో బయటపడిన వింత
- తప్పుడు బిల్లులతో భారీగా నగదు లూటీ
- మహబూబ్‌నగర్‌కు కేటాయించిన బిల్లులో గుర్తించిన ఏసీబీ

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా వన్ రేసులు కోసం తెలుసా.. !! ఈ రేసుల్లో పాల్గొనే కార్లు ట్రాక్‌పై అత్యధికంగా గంటకు 375 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించినట్టు రికార్డులు ఉన్నాయి. ఈ కార్లను మించిన వేగంతో రాష్ట్రంలో ఓ వాహనం దూసుకెళ్లిందనే విషయం మీకు తెలుసా ? ఓ వాహనం 48 గంటల వ్యవధిలో ఏకంగా 74వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. అంటే గంటకు 1540 కిలోమీటర్లు చొప్పున వాయువేగంతో దూసుకెళ్లింది. ఏంటి నిజమేనా అనుకుంటున్నారా.. ? గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంపై దర్యాప్తు చేస్తున్న ఏసీబీ అధికారులు ఈ వింతను గుర్తించినట్టు సమాచారం. గొర్రెల రవాణాకు సంబంధించి మహబూబ్‌నగర్ జిల్లాకు కేటాయించిన బిల్లులో ఈ విడ్డూరం బయటపడగా పెద్ద మొత్తంలో నిధుల గోల్‌మాల్ జరిగినట్టు తెలిసింది.గొర్రెల పంపిణీ పథకంలో రూ.700 కోట్ల అక్రమాలకు సంబంధించిన కేసులో ఏసీబీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాకు కేటాయించిన బిల్లులో ఓ వాహనం రెండ్రోజుల్లో 74 వేల కిమీలు ప్రయాణించినట్టు పేర్కొని ఉండడాన్ని గుర్తించినట్టు సమాచారం. 2018 ఫిబ్రవరి 20 నుంచి 22 వరకు కేవలం రెండు రోజుల్లో ఓ వాహనం మీటర్ రీడింగ్ ఏకంగా 74 వేల కిలోమీటర్లపైగా తిరిగినట్లు పేర్కొని అందుకు తగ్గ డబ్బులు చెల్లించి, వాటిని బినామీల ఖాతాల్లోకి దారి మళ్లించినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై, తమకు అనుకూలంగా బిల్లులు, నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి ఈ అక్రమానికి పాల్పడినట్టు కనిపెట్టారు. అంతేకాదు ఒక వాహనం ఒకే రోజు శ్రీకాకుళం నుంచి మహబూబ్‌నగర్, కడప నుంచి మహబూబ్‌నగర్ తిరిగినట్లు రికార్డుల్లో చూపించి బిల్లులు తీసుకున్న విషయం దర్యాప్తు అధికారుల దృష్టికి వచ్చింది. ఈ గొర్రెల రవాణా విషయంలో ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీగా వ్యవహరించిన సంస్థకు ఎండీ అయిన మొహిదొద్దీన్ ఈ కుంభకోణంలో కీలకంగా వ్యవహరించాడని అధికారులు ఇప్పటికే గుర్తించారు. కేసు నమోదైనప్పటి నుంచి మొహిదొద్దీన్ ఆయన కుమారుడు దుబాయ్‌లో తలదాచుకున్నారు. కేసుతో తమకు సంబంధం లేదని, కేవలం రవాణా వరకే చూసుకున్నామని ముందస్తు బెయిల్ కోరిన సమయంలో మొహిదొద్దీన్ కోర్టుకు వివరించారు. అయితే గొర్రెల రవాణాలోనూ అక్రమాలు బయటపడుతుండడంతో మొహిదొద్దీన్‌ను పట్టుకుని విచారణ చేసేందుకు ఏసీబీ సిద్ధమవుతుంది. రూ.700 కోట్ల గొర్రెల పంపిణీ కుంభకోణంలో ఏసీబీ ఇప్పటికే పలువురిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. కాగా, గొర్రెల కొనుగోళ్లకు సంబంధించి తమకు బిల్లులు చెల్లించలేదంటూ నల్లగొండకు చెందిన సుమారు 30 మంది రైతులు ఏసీబీ అధికారులను గురువారం ఆశ్రయించారు. అధికారులు వారి నుంచి వివరాలు సేకరించారు. ఖమ్మం, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, సంగారెడ్డి, సూర్యాపేట, వరంగల్ జిల్లాలకు చెందిన బాధితుల నుంచి కూడా అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

కూతురిపై కీచక తండ్రి అత్యాచారం

- నిందితుడి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

పీర్జాదిగూడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కంచె చేను మేసినట్లు ఓ కీచక తండ్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న తన కన్న కూతురిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ అమానవీయ ఘటన బుధవారం మేడిపల్లిలో జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తల్లి ఇంట్లో లేకపోవడంతో తనపై తండ్రి పాల్పడ్డ ఘోరాన్ని 12 ఏళ్ల ఆ బాలిక పక్కింటి మహిళకు చెప్పుకుంది. బాలిక చదువు కోసం ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటుండగా భర్తతో గొడవ పడ్డ ఆమె తల్లి ఇటీవలే పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో హాస్టల్‌లో ఉంటున్న కూతురిని తండ్రి రెండు రోజుల క్రితమే ఇంటికి తీసుకొచ్చాడు. ఒంటిరిగా ఉన్న కూతురిపై బుధవారం అత్యాచారానికి ఒడిగట్టాడు. ఏం చేయాలో పాలుపోని ఆ బాలిక తండ్రి ఇంటి నుంచి బయటకు వెళ్లగానే పక్కింటి మహిళకు చెప్పింది. దీంతో వారు మేడిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు తండ్రిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.

ఖాతా అప్‌డేట్ పేరిట రూ.లక్ష దోపిడీ

- 14 ఏళ్ల తర్వాత నిందితుడి అరెస్టు

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఖాతా అప్‌డేట్ పేరిట ఓ వ్యక్తి నుంచి 14ఏళ్ల క్రితం రూ.లక్ష కొట్టేసిన నిందితుడిని సీబీఐ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వరంగల్‌కు చెందిన ప్రభాకర్‌కు ఐసీఐసీఐ బ్యాంకులో ఖాతా ఉంది. బ్యాంకు ఖాతా వివరాలను అప్‌డేట్ చేయాలంటూ 2010లో ఆయనకు ఈ మెయిల్ వచ్చింది. దాంతో ఆయన మొత్తం వివరాలు నమోదు చేశారు. తర్వాత రెండు రోజులకు తన ఖాతా నుంచి రూ.లక్ష ముంబైలోని మరో ఖాతాకు బదిలీ అయినట్లు సందేశం రావడంతో ఆయన సీఐడీ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉండి 14 ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న ముంబైకి చెందిన పప్పు పటేల్‌ను సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు.

టీయూ వసతిగృహం సాంబార్‌లో పురుగులు



డిచ్‌పల్లి, జూలై 18: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయం ఉమెన్స్ హాస్టల్‌లో గురువారం రాత్రి సాంబారులో పురుగులు వచ్చాయి. దీంతో ఆగ్రహానికి గురైన విద్యార్థినులు తాము ఆ భోజనం చేయలేమని కేర్‌టేకర్‌కు తేల్చిచెప్పారు. ఇలా ఎన్నిసార్లు పురుగుల భోజనం పెట్టి తమ ఆరోగ్యం దెబ్బతీస్తారని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు వసతిగృహానికి సంబంధిత శాఖ వార్డెన్, కేర్‌టేకర్‌లను నిలదీశారు. వర్సిటీ అధికారుల నిర్లక్ష్యమే ఘటనకు కారణమని ఆరోపించారు. ఈ విషయమై శుక్రవారం వర్సిటీలో ఆందోళన చేస్తామని తెలిపారు.

కృష్ణా జలాలు విడుదల చేయండి

- ఏపీ సర్కారుకు తమిళనాడు ప్రభుత్వం లేఖ

చెన్నై, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగరానికి మంచినీటిని అందించే పూండి, చెంబరంబాక్కం సహా ఐదు జలాశయాల్లో నీటి మట్టం బాగా తగ్గిపోవడంతో తక్షణమే కండలేరు నుంచి కృష్ణానది జలాలను విడుదల చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తమిళనాడు ప్రభుత్వం గురువారం లేఖ రాసింది. ఈ విషయమై ఇప్పటికే తమిళనాడు నీటివనరుల శాఖ ఉన్నతాధికారులు ఏపీ ప్రభుత్వానికి రెండు సార్లు లేఖ రాశారు. అయితే కండలేరు జలాశయంలో నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో తెలుగు గంగ ఒప్పందం ప్రకారం పూండి రిజర్వాయర్‌కు జలాలను విడుదల చేయలేమని ఏపీ అధికారులు చేతులెత్తేసినట్లు సమాచారం. అదే సమయంలో తెలుగు గంగ కాల్వ మరమ్మతు పనులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఏపీ అధికారులు కోరారు.

అంగన్‌వాడీలకు పింఛన్ సౌకర్యం కల్పించండి

- అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పదవీవిరమణ పొందిన టీచర్లకు రూ.5 వేలు, ఆయాలకు రూ.3 వేల చొప్పున పింఛన్ అందించాలని రాష్ట్రంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈమేరకు మహిళా, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ, డైరెక్టర్ కాంతి వెస్లీలకు యూనియన్ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి మాట్లాడుతూ.. అలాగే పదవీవిరమణ కారణంగా ఖాళీ అవుతున్న పోస్టులను త్వరితగతిన భర్తీ చేయాలని, అంగన్‌వాడీలో ఉద్యోగంలో చేరినప్పుడు నాన్‌లోకల్‌గా ఉన్న వారికి స్థానికత ఆధారంగా బదిలీలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు.

నైజీరియా టు రాజమండ్రి వయా హైదరాబాద్

ప్రకాశం జిల్లాకు కూడా తరలింపు.. పక్కాగా నైజీరియన్ కలేషీ నెట్‌వర్క్

- చేతులు మారే కొద్దీ పెరిగే కొకైన్ ధర
- వెల్లడించిన పోలీసుల రిమాండ్ రిపోర్ట్



హైదరాబాద్ సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నైజీరియా డ్రగ్స్ దందా ప్రధాన నగరాలకే కాకుండా.. చిన్న నగరాలకు కూడా విస్తరించిందని తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ న్యాబ్) పోలీసులు గుర్తించారు. ఇటీవల టీజీ న్యాబ్, సైబరాబాద్ పోలీసులు జరిపిన దాడుల్లో పట్టుబడ్డ నైజీరియన్ గ్యాంగ్‌కు సంబంధించి కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో ఈ విషయాన్ని వెల్లడించారు. గతంలో హైదరాబాద్‌లో డ్రగ్స్ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసి.. ప్రస్తుతం నైజీరియాలో ఉంటున్న ప్రధాన నిందితుడు డివైన్ ఎబుకా సుజీ సముద్ర మార్గం ద్వారా కొకైన్‌ను భారత్‌కు పంపుతున్నాడని పేర్కొన్నారు. అక్కడి నుంచి ఢిల్లీకి చేరే కొకైన్.. హైదరాబాద్, గోవా, బెంగళూరు నగరాలకు సరఫరా అవుతుందని వివరించారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి, ప్రకాశం జిల్లాలకు చేరుతుందని రిమాండ్ రిపోర్ట్‌లో సరఫరా చైన్ వివరాలను పూసగుచ్చినట్లు వెల్లడించారు. "హైదరాబాద్ నెట్‌వర్క్‌ను ఎజియొనిలి ఫ్రాంక్లిన్ ఉచెన్నా అలియాస్ కలేషీ నిర్వహిస్తున్నాడు. బెంగళూరుకు చెందిన హెయిర్ స్టైలిస్ట్ యువతి ఒనుహ బ్లెస్సింగ్ అలియాస్ జోయానాగోమ్స్ ఈ సరఫరా చైన్‌లో కీలక పాత్ర పోషిస్తోంది. ఆమె ఢిల్లీ నుంచి కొకైన్‌ను రైలు, విమానాల్లో హైదరాబాద్‌కు తరలిస్తోంది. కలేషీ దాన్ని డ్రగ్స్ పెడ్లర్లు ఆయిజ్ మహీమ్ అడెషోలా(నైజీరియా దేశస్థుడు), బెంగళూరుకు చెందిన అల్లం సత్య వెంకట గౌతమ్, బోరబండకు చెందిన సన్నబోయిన వరుణ్‌కుమార్, బండ్లగూడ జాగీర్‌కు చెందిన మహమ్మద్ మహబూబ్ షరీఫ్‌కు అందజేస్తున్నాడు" అని టీజీ న్యాబ్ పోలీసులు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. గౌతమ్ ఏకంగా రాజమండ్రి, ప్రకాశం జిల్లాలకు డ్రగ్స్ నెట్‌వర్క్‌ను విస్తరించినట్లు తెలిపారు. గురువారం అన్ని రాష్ట్రాల సీఎస్‌లు, డీజీపీలు, హోంశాఖ ముఖ్య కార్యదర్శులతో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో నిర్వహించిన సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా డ్రగ్స్‌పై సమాచార మార్పిడిపై పరస్పర సహకారం అందించుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో టీజీ న్యాబ్ పోలీసులు రాజమండ్రి, ప్రకాశం జిల్లాల్లో డ్రగ్స్ దందాపై సమాచారాన్ని ఏపీ పోలీసులతో పంచుకోనున్నట్లు తెలిసింది.

కస్టమర్లకు సరఫరా చేసింది వీరే..!

నైజీరియా గ్యాంగ్‌పై దాడి సందర్భంగా పోలీసులు 13 మంది డ్రగ్స్ వినియోగదారులను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే..! వీరిలో నటి రకుల్ ప్రీత్‌సింగ్ సోదరుడు అమన్ ప్రీత్‌సింగ్ కూడా ఉన్నారు. గౌతమ్, వరుణ్, షరీఫ్ ద్వారానే ఈ 13 మందికి కొకైన్ చేరినట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో 10 మంది డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్‌గా తేలగా.. అమన్ ప్రీత్‌సింగ్, ప్రసాద్ అభయ్ మనాజ్కర్, నిఖిల్ ధావన్, చింతలపాటి మధుసూదన్‌కు నోటీసులు ఇచ్చారు. నైజీరియన్ డ్రగ్స్ స్మగ్లర్ల నుంచి పెడ్లర్లు.. వినియోగదారుల వరకు కొకైన్ చేతులు మారిన కొద్దీ దాని ధర రెండింతలు.. మూడింతలు.. నాలుగింతలు పెరుగుతూ ఉంటోందని పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లో వివరించారు.

గంజాయి కొట్టి గబ్బు కూతలు

- యూట్యూబర్ ప్రణీత్ హన్మంతు కేసులో ఫోరెన్సిక్ నివేదిక

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తండ్రీకూతుళ్ల బంధంపై సోషల్ మీడియాలో నీచవ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ ప్రణీత్ హన్మంతుకు ఉచ్చు బిగుస్తోంది. అరెస్ట్ సమయంలో ప్రణీత్ నుంచి సేకరించిన శాంపిల్స్‌లో.. అతడు గంజాయి సేవించిన ఆనవాళ్లు ఉన్నట్లు తేలింది. ఈమేరకు ఫోరెన్సిక్ నివేదిక సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) పోలీసులకు అందింది. ఇప్పటికే అతడిపై ఐటీ, పోక్సో యాక్ట్‌తోపాటు బీఎన్ఎస్ సెక్షన్లు 79, 294 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్న సీఎస్‌బీ పోలీస్‌లు.. ఆ నివేదిక ఆధారంగా నార్కోటిక్స్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్డీపీఎస్) యాక్ట్-1985 కింద కూడా కేసులో పలు సెక్షన్లు జోడించారు. ఈమేరకు ప్రభుత్వ న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు అంగీకరించింది. పోక్సో యాక్ట్ ప్రకారం ఈ కేసు తదుపరి విచారణను ప్రత్యేక పోక్సో జిల్లా కోర్టుకు బదిలీ చేశారు. కాగా ప్రణీత్ హన్మంతును పూర్తిస్థాయిలో విచారించేందుకు సీఎస్‌బీ అధికారులు మూడు రోజులు కస్టడీ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం నిందితుడి తరఫు న్యాయవాదికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలుకు గడువు కోరడంతో తదుపరి విచారణను పోక్సో కోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. ప్రస్తుతం చంచల్‌గూడ జైల్లో విచారణ ఖైదీగా ఉన్న ప్రణీత్‌ను కస్టడీకి తీసుకుని.. గంజాయి, డ్రగ్స్ లింకులపైనా వివరాలు సేకరించాలని సీఎస్‌బీ అధికారులు భావిస్తున్నారు. ఈ కేసులో ప్రణీత్‌పాటు నిందితులుగా ఉన్న డల్లాస్ నాగేశ్వర్ రావు, బుర్రా యువరాజ్, సాయి ఆదినారాయణ ఇంకా పరారీలోనే ఉన్నారు.

ప్రీలాంచ్ ఆఫర్ పేరిట రూ.60 కోట్ల మోసం

- జీఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ డైరెక్టర్ అరెస్టు

హైదరాబాద్ సిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకే ప్లాట్లు, విల్లాలంటూ ప్రీలాంచ్ ఆఫర్ పేరిట రూ.60 కోట్ల మేర వసూలు చేసి మోసం చేసిన జీఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ డైరెక్టర్ గంటుపల్లి శ్రీనివాసరావును సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం బుధవారం అరెస్ట్ చేసింది. కేసు వివరాలను పోలీసులు గురువారం వెల్లడించారు. ఏపీలోని గుంటూరుకు చెందిన గంటుపల్లి శ్రీనివాసరావు, చదలవాడ శ్రీనివాసరావు, వేమవరపు సత్యశిల్పతో కలిసి జీఎస్ఆర్ ఇన్‌ఫ్రా పేరుతో సంస్థను స్థాపించారు. కొల్లూరు సమీపంలో అపార్ట్‌మెంట్లు, విల్లాలు కడుతున్నామని, ప్రీ లాంచింగ్ ఆఫర్‌లో తక్కువ ధరకే ఇస్తున్నామని ప్రచారం చేశారు. మూడేళ్లలో నిర్మాణం పూర్తి చేస్తామని లేనిపక్షంలో 24 శాతం వడ్డీతో డబ్బు వెనక్కి ఇస్తామని కొనుగోలుదారులకు చెప్పారు. వీరి మాటలు నమ్మిన దాదాపు 31 మంది నుంచి రూ.60 కోట్లు వసూలు చేసి ఒప్పందాలు చేసుకున్నారు. గడువు ముగిసినా నిర్మాణం చేపట్టకపోవడంతో పెట్టుబడిదారులు నిలదీశారు. దీంతో జీఎస్ఆర్ సంస్థ ప్రతినిధులు ఏవో సాకులు చెప్పి కాలయాపన చేశారు. మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జాహ్నవి కందుల మృతిపై అపహాస్యం

- సియాటెల్ పోలీసు అధికారిపై వేటు

హైదరాబాద్, జూలై 18: అమెరికాలో తెలుగు విద్యార్థిని జాహ్నవి కందుల మృతిని చులకన చేసి మాట్లాడి, హేళనగా నవ్వుతూ దొరికిపోయిన పోలీసు అధికారి అడెరర్‌ను విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు సియాటెల్ పోలీసు డిపార్ట్‌మెంట్ తాత్కాలిక పోలీసు చీఫ్ స్యూ రహర్ బుధవారం ప్రకటించారు. నార్త్‌ఈస్ట్రన్ వర్సిటీ సియాటెల్ క్యాంపస్‌లో మాస్టర్స్ చదువుతున్న కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన జాహ్నవి కందుల 2023 జనవరి 23న రోడ్డు దాటుతున్న సమయంలో వేగంగా వస్తున్న పోలీసు వాహనం ఢీకొని మృతిచెందారు. అప్పట్లో ఈ ఘటనపై పోలీసు అధికారి అడెరర్ హేళన చేస్తూ మాట్లాడినట్లు అదే సంవత్సరం సెప్టెంబరు 11న విడుదల చేసిన బ్యాడీక్యామ్ ఫుటేజీలో కనిపించడం దుమారం రేపింది.

బెదిరింపుల కేసు.. నోరు మెదపని రాధాకిషన్‌రావు

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): క్రియా హెల్త్‌కేర్ వ్యవస్థాపకుడు చెన్నుపాటి వేణుగోపాల్‌ను నిర్బంధించి, బెదిరించి, షేర్లను బదిలీ చేయించిన కేసులో జూబ్లీహిల్స్ పోలీసుల విచారణలో టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు నోరు మెదపలేదని తెలిసింది. కోర్టు అనుమతితో రెండ్రోజుల పాటు రాధాకిషన్‌రావును కస్టడీకి తీసుకున్న పోలీసులు, ఏ ప్రశ్న అడిగినా.. ఆయన సమాధానం చెప్పలేదని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. దీంతో గురువారం మధ్యాహ్నం ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. అయితే.. ఈ కేసులో రాధాకిషన్ వాంగ్మూలం కీలకం కావడం.. ఆయన విచారణకు సహకరించకపోవడంతో మరో వారం రోజులు తమ కస్టడీకి అప్పగించాలంటూ జూబ్లీహిల్స్ పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలంటూ నిందితుడి తరఫు న్యాయవాదికి జడ్జి నోటీసులు జారీ చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యోగిపై అసమ్మతి

ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఉత్తర్‌ప్రదేశ్‌లో 33సీట్లకే పరిమితం కావడం, అది కేంద్రంలో మోదీ మూడో రాకను తీవ్రంగా ప్రభావితం చేయడంతో యూపీ బీజేపీని అసమ్మతి స్వరాలు, అంతర్గత వైరాలు చుట్టుముట్టాయని వార్తలు వస్తున్నాయి. రాష్ట్ర బీజేపీ నాయకులు ఢిల్లీ వెళ్ళివస్తున్నారు, ఏవో నర్మగర్భ వ్యాఖ్యలు చేస్తున్నారు. కొందరు అక్కడే తిష్టవేసి, ఇంత కాలమూ దాచుకున్న ఆగ్రహాన్ని వెళ్ళగక్కే ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కీ, ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్యకీ మధ్య విభేదాలు మరింత స్పష్టంగా బయటపడ్డాయి. యూపీ బీజేపీ అధ్యక్షుడు భూపేందర్ చౌదరి రాజీనామాకు సిద్ధపడితే పెద్దలంతా సముదాయించారని, ఓబీసీ మౌర్యకు మరింత ప్రాధాన్యం పెంచి, ఠాకూర్ యోగిని నియంత్రించాలని అనుకుంటున్నారని ఏవో విశ్లేషణలు వెలువడుతున్నాయి. రాష్ట్రంలో పది అసెంబ్లీస్థానాలకు ఉప ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈమాత్రం హడావుడి సహజం.

తమకు తగ్గడం కంటే, సమాజ్‌వాదీ–కాంగ్రెస్ కూటమికి మరో పదిలోక్‌సభ స్థానాలు ఎక్కువ రావడం యూపీ బీజేపీ నేతలను భయపెడుతోంది. ఈ ఎదురుగాలి మరింత బలపడి రేపటి ఉప ఎన్నికలమీద ప్రభావం చూపుతుందన్న అనుమానం వారిని వెంటాడుతోంది. భారతీయ జనతాపార్టీని ఈ మారు యూపీ ఎన్నటికీ మరవనంత దెబ్బకొట్టింది. చార్‌సౌ పార్, తీన్‌సౌ పార్ ఎటూ లేక పోగా, సొంతకాళ్ళమీద కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయలేని స్థితిలోకి ఆ పార్టీ జారుకోవడంలో యూపీ పాత్ర ప్రధానమైనది. మోదీ దశాబ్దకాలపు ఏకపార్టీ పాలనకు ముగింపు పలికి, మిత్ర పక్షాలమీద ఆధారపడాల్సిన పరిస్థితిని కల్పించింది. 80స్థానాలున్న రాష్ట్రంలో ఐదేళ్ళకంటే 29స్థానాలు తగ్గి 33సీట్లకు పడిపోయి, ఎనిమిదిశాతం ఓట్లను ఆ పార్టీ కోల్పోయింది. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బాలరాముడి ప్రతిష్ఠ జరిగిన అయోధ్య (ఫైజాబాద్)లో ఆ పార్టీ అభ్యర్థి ఓడిపోవడం, దళితుడైన ఓ సమాజ్‌వాదీ అభ్యర్థి అక్కడ మంచి మెజారిటీతో గెలవడం, వారణాసినుంచి పోటీచేసిన మోదీకి గతంలో కంటే మెజారిటీ సగానికి తగ్గిపోవడం వంటి విచిత్రాలు సైతం యూపీలో అనేకం జరిగాయి.

బీజేపీ ప్రవచించే డబుల్ ఇంజన్ సర్కార్‌కు ఆది, పునాది యూపీయే. మోదీ–యోగి ద్వయం మిగతా బీజేపీ ముఖ్యమంత్రులకు నిన్నటివరకూ ఆదర్శం. ఎన్‌కౌంటర్లు, బుల్‌డోజర్ల భాష కూడా వారికి యోగి నేర్పిందే. యోగి ఆధ్వర్యంలో ఇప్పటివరకూ జరిగిన నాలుగు ఎన్నికల్లోనూ బీజేపీ మంచి ఫలితాలే సాధించింది. ఈ మారు ఆయన అభ్యర్థుల ఎంపికను పూర్తిగా అధిష్ఠానానికి వదిలేసి పెద్ద పొరపాటుచేశారని కొందరు అంటారు. ఓ నలభైమంది సిట్టింగ్‌లకు టిక్కెట్లు ఇవ్వవద్దని ఆయన ప్రతిపాదిస్తే ఢిల్లీ పెద్దలు పట్టించుకోలేదని మరికొందరు అంటారు. కారణాలు ఏమైనప్పటికీ, ఈ ఫలితాలతో యోగి తన ప్రాభవాన్ని కోల్పోయిన మాట నిజం. నిజానికి ఈమారు కూడా ఎప్పటిలాగానే ఎన్నికల ప్రచారంలో మోదీదే కీలకపాత్ర. రాష్ట్రాన్నే కాదు, యావత్ దేశాన్నే ఆయన చుట్టేశారు. నాలుగువందలో, కనీసం మూడువందలో సాధించి ఉంటే, ఆ ఘనత సహజంగానే మోదీఖాతాలో పడివుండేది. కానీ, ఫలితాలు భిన్నంగా ఉండటంతో యోగి చుట్టూ వేడిరాజుకుంటోంది. చిన్నాచితకా కులపార్టీలు యోగిపై వ్యాఖ్యలు చేయడం కంటే, సొంత పార్టీలోనే విమర్శలు రేగడం విశేషం. పరీక్షాపత్రాల లీకులు, అగ్నివీర్, కొత్త పెన్షన్ వంటి విధానాల మీద ప్రజాగ్రహం, యాదవేతర ఓబీసీల ఓట్లు బీజేపీకి తగ్గి ఎస్పీవైపు మళ్ళడం, దళితుల ఓట్లు బీఎస్పీనుంచి కాంగ్రెస్‌కు పోవడం, రాజ్యాంగం మార్పు మాట అణగారినవారిని భయపెట్టడం ఇత్యాదివి అనేకం బీజేపీ వెనుకంజకు కారణాలైనాయి. హిందూత్వాన్ని అధిగమించి సామాజిక న్యాయం ఎజెండా పనిచేయడంతో ఫలితాలు తారుమారైనాయి.

రాష్ట్రంలో రాబోయే ఉప ఎన్నికల్లో బీజేపీ తన సత్తా చూపని పక్షంలో అప్రదిష్టకు తోడు, అనేక కొత్త రాజకీయసమస్యలు పుట్టుకొస్తాయి. యోగి, మౌర్య, చౌదరీలను ఏకతాటిమీదకు తెచ్చి ఈ గండం దాటాలని బీజేపీ పెద్దలు భావిస్తున్నారు. ఉపఎన్నికల వరకూ మార్పుచేర్పులేవీ చేపట్టకుండా, ఆ ఘట్టం దాటాక సమూల ప్రక్షాళన జరపాలన్న ఆలోచన కూడా ఉండివుండవచ్చు. ఎస్పీ–కాంగ్రెస్ కూటమి బలపడుతున్న దశలో యూపీ బీజేపీని గాడిన పెట్టడం అధిష్ఠానానికి పెద్ద పరీక్షే.

ఆగనున్న మానవ మహాగమనం!

మానవజాతి చరిత్ర అంటే ఒక మహాగమనం! మరి ఇది ఎప్పుడు మొదలైంది? ఈ గమనంలో కీలక అడుగు ఎప్పుడు పడింది? పరిణామక్రమంలో మనిషి రెండు కాళ్లమీద నడవగలిగినప్పుడా? నిప్పును నియంత్రించగలిగినప్పుడా? భాషను కనిపెట్టినప్పుడా? భగవంతుడిని సృష్టించుకుని భరోసాతో కఠోర జీవితానికి ఎదురొడ్డి నిలిచినప్పుడా? వావివరసలకు అడ్డుగీతలు గీసినప్పుడా? సహజ కోరికలను అణచుకుని సంఘ జీవితానికి లోబడినప్పుడా? ప్రభుత్వ వ్యవస్థను ఏర్పరచుకున్నప్పుడా? అక్షరలిపితో భావితరాలకు జ్ఞాన ప్రసార దారులు తెరిచినప్పుడా? శ్రమవిభజనతో భిన్న ఉత్పత్తుల తయారీని మొదలుపెట్టినప్పుడా? వ్యవసాయాన్ని ఆరంభించి గ్రామ జీవితానికి పునాదులు వేసుకున్నప్పుడా? నగరాలను నిర్మించినప్పుడా? ఆవిరి యంత్రం కనిపెట్టి పారిశ్రామిక విప్లవాన్ని ఆరంభించినప్పుడా? బొగ్గు–చమురును ఇంధనంగా వాడటం నేర్చినప్పుడా? ఖండాంతరాలకు వలసలు పోయినప్పుడా?.. ఇవన్నీ మనిషి మహాగమనానికి సంబంధించి మహా ప్రశ్నలే! వీటికి జవాబులు చెప్పుకోకుండా మానవ చరిత్రను అర్థం చేసుకోలేం. అయినా లక్షల ఏళ్ల మానవ చరిత్రలో మహాగమన మైలురాళ్లపై, కీలక మలుపులపై కొత్త ప్రతిపాదనలు వస్తూనే ఉన్నాయి. ఇటీవల కాలంలో అలాంటి కొత్త ప్రతిపాదన చేసిన వాళ్లలో ప్రముఖ పర్యావరణ చరిత్రకారుడు జాన్ రాబర్ట్ మక్‌నీల్ ఒకరు. పీటర్ ఎంగెల్కీతో కలిసి 'ద గ్రేట్ యాక్సెలరేషన్' అనే పేరుతో 1945 నుంచి ఇటీవల వరకూ పర్యావరణ చరిత్రను చక్కని చిక్కని భాషలో తేలికగా అర్థమయ్యే రీతిలో వివరించారు.

మానవజాతి చరిత్రను యుగాలుగా విభజించటం అందరికీ తెలిసిందే. మనుషులు వాడే పనిముట్లు, ఆయుధాలు వేటితో తయారయ్యాయన్న దాన్ని బట్టి ఒక విధమైన యుగవిభజన జరిగింది. రాతి, కంచు, ఇనుము యుగాల పేర్లు అలా వచ్చినవే. అక్షరలిపి లేనప్పటి దశను చరిత్రకు పూర్వయుగమనీ, రాతకోతలు తెలిసిన తర్వాత స్థితిని చరిత్ర ఆరంభయుగంగానూ వర్గీకరించారు. ఇక భూమి చరిత్రను కూడా 19వ శతాబ్దం నుంచి ఎన్నో యుగాలుగా విభజించారు. ప్రధానంగా భూ పర్యావరణలో, జీవపరిణామంలో చోటుచేసుకున్న మార్పుల ఆధారంగానే ఈ విభజనలు జరిగాయి. మనం ఇప్పుడు జీవిస్తున్న యుగాన్ని హాలసీన్ యుగంగా పిలుస్తారు. 11,700 సంవత్సరాలు నాడు ఇది ప్రారంభమైంది. సరళంగా చెప్పుకోవాలంటే మంచుకాలాల మధ్య వచ్చిన సాధారణ ఉష్ణోగ్రతల కాలంగా దీన్ని భావించొచ్చు. ఈ సాధారణ ఉష్ణోగ్రతల వల్లే ప్రపంచంలో అనేక చోట్ల 11వేల సంవత్సరాల క్రితం వ్యవసాయానికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. వ్యవసాయంతో ఆహారధాన్యాల లభ్యత పెరిగింది. కొంతశాతం ప్రజలు ఆహారధాన్యాల ఉత్పత్తిలో పాల్గొనకపోయినా వారికీ ఇవ్వగలిగే స్థాయిలో ఉత్పత్తి జరిగేది. అట్లా కొందరికి గ్రామాలకు దూరంగా నగరాల్లో ఉండే అవకాశం లభించింది. తిండి గింజల లభ్యతల వల్లే కొందరు ఇతర వృత్తులు చేపట్టగలిగారు. ప్రభుత్వాలు కూడా అప్పుడే ఉనికిలోకి వచ్చాయి. ప్రభుత్వం అంటేనే సైన్యం, పోలీసులు, ఉద్యోగులు, ప్రభువుల సమాహారం. వీరి మనుగడకూ ఆహారధాన్యాల్లో వాటాలే కీలకం. ప్రాచీన, మధ్య యుగాలతో పాటు 18వ శతాబ్దంలో ఆరంభమైన పారిశ్రామిక విప్లవం కూడా ఈ హాలసీన్ యుగంలో ఏర్పడిన వాతావరణం వల్లే సాధ్యమైంది.

ఇంతటి ప్రాధాన్యం ఉన్న హాలసీన్ శకం ముగిసిందనీ భూచరిత్రలో కొత్త యుగం ప్రారంభమైందనీ మక్‌నీల్ ప్రతిపాదించారు. దీని స్థానంలో ఆంత్రపసీన్ అనే యుగం మొదలైంది. ఆంత్రపసీన్ యుగభావనను బాగా వాడుకలోకి తెచ్చింది నోబెల్ బహుమతి (1995) గ్రహీత పాల్‌కర్జన్. భూపర్యావరణంపై మనుషుల కార్యకలాపాల ప్రభావం విపరీతంగా పెరిగిపోయిందనీ కార్బన్‌డయాక్సైడ్ లాంటి వాయువులతో ధరిత్రికి చెందిన వ్యవస్థలన్నీ పెను ప్రభావాలకు లోనవుతున్నాయనీ కర్జన్ ప్రతిపాదించారు. జీవమనుగడకు తీవ్ర ముప్పుగా పరిణమించిన ఈ ప్రభావాలతో భూచరిత్రలో తీవ్ర మానవ ప్రభావిత యుగం (ఆంత్రపసీన్) మొదలైందనీ ఇది 18వ శతాబ్దం చివరలో ఆరంభమై ఇప్పటికీ కొనసాగుతోందనీ కర్జన్ చెప్పారు. బొగ్గు వినియోగంతో ప్రారంభమైన ఈ యుగం ఆ తర్వాత చమురు, సహజ వాయువుల వినియోగంతో పరుగులెత్తింది. కర్జన్ తర్వాత ఆంత్రపసీన్ గురించి చాలా విశ్లేషణలు వచ్చాయి. నిప్పు వినియోగంతోనే అది మొదలైందని కొందరు భావించారు. వ్యవసాయం, పశుపోషణల నాటి నుంచే ఆ యుగారంభాన్ని చూడాలని మరికొందరు చెప్పారు. మక్‌నీల్ మాత్రం 1945 నుంచి ఈ యుగం మొదలైనట్లుగా భావించాలని ప్రతిపాదించారు. బొగ్గు, చమురు, సహజ వాయువుల (శిలాజ ఇంధనాలు) వాడకం 1945 తర్వాత విపరీత స్థాయిలో పెరిగిపోయిందనీ, దానితో పాటుగా జనాభా పెరుగుదల విజృంభించి భూవ్యవస్థలు చరిత్రలో మునుపెన్నడూ లేనీ రీతిలో ప్రభావితం అయ్యాయని చెప్పారు. పర్యావరణంలో అతి కీలక మార్పులన్నీ ఈ రెండింటి (శిలాజ ఇంధనాలు–జనాభా) కారణంగానే జరిగాయి. మహాగమనానికి చోదక శక్తులుగా వీటినే ప్రధానంగా చెప్పుకోవాలి. శిలాజ ఇంధనాల వాడకం యంత్రాలు, వాహనాలకే పరిమితం కాలేదు. విద్యుత్తు, ఎరువులు, ప్లాస్టిక్ లాంటివెన్నో వీటి మీద ఆధారపడి ఉన్నాయి.



> ఏ కొలమానం నుంచి చూసినా మనుషుల కార్యకలాపాలతో భూమికి సంబంధించిన వ్యవస్థలన్నీ తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. మొత్తం భూచరిత్రలోనే ఇదొక అపూర్వ దశ. మానవ చేష్టలతో విపరీతంగా ప్రభావితమైన భూవ్యవస్థలన్నీ కలిసి మానవ కార్యకలాపాలకు అడ్డుకట్టగా మారితే అవాంఛనీయ శకం ప్రారంభమైనట్లే! ఇది అనివార్యమా? అంటే కాదనీ చెప్పలేం. ప్రత్యామ్నాయ ఇంధనాల ద్వారా భూవ్యవస్థలను గాడిలో పెట్టొచ్చనే అవగాహన క్రమేపీ పెరుగుతోంది. మరోవైపు జనాభా పెరుగుదల రేటు మందగిస్తోంది. ఇంకో యాభై ఏళ్లకు జనాభాలో తగ్గుముఖమూ కనపడుతుంది. శిలాజ ఇంధనాల శకమూ ముగుస్తుంది. ఈ పరిణామాల వల్ల 1945 నుంచీ మొదలైన మానవ మహాగమనం మందగిస్తుంది!



■ రాహుల్ కుమార్

ఏటా ఇంధన వినియోగాన్ని మిలియన్ చమురు టన్నుల పరంగా లెక్కిస్తారు. 1965లో అది 3,813 మిలియన్ టన్నులు ఉంటే 2015 నాటికి 12,730 మిలియన్ టన్నులకు పెరిగింది. ఇందులో చైనా (2,852), అమెరికా వాటా (2,266)లే ఎక్కువ. భారత్ వినియోగం 595 మిలియన్ టన్నులే. చరిత్ర దృష్టితో చూస్తే శిలాజ ఇంధనాల వినియోగంలో ఎక్కువ వాటాలున్న దేశాలు ఇతర దేశాలపై పెత్తనం చలాయించాయి. ఒకనాటి బ్రిటన్ పాత్రే దీనికి నిదర్శనం. ఇప్పుడు ప్రపంచాధిపత్యం చైనా, అమెరికాలదే. శిలాజ ఇంధనాల వాడకం 2013 నాటికి 87 శాతం (చమురు–33శాతం, బొగ్గు–30శాతం, సహజవాయువు–24శాతం) ఉంది. జల (7శాతం), అణు (4శాతం) విద్యుత్తు వాటా 11 శాతం మాత్రమే. జంతు, వృక్ష శిలాజాల్లో ఇంధనం నిక్షిప్తం కావటం అనేది పెద్ద ప్రక్రియ. ఇలా ఏటా నిక్షిప్తమయ్యే ఇంధనాన్ని మించి ఎక్కువగా వాడటం 1870ల నాటికే మొదలైంది. నిక్షిప్త నిల్వలను ఖాళీ చేయటంలో చివరి దశకు వచ్చేశాం. శిలాజ ఇంధనాల వల్ల కలిగే వాయు, జల, నేల కాలుష్యాల గురించి మనందరికీ తెలిసిందే. 1950 నుంచి 2015 వరకూ వాయు కాలుష్యంతో మూడు నుంచి నాలుగు కోట్ల మంది చనిపోయారు. ఇక చెర్నోబిల్, ఫుకుషిమా అణు విద్యుత్తు కేంద్రాల ప్రమాదాలతో అవీ సురక్షితం కావని తేలింది. అయినా 50 చోట్ల వాటి నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఉన్న 440 కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి జరుగుతోంది. జల విద్యుత్తు, సాగునీటి కోసం కట్టే డ్యాంలు ఎన్నో పర్యావరణ సమస్యలకు దారితీస్తున్నాయి. కోట్ల మంది దాకా నిర్వాసితులయ్యారు. భారత్‌లోనే 2 కోట్ల వరకూ నిర్వాసితులు ఉన్నారన్న అంచనాలు ఉన్నాయి. కట్టిన 15–20 ఏళ్లలోనే భారీగా పూడికలు ఏర్పడటం, దిగువ ప్రాంతాల్లో జీవవైవిధ్యానికి ముప్పుగా పరిణమించటం సర్వసాధారణమైంది. సంక్షిప్తంగా చెప్పుకోవాలంటే భూమికి చెందిన అయిదు ప్రధాన వ్యవస్థలు వాతావరణం (ఆట్మస్‌ఫియర్), నీటి నిల్వల భాగం (హైడ్రాస్‌ఫియర్), జీవ ప్రాంతం (బయాస్‌ఫియర్), ఘనభాగం (జియోస్‌ఫియర్), మంచుమయ ప్రాంతం (క్రయాస్‌ఫియర్) 1945 తర్వాత విపరీతంగా కకావికలయ్యాయి. మానవ, జంతు, వృక్ష కోటి మనుగడకు హానికరంగా మారిపోతున్నాయి.

జనాభా సంగతిని చూసినా భయానక చిత్రమే కన్పిస్తుంది. 1945లో 230 కోట్ల మంది జనాభా ఉంటే 2015 నాటికి 720 కోట్లకు చేరింది. ఈ ఏడాదికి 820 కోట్లు అవుతుంది. లక్షల సంవత్సరాల చరిత్రలో మానవుల జనాభా 100 కోట్లకు చేరటానికి యుగాలపాటు పట్టింది. 1800–1820ల నాటికి ఆ సంఖ్యకు మనుషులు చేరుకున్నారు. ఆ తర్వాత 1930ల నాటికి 200 కోట్లు అయ్యారు. అంటే రెట్టింపు కావటానికి వందేళ్లు పట్టింది. కానీ మరో 30 ఏళ్లలోనే 300 కోట్లకు చేరుకున్నారు. ఆ తర్వాత 15 ఏళ్లకు 400 కోట్లకు, మరో ఏడేళ్లకు 500 కోట్లకు చేరుకున్నారు. 1950–1955లో ఏటా సగటున 4.7 కోట్ల మంది పెరిగితే, 2010–2015 వచ్చేటప్పటికీ అది 8.2 కోట్లకు చేరుకుంది. అధిక జనాభా అంటే అధిక ఆహారోత్పత్తి. అధిక ఇంధన వినియోగం.. అధిక కాలుష్యం.. అధిక ఆర్థికాభివృద్ధి.. అధిక పర్యావరణ నాశనం.. అధిక వలసలు.. ఇవన్నీ కలిసి వందల సంవత్సరాల పాటు సరిదిద్దలేని విధ్వంసానికి దారితీస్తాయని మనుషులు భావించలేదు. విషాదం అదే! సొంత అవసరాలు, లాభాలు, అందివచ్చిన అవకాశాలతో పర్యావరణంతో ఆడుకున్నారు. 1970ల నుంచి పర్యావరణ ప్రమాదంపై చైతన్యం కలిగినా వందలేళ్ల పాటు హాలసీన్ యుగంలో మనుషులు ఏర్పరచుకున్న భావాలు, సిద్ధాంతాలు విరుగుడు అడుగులను ముందుకు పడనీయటం లేదు. గరిష్ఠంగా వినియోగం ద్వారా ప్రకృతిని వనరులను కొల్లగొట్టి ఆర్థికాభివృద్ధిని సాధించాలనే భావాలే హాలసీన్ యుగంలో మనుషులను శాసించాయి. ప్రముఖ ఆర్థికవేత్తలందరిదీ ఇదే పాట.

ఏ కొలమానం నుంచి చూసినా మనుషుల కార్యకలాపాలతో భూమికి సంబంధించిన వ్యవస్థలన్నీ తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. మొత్తం భూచరిత్రలోనే ఇదొక అపూర్వ దశ. మానవ చేష్టలతో విపరీతంగా ప్రభావితమైన భూవ్యవస్థలన్నీ కలిసి మానవ కార్యకలాపాలకు అడ్డుకట్టగా మారితే అవాంఛనీయ శకం ప్రారంభమైనట్లే! ఇది అనివార్యమా? అంటే కాదనీ చెప్పలేం. ప్రత్యామ్నాయ ఇంధనాల ద్వారా భూవ్యవస్థలను గాడిలో పెట్టొచ్చనే అవగాహన క్రమేపీ పెరుగుతోంది. మరోవైపు జనాభా పెరుగుదల రేటు మందగిస్తోంది. ఇంకో యాభై ఏళ్లకు జనాభాలో తగ్గుముఖమూ కనపడుతుంది. శిలాజ ఇంధనాల శకమూ ముగుస్తుంది. ఈ పరిణామాల వల్ల 1945 నుంచీ మొదలైన మానవ మహాగమనం మందగిస్తుంది! ఇప్పటికే కనిపిస్తున్న చిత్రం అదే! తప్పడుగులు వేస్తే మానవగమనానికే ముప్పు రావచ్చు!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

యూరోపియన్ యువత వైపరీత్యం

యూరోపియన్ దేశాలలో యువ ఓటర్లు మితవాద పార్టీల వైపు ఎందుకు మొగ్గుతున్నారు? వాతావరణ మార్పును నియంత్రించే విషయమై తమ ప్రభుత్వాల నిష్క్రియాపరత్వం పట్ల ఆగ్రహంగా ఉన్న యూరోపియన్ యువజనులు, మానవాళిని మహా సమస్యలపాలు చేస్తున్న వాతావరణ విపత్తును ఉపేక్షిస్తున్న పార్టీలకే ఎందుకు ఓటు వేశారు? ఏమిటీ వైరుధ్యం? అంతకంతకూ వేడెక్కుతూ, తీవ్ర ప్రమాదంలో పడుతున్న ధరిత్రి పరిరక్షణపై ఆ యువ ఓటర్ల రాజకీయ నిర్ణయం ఎలాంటి ప్రభావాన్ని చూపనున్నది?



■ సునీతా నారాయణ్

మట్టివాసన

యూరోపియన్ పార్లమెంటుకు గత నెలలో జరిగిన ఎన్నికలలో 30 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఓటర్లు ఎఎఫ్‌డి (జర్మనీ), నేషనల్ ర్యాలీ (ఫ్రాన్స్), వోక్స్ (స్పెయిన్), ది బ్రదర్స్ ఆఫ్ ఇటలీ (ఇటలీ), వ్లామ్స్ బెలాంగ్ (బెల్జియం), ఫిన్స్ పార్టీ (ఫిన్లాండ్) తదితర కరడుగట్టిన మితవాద పార్టీలకే ఓటు వేశారు. 2019 ఎన్నికలలో పర్యావరణవాద పార్టీలకు ఓటు వేసిన యువ ఓటర్లు 2024లో చాల వరకు పచ్చి మితవాద పార్టీలకు మద్దతునిచ్చారు. ఈ పరిణామాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? వాతావరణ మార్పును నియంత్రించేందుకు చేపట్టవలసిన చర్యల ఆవశ్యకతను యూరోపియన్ యువత ఎందుకు గుర్తించడంలేదు? పర్యావరణ పరిరక్షణ కంటే నిరుద్యోగిత, వలస సమస్యల పరిష్కారానికే వారు అగ్రప్రాధాన్యమిస్తున్నారా? మితవాద పార్టీలు సైతం వాతావరణ మార్పును అదుపు చేసేందుకు ఇప్పటికే అమలులో ఉన్న ప్రక్రియలను కొనసాగిస్తాయని వారు విశ్వసిస్తున్నారా?

వాస్తవమేమిటంటే తీవ్ర, వినాశనకర వాతావరణ వైపరీత్యాలతో యూరోపియన్ దేశాలూ మిగతా ప్రపంచ దేశాల వలే బాగా ప్రభావితమవుతున్నాయి. కర్బన ఉద్గారాలను తగ్గించడంలోను, ప్రపంచ సగటు ఉష్ణోగ్రత పారిశ్రామిక యుగ పూర్వ స్థాయికి కంటే 1.5 డిగ్రీ సెంటీగ్రేడ్ మాత్రమే ఎక్కువగా ఉండేలా పరిమితం చేయడంలోను యూరోపియన్ దేశాలు చిత్తశుద్ధితో చర్యలు చేపట్టడం లేదన్నది కూడా వాస్తవమే. ఈ పరిస్థితుల్లో బాగా వేడెక్కుతోన్న భూగ్రహం, వినాశనకర పర్యావరణాన్ని వారసత్వంగా పొందే యువజనులు, తమ శ్రేయస్సుకు హానికరంగా వాటిల్లుతున్న ఆ పరిణామాల పట్ల ఆందోళన చెందుతున్నారు. తమ భవిష్యత్తు విషయమై కలత చెందుతున్నారు.

వాతావరణ మార్పు విషమిస్తోంది. ఈ సమస్యను, కాదు సంక్షోభాన్ని గతంలో వలే కేవలం పర్యావరణవాద పార్టీలు, వామపక్షాలు మాత్రమే పట్టించుకుంటే సరిపోదు. అధికారానికి వస్తున్న రాజకీయ పక్షాలు అన్నీ దాన్ని పరిష్కరించేందుకు విధిగా పూనుకోవాలి. వాతావరణ మార్పుపై మితవాద పార్టీల వైఖరిని గమనిస్తే ఆ పరిణామాన్ని అవి పూర్తిగా నిరాకరించడంలేదు. కాకపోతే దాన్ని పట్టించుకుంటున్న తీరులో ఒక స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. అయితే ఆ మార్పు ఆశాజనకంగా లేదు. కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు అనివార్యంగా చేపట్టే ఇబ్బందికరమైన, కఠినమైన చర్యల పట్ల మరింత ప్రతిఘటన ఉంటుంది. డచ్ రాజకీయ పక్షం ఫ్రీడమ్ పార్టీనే తీసుకోండి. మాంసాహారం తినాలా వద్దా, విమానంలో ప్రయాణించాలా లేక పెట్రోల్, డీజిల్ కార్లలో వెళ్లాలా తదితర విషయాలపై ప్రజల నిర్ణయాలనే కానీ బ్రస్సెల్స్ (ఈయు ప్రధాన కార్యాలయం ఉన్న బెల్జియం రాజధాని)లోని అధికారుల ఆదేశాలను కాదని ఫ్రీడమ్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొంది. ఇంధన ధరల పెరుగుదల వల్ల ప్రజలపై మరింత ఆర్థిక భారం పడిందని ఆ మేనిఫెస్టో నిరసన వ్యక్తం చేసింది.



యూరోపియన్ యూనియన్ పార్లమెంటుకు గత నెలలో జరిగిన ఎన్నికలలో యువ ఓటర్లు మితవాద పార్టీల వైపు మొగ్గారు. వాతావరణ మార్పు పర్యవసానాలు, వలసల సమస్యలను సమర్థంగా ఎదుర్కొనేందుకు యువ యూరోపియన్ల రాజకీయ నిర్ణయం ఎంత మాత్రం దోహదం చేయదు.

శిలాజ ఇంధనాలపై పన్నుల భారాన్ని తగ్గించాలని సూచించింది. శిలాజ ఇంధనాల నుంచి పునరుద్ధరణీయ ఇంధన వనరులకు మారేందుకు ఇతర మితవాద పార్టీలు కూడా తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేశాయి. రైతులోకంలోను వ్యతిరేకతలు వ్యక్తమవుతున్నాయి. క్రిమిసంహారక మందుల వినియోగాన్ని యూరోపియన్ రైతులు వ్యతిరేకిస్తున్నారు; పశుగణాన్ని తగ్గించుకోవాలన్న ప్రతిపాదన వారి ఆమోదం పొందడం లేదు; మాంసాహారం తీసుకోవాలా వద్దా అనే ఉద్వేగాత్మక విషయమై నెలకొన్న వివాదం మొదలైన వాటిపై మితవాద పార్టీలు ఒకే తీరులో ప్రతిస్పందిస్తున్నాయి. ఇప్పటికే గ్రీన్ డీల్ (వాతావరణ మార్పు పర్యవసానాలను సమర్థంగా ఎదుర్కొనేలా ఆర్థిక వ్యవస్థలను రూపొందించేందుకు 2020లో యూరోపియన్ యూనియన్ దేశాలు ఆమోదించిన విధానాలు) బలహీనపడింది. వాతావరణ మార్పు నియంత్రణ కంటే జాతీయ పారిశ్రామిక ప్రయోజనాలను కాపాడుకోవడమే ప్రాధాన్యం పొందుతోంది. యూరోపియన్ యువజనులు వాతావరణ మార్పును నియంత్రించేందుకు చేపట్టే కఠిన చర్యలను సమర్థిస్తారా లేక జీవన వ్యయాన్ని భారం చేయని, ఇంధన ధరలు పెంచని, తమకు ఇష్టమొచ్చిన రీతిలో ప్రయాణించేందుకు వెసులుబాటునిచ్చే పరిష్కారాలనే ఎంచుకుంటారా? ఇదే ఇప్పుడు మనముందున్న ప్రశ్న. వాతావరణ మార్పును తక్షణ ప్రాతిదికన నియంత్రించవలసి ఉన్నది. ఆ సంక్షోభ తీవ్రత అటువంటిది. ఐరోపాతో సహా సంపన్న దేశాలు తమ కర్బన ఉద్గారాలను తగ్గించలేదు. మరి ఈ పరిస్థితులలో యూరోపియన్ ప్రభుత్వాల నిర్ణయాలు పెరుగుతోన్న భూతాపాన్ని తగ్గించగలుగుతాయా?

వర్తమాన ఐరోపాలో మరొక వైరుధ్యం కూడా ఉన్నది. అది పారిశ్రామిక ప్రపంచమంతటా ఉన్నది. ఇతర దేశాల నుంచి వలస వచ్చినవారు తమ ఉద్యోగాలను స్వాయత్తం చేసుకుంటున్నారని యూరోపియన్ యువత ఆందోళన చెందుతున్నది. తత్కారణంగానే వారు మితవాద రాజకీయ పక్షాల వైపు మొగ్గుతున్నారు. వలసకారులను అనుమతించకూడదని ఈ మితవాద పార్టీలు ఏనాటి నుంచో డిమాండ్ చేస్తున్నాయి. కొన్ని పక్షాలు అయితే బహిరంగంగానే జాతి వివక్షను చూపుతున్నాయి.

వాస్తవమేమిటంటే తమ ఆర్థిక వ్యవస్థల పటిష్ఠ నిర్వహణకు వలస వచ్చిన శ్రామికులు, నిపుణుల సేవలు ఐరోపాకు అవసరం. వలసకారులు లేకుండా ఐరోపా మన లేదు. తమ పంటల సాగుకు, రైళ్లను నడిపేందుకు, ఫ్యాక్టరీలలో పని చేసేందుకు, నగరాలను శుభ్రం చేసేందుకు ఇతర దేశాల నుంచి వచ్చే వారి అవసరం ఐరోపాకు ఎంతైనా ఉన్నది. 2020లో 8.70 కోట్ల మంది అంతర్జాతీయ వలసకారులు ఐరోపాలో నివశిస్తున్నారని 'వరల్డ్ మైగ్రేషన్ రిపోర్ట్–2024' వెల్లడించింది. 2015లో కంటే ఇది 16 శాతం అధికం.

సరే, అక్రమ వలసకారుల గురించి ప్రస్తావించక తప్పదు. వీరు ఎంత మంది ఉంటారన్న విషయమై కచ్చితమైన అంచనా లేదు. ఐరోపాకు వీరు ఎంత అధిక సంఖ్యలో వస్తున్నారంటే చేరిన గమ్యాలలో స్థానికులను సైతం స్థానభ్రంశం చేస్తున్నారు. వాతావరణ మార్పు పర్యవసానాలు కూడా వేనవేల మందిని నిర్వాసితులను చేస్తున్నాయి. దీనివల్ల కూడా వలసలు విపరీతంగా పెరుగుతున్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే వాతావరణ మార్పును నియంత్రించడంలో యూరోపియన్ దేశాలు ఎట్టి పరిస్థితులలోను అలసత్వం చూపకూడదు. ఆ నిర్లక్ష్యం వల్ల యూరోపియన్లే కాకుండా విశాల ప్రపంచ ప్రజలు కూడా మరింతగా చిక్కుల్లో పడతారు. వాటిల్లే విపత్తులను ఎదుర్కోవడం వారికి కష్టమవుతుంది. డోనాల్డ్ ట్రంప్ –వచ్చే నవంబర్‌లో జరగనున్న అధ్యక్ష ఎన్నికలలో ఈయన మళ్లీ విజయం సాధించే అవకాశమున్నది– అమెరికాలో కూడా వాతావరణ మార్పు నియంత్రణపై విముఖత బాగా ఉన్నది. వలసకారులపై వ్యతిరేకత పెరుగుతోంది. ఈ రెండు అంశాలు అమెరికా సమాజంలో విద్వేష ధోరణులకు ఎంతైనా ఆస్కారమిస్తున్నాయి. ఏతావాతా మన ప్రపంచం సమస్యల సుడిలో కొట్టుమిట్టాడుతోంది.

(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

'వర్సిటీ' విద్యకు పూర్వవైభవం రావాలి!

రాష్ట్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం యూనివర్సిటీలను నిర్వీర్యం చేసింది. ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, శాతవాహన, పాలమూరు, జేఎన్టీయూ తదితర 15 రాష్ట్ర విశ్వవిద్యాలయాల సంక్షేమానికి బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించలేదు. కేంద్ర ఉన్నత విద్యాశాఖ విడుదల చేసిన 'నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్' ర్యాంకులలో ఉస్మానియా, కాకతీయ, జేఎన్టీయూ ర్యాంకులు దిగజారడానికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమే. శాతవాహన, తెలంగాణ లాంటి కొన్ని యూనివర్సిటీలు ఏర్పడి 16 ఏళ్లు గడుస్తున్నా అవి యూజీసీ 12–బి గుర్తింపు సాధించగలిగినా, వాటిలో కొత్త కోర్సులను తీసుకురాలేదు. అంతేకాక ఇంజనీరింగ్, బీఈడీ, లా కోర్సుల అనుబంధ కాలేజీలను ఏర్పాటు చేయలేదు. ప్రొఫెసర్లు లేక, ప్రవేశాలు జరగక కొన్ని పీజీ కళాశాలలు మూతబడ్డాయి. 'బ్లాక్ గ్రాంట్' నిలుపుదల కారణంగా కొన్ని సందర్భాల్లో సిబ్బంది జీతభత్యాలకు సైతం వెంపర్లాడాల్సిన దుస్థితి నెలకొంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 80 శాతం 'ప్రొఫెసర్ల ఉద్యోగాలు' ఖాళీగా ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ప్రొఫెసర్లు లేకపోవడంతో కొన్ని విశ్వవిద్యాలయాల్లో కొన్ని కోర్సులు రద్దయ్యాయి. పరిశోధనలూ కష్టమయ్యాయి. కరోనా విపత్తు సమయంలో అవసరం లేకపోయినా 'ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటు'కు గతప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆ విశ్వవిద్యాలయాల్లో 'ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు' అమలుచేయలేదు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన విద్యాశాఖ సమీక్షలో భాగంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి రిజర్వేషన్లు అమలు చేస్తామని, ఇష్టారీతిన అడ్మిషన్లపై ఆంక్షలు విధిస్తామని, ఫీజుల నియంత్రణకు కమిటీలను నియమిస్తామని ప్రకటించడం హర్షణీయం. అదే సమయంలో ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో కొత్తగా 'రాష్ట్ర విశ్వవిద్యాలయాలు' ఏర్పాటు చేస్తామని, నైపుణ్య అభివృద్ధి కేంద్రాలను ప్రకటించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో 'నైపుణ్య విశ్వవిద్యాలయం' నెలకొల్పేందుకు ఆదేశాలివ్వడం మార్పునకు సంకేతంగా భావించవచ్చు.

నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యను ఉచితంగా అందించే రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ప్రతిభావంతులైన వీసీల నియామకం జరగాలి. విద్యాప్రమాణాలు పెంపొందించేలా బోధకుల నియామకం చేపట్టాలి. ప్రత్యేక నిధుల కేటాయింపుతో మౌలిక వసతులు ఊపందుకోవాలి. పరిశోధనలకు ఊతమివ్వాలి. కొనఊపిరితో కొనసాగుతున్న విశ్వవిద్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం తోడైతే, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి నిధుల వరద పెరిగి ప్రోత్సాహకాలు అందుకునేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. వీటివల్ల 'న్యాక్ అక్రిడేషన్లు' దక్కడమే కాదు, అంతర్జాతీయంగా విదేశీ యూనివర్సిటీలకు దీటుగా మన విశ్వవిద్యాలయాలు ఎదుగుతాయి. తద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు 'ఉచితంగా ఉన్నతవిద్య' అందుతుంది.

– నంగె శ్రీనివాస్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

అతిపెద్ద పండుగ... రైతు రుణమాఫీ

ప్రజాస్వామ్యంలో ప్రజలదే అధికారం. ప్రజల్ని, అధికారాన్ని అనుసంధానం చేసే సాధనమే ప్రభుత్వం. అందుకే ప్రజల చేత, ప్రజల కొరకు ఎన్నుకోబడే ప్రజాప్రభుత్వాలు రైతాంగంపై దృష్టి పెట్టాల్సిన సందర్భాన్ని గుర్తు చేసుకునే సమయమిది. దేశంలో మరెక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం తెలంగాణ రైతాంగానికి ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ అందజేస్తున్న సందర్భం దేశ వ్యాప్తంగా చర్చకు దారితీస్తున్నది. గతంలో కొన్ని ప్రభుత్వాలు, ప్రధానులు, ముఖ్యమంత్రులు రుణమాఫీపై ప్రకటనలు చేసి అమలు చేశారు. కాని రూ.2లక్షల రుణమాఫీ అనే అంశం దేశంలోనే అత్యంత సాహసోపేత నిర్ణయం. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలే వ్యవసాయ రంగానికి ఊతమిస్తూ వస్తున్నాయి. ఆ తర్వాత కేంద్రంలో పదేండ్లు కొలువు దీరిన బీజేపీ సర్కారు గాని, వివిధ బీజేపీ పాలిత రాష్ట్రాలు గాని రైతు సంక్షేమాన్ని బొత్తిగా మరిచిపోయి, రైతు వ్యతిరేక చట్టాలతో వాటి భావజాలాన్ని చాటుతున్న వైనాన్ని గమనిస్తున్నాం.

దేశానికి వెన్నెముక వంటి రైతుకు వెన్నుదన్నుగా ఉండాలన్న సంకల్పంతో భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ సాగునీటి రంగాన్ని వృద్ధి చేయాలని ప్రాజెక్టులు నిర్మించి వాటిని ఆధునిక దేవాలయాలుగా అభివర్ణించారు. ఆ తర్వాత లాల్ బహదూర్ శాస్త్రి 1965లో ఉరువా, ప్రయాగ్‌రాజ్ బహిరంగ సభలలో 'జై జవాన్, జై కిసాన్' నినాదంతో రైతాంగానికి, వ్యవసాయ రంగానికి తగు ప్రాధాన్యం ఇచ్చారు. అనంతరం కాంగ్రెస్ ప్రధానులు ఒక్కొక్కరు ఒక్కో పద్ధతిలో రైతులకు ప్రాధాన్యం ఇచ్చారు. కాని 2008లో ప్రధాని మన్మోహన్ నేతృత్వంలో జరిగిన రుణమాఫీ దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. యూపీ, పంజాబ్, మహారాష్ట్ర, తెలంగాణతో పాటు మరో నాలుగు రాష్ట్రాల్లో రుణమాఫీ జరిగినా ఇంత పెద్దమొత్తంలో ఏకకాలంలో రూ.2లక్షల రైతు రుణమాఫీని ఎవ్వరూ చేయలేకపోయారు. దేశంలో ప్రధాని మన్మోహన్ హయాంలో ఏక కాలంలో రూ.71వేల కోట్లతో రూ.లక్ష వరకు రుణమాఫీ చేసి రికార్డులు బద్దలుకొడితే, మళ్లీ అదే కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల రుణమాఫీకి శ్రీకారం చుట్టి మరోసారి చరిత్రను తిరగ రాశారు. రుణమాఫీకి రేవంత్‌రెడ్డి రూ.31వేల కోట్లు ఖర్చు చేయబోతున్నారు. మానవీయ కోణంలో ఆలోచిస్తే ఆ ఖర్చు మరో రెండు వేల కోట్లు పెరిగినా ఆశ్చర్యం లేదు. కేవలం తెలంగాణ రాష్ట్రం మాత్రమే ఇంత పెద్ద మొత్తంలో రైతు రుణమాఫీ కోసం ఖర్చు చేస్తున్నది. అంతేకాక రైతు భరోసా కోసం రూ.8 నుంచి రూ.10 వేల కోట్లు, పంట బీమా, రైతు బీమాకు రూ.5 నుంచి పది వేల కోట్లు ఖర్చు పెడుతున్నది. ఇవే గాక పంట రుణాలు, ఇతరత్రా రుణాల రాయితీల కోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్నది. అంటే ఒక్క తెలంగాణ రాష్ట్రం రైతు కోసం వెచ్చిస్తున్న ఖర్చు దాదాపు రూ.60వేల కోట్లు దాటుతున్నది. అందుకే అన్నం పెట్టే రైతును అప్పుల ఊబి నుంచి ఆశల సాగుక్షేత్రం వైపు నడిపించే బృహత్తర సాహసమే రైతు రుణమాఫీ పథకమని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతుంటారు.





> అందరూ రైతే రాజు అని, రైతే దేశానికి వెన్నెముక అని ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చి వెడుతున్నారే తప్ప, రైతుల జీవితాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చేవారెవ్వరూ లేకపోవడం దురదృష్టకరం. స్వల్పకాలంలోనే రైతుల ముఖాల్లో వెలుగు నింపడానికి, తెలంగాణ రైతాంగానికి రేవంత్‌రెడ్డి మాత్రమే ఓ భరోసా...!

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న పల్లెలను, కర్షకులను ప్రకృతిని ప్రస్తుతం బీజేపీ సర్కారు నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో వ్యవసాయరంగం దెబ్బతింటున్నది. అందుకే ఆహార పదార్థాలు దిగుమతి చేసుకునే దుస్థితి ఏర్పడింది. ఇక కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో చెట్టు, చేమ అడవిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దీంతో పాటు పల్లెల్లో పేదరికం ఇంకా విలయ తాండవం చేస్తున్నది. రైతుల ఆత్మహత్యలు, నేతన్నల ఆకలిచావులు, సాగు, తాగునీటి రంగాన్ని పూర్తిగా ఈ పదేండ్లలో దెబ్బతీసారు. కేసీఆర్ ఏలుబడిలో ఏ ఒక్కరు సంతోషంగా లేరన్నది శాఖల వారీగా జరుగుతున్న సమీక్షలు... అందులోని అవినీతి, అక్రమాలను బట్టి తెలుస్తున్నది. అందుకే కుటుంబ పాలన పోవాలి, ప్రజాపాలన రావాలన్న సంకల్పంతో రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ తొలుత వరంగల్ వేదికగా రైతు డిక్లరేషన్ 2022 మే 6వ తేదీన రాహుల్‌గాంధీ సమక్షంలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన కేవలం ఏడున్నర నెలల్లోనే ఆర్థిక అంశాలు సహకరించకపోయినా ఆర్థికవేత్తలు సాధ్యాసాధ్యాలపై హెచ్చరించినా, సీఎం రేవంత్‌రెడ్డి ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా ఆగస్టు 15వ తేదీలోగా రుణమాఫీపై స్పష్టమైన ప్రకటన చేసి అమలు చేస్తున్నారు.

ఒక్క గురువారం రోజే రూ. లక్ష రుణమున్న రైతుల ఖాతాల్లోకి నిధులు జమ అవ్వడం చూసి ఓ ఆదివాసీ గిరిజన రైతుకూలీ బిడ్డగా, ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఓ మంత్రిగా ఆనందపడుతున్నాను. అందరూ రైతే రాజు అని, రైతే దేశానికి వెన్నెముక అని ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చి వెడుతున్నారే తప్ప, రైతుల జీవితాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చేవారెవ్వరూ ఈ పదేండ్లలో లేకపోవడం దురదృష్టకరం. మాజీ సీఎం కేసీఆర్ రైతుబంధు లాంటి పథకాన్ని తీసుకొచ్చినా, దాని లక్ష్యాన్ని మాత్రం చేరలేకపోయారు. రూ.లక్ష రుణమాఫీని విజయవంతంగా అమలు చేయలేకపోయారు. పంటలకు బీమా అందించలేకపోయారు. అందుకే పదేండ్ల కేసీఆర్ పాలనా వైఫల్యాలను సమీక్షిస్తూనే, కొత్త వ్యవసాయ విధానాలు తెలంగాణలో రూపుదిద్దుకోబోతున్నాయి. అంతేకాదు పాలసీలు నాలుగు గోడల మధ్య కాకుండా ప్రజల మధ్య తయారుకావాలన్న ఉద్దేశ్యంతో రైతు భరోసా పథకం విధి విధానాలపై రైతులతోనే చర్చిస్తున్నాం. స్వల్పకాలంలోనే రైతుల ముఖాల్లో వెలుగు నింపడానికి, తెలంగాణ రైతాంగానికి రేవంత్‌రెడ్డి మాత్రమే ఓ భరోసా అని చెప్పక తప్పదు.

అందుకే తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీ పథకం దేశంలోనే ఈ దశాబ్దపు అతి పెద్ద పండుగ. పథకం అమలు తీరుతెన్నులను ముఖ్యమంత్రి, మంత్రివర్గం సహా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది.

■ సీతక్క ధనసరి
పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ–శిశు సంక్షేమ శాఖల మంత్రి



ఆదర్శ పాఠశాలల్లో.. అన్నీ సమస్యలే

చేతులు మారిన హాస్టళ్ల నిర్వహణ

- ప్రిన్సిపాళ్ల నుంచి కేజీబీవీ ప్రత్యేకాధికారులకు అప్పగింత
- పారిశుధ్య నిర్వహణకు సిబ్బంది కరువు
- హాస్టళ్లలో వందమందికి సరిపోయేలా వసతులు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు
- పదకొండేళ్లుగా భర్తీకాని ఉపాధ్యాయ ఖాళీలు
- బదిలీలు లేక నైరాశ్యంలో టీచర్లు

హనుమకొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శ (మోడల్) పాఠశాలలు అసౌకర్యాలకు నిలయాలుగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వానికి కస్తూర్బా గాంధీ విద్యాలయాలు (కేజీబీవీ), గిరిజన ఆశ్రమ పాఠశాలలపై ఉన్న శ్రద్ధ ఈ ఆదర్శ పాఠశాలలపై లేదన్నది ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మోడల్ స్కూళ్ల పరిస్థితిని చూస్తే అర్థమవుతోంది. వీటి పట్ల సవతి తల్లి ప్రేమను కనబరుస్తోందని, విశాలమైన స్వంత భవనాలు, పెద్ద సంఖ్యలో విద్యార్థులున్నా ఈ ఆదర్శ పాఠశాలలు కనీస సౌకర్యాలకు నోచుకోక సమస్యలతో కూనారిల్లుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ వైపు ఉపాధ్యాయుల కొరత వెంటాడుతుండగా.. మరోవైపు పదకొండేళ్లుగా బదిలీలు లేక ఉపాధ్యాయులు నైరాశ్యానికి లోనవుతున్నారు. బోధన, బోధనేతర సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించకపోవడం ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

హాస్టళ్ల నిర్వహణ ప్రత్యేకాధికారులకు

వసతి గృహాల నిర్వహణ బాధ్యతల్ని పాఠశాల ప్రిన్సిపాళ్ల నుంచి ఎక్కడో దూరంగా ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాల ప్రత్యేకాధికారులకు అప్పగించడంతో సమస్యలు మరింత పెరిగాయి. వారు ఇటు కేజీబీవీలను అటు ఆదర్శ హాస్టళ్లను పర్యవేక్షించలేక సతమతమవుతున్నారు. సమస్యలు పరిష్కారం కాక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదర్శ పాఠశాలల ఆవరణలోనే వసతి గృహాలను నిర్మించారు. తొమ్మిదేళ్లపాటు నిర్వహణ బాధ్యతల్ని పాఠశాలల ప్రిన్సిపాళ్లకే అప్పగించారు. తాము వసతి గృహాల నిర్వాహకులం కాదంటూ ఈ బాధ్యతల నుంచి తమను తప్పించాలని ప్రిన్సిపాళ్లు కోర్టుకు వెళ్లారు. కోర్టు వీరికి అనుకూలంగా తీర్పునిచ్చింది. ప్రిన్సిపాళ్లతో హాస్టళ్లను నిర్వహింపచేయడమేంటని మొట్టికాయలు వేసింది. ఆ బాధ్యతల నుంచి తప్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే వీరి స్థానంలో కొత్తవారిని నియమించాల్సింది పోయి ప్రభుత్వం కస్తూర్బా గాంధీ విద్యాలయాల ప్రత్యేకాధికారులలకు బాధ్యతలను అప్పగించింది. ఆదర్శ పాఠశాలల వసతి గృహాలకు, కేజీబీవీలకు మధ్య దూరం మూడు నుంచి ఐదు కిలోమీటర్ల మేరకు ఉంది. ఇంకొన్ని చోట్ల వసతి గృహం ఒక ఊరిలో ఉంటే కేజీబీవీ మరో గ్రామంలో ఉంది. ఏక కాలంలో వీటిని నిర్వహించడం ప్రత్యేకాధికారులకు కష్టంగా మారింది. దీంతో ఆదర్శబడుల్లో పూర్తిస్థాయి హాస్టల్ వార్డెన్లు, నిర్వాహకులు లేక వాటి నిర్వహణ పెనంలో నుంచి పొయ్యిలో పడ్డట్లయింది.

స్వీపర్ల తొలగింపుతో పారిశుధ్య నిర్వహణ మృగ్యం

మోడల్ స్కూళ్లకు గతంలో ప్రత్యేకంగా స్వీపర్ ఉండేవారు. వారికి ప్రతీ నెల రూ.2500 వరకు ప్రభుత్వమే చెల్లించేది. కొంత కాలం క్రితం అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు మోడల్ స్కూళ్లలో కూడా స్వీపర్లను తొలగించారు. పాఠశాలలను శుభ్రం చేసే బాధ్యతను పంచాయతీ సిబ్బందికి అప్పగించారు. ఇప్పటికే జీపీ సిబ్బందికి పనిభారం ఎక్కువగా ఉండటంతో ఈ పాఠశాలలో ఊడ్వడం, మరుగుదొడ్లను శుభ్రం చేయడం లాంటి పారిశుధ్య పనులను చేయడం లేదు. అటెండర్లే ఈ విధులను నిర్వహించాల్సి వస్తోంది.

బదిలీలు ఎప్పుడు?

పదకొండేళ్లుగా బదిలీలు లేకపోవడం వల్ల ఉపాధ్యాయుల్లో నిరాసక్తత, నైరాశ్యం ఏర్పడింది. ఈ ప్రభావం బోధనపై పడుతోంది. సుదీర్ఘ కాలం ఒక దగ్గరే పాతుకుపోయి ఉండడం వల్ల వారిలో నిర్లక్ష్యం కూడా కనిపిస్తోంది. సేవల విషయంలో కొందరు ఉపాధ్యాయులు కోర్టుకు వెళ్లడంతో బదిలీలకు బ్రేక్ పడింది. ఈ కేసు పరిష్కారమైతే తప్ప బదిలీలకు అవకాశం లేదు. ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో బదిలీలు జరుగుతున్నాయి. తమకు మాత్రం బదిలీల యోగం లేకపోవడంతో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు నిరాశ చెందుతున్నారు. ఉపాధ్యాయ ఖాళీలను కూడా ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. పదేళ్లలో పలు కారణాల వల్ల ఖాళీ అయిన పోస్టులను ఇప్పటి వరకు భర్తీ చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా 1200 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 200కుపైగా పోస్టులు ఖాళీ ఉండగా ఆ ఖాళీ స్థానాల్లో అవర్లీబేస్ట్ టీచర్లను నియమించి నెట్టుకొస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఆదర్శ పాఠశాలలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో 30ఆదర్శ పాఠశాలలుండగా 24,600మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వరంగల్ జిల్లాలో అమీనాబాద్, వంచనగిరి, బుధరావుపేట, నెక్కొండ, పర్వతగిరి, గవిచర్ల, హనుమకొండ జిల్లాలో ముల్కనూరు, ఎల్కతుర్తి, కమలాపూర్, మహబూబాబాద్ జిల్లాలో చిలకోడు, కాల్వల, నేరేడ, మహబూబాబాద్, మరిపెడ, నర్సింహులపేట, నెల్లికుదురు, గుర్తూరు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గంగారం, దుబ్బలపాడు, ఎడ్లపల్లి, చిట్యాల, కొరికిరాల, ములుగు జిల్లాలో మనపూర్, చల్వాయి, బండారుపల్లి, జవహర్ నగర్, జనగామ జిల్లాలో పారుపల్లి, బచ్చన్నపేట, స్టేషన్ ఘనపూర్, చౌడారం, కొడకండ్ల, లింగాల ఘనపూర్, నర్మెట, వెల్ది, జఫర్‌గడ్ ఉన్నాయి. ఇక చేర్యాల మండలంలోని ముస్త్యాల, మద్దూరు మండలంలోని మద్దూరులోని మోడల్ స్కూళ్లు సిద్దిపేట జిల్లాలోకి వెళ్లాయి.

వంద మందికి మాత్రమే సరిపోయేలా వసతులు..

ఆంగ్ల మాధ్యమం ఉన్న నేపథ్యంలో ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు తీవ్ర పోటీ ఉంటోంది. అందుకు తగినట్టు గా వసతులు కల్పించకపోతుండటంతో ప్రవేశాలు పొం దిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఒక్కో పాఠశాలలో వంద మంది విద్యార్థినులకు సరిపడా మాత్రమే హాస్టల్ సౌకర్యాలుండగా.. మిగతా వి ద్యార్థులు ఏ రోజుకారోజు ఇళ్లకు వెళ్లి రావాల్సి వస్తోంది. కనీసం సమీపంలో బాలికలు, బీసీ వసతి గృహాలు లేకపోవడంతో వీరందరూ అవస్థలు పడుతున్నారు. బీసీ విద్యార్థులకు సీట్లు పరిమితంగా ఉండటంతో అత్యధికులకు నిరాశే ఎదురవుతోంది. ఒక్కొక్క ఆదర్శ పాఠశాలలో 820 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారిలో 60శాతం వరకు విద్యార్థినులే. ఆదర్శ పాఠశాలలు ఉన్న ప్రతీ మండలంలో బీసీ, బాలికల వసతి గృహాలను ఏర్పాటు చేస్తే సమస్య తీరే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇళ్ల నుంచి రాకపోకలు విద్యార్థులు ప్రైవేటు వాహనాలను అద్దెకు మాట్లాడుకొని ప్రమాదకరమైన రీతిలో పాఠశాలలకు వస్తున్నారు. వీరికి వచ్చిపోయేందుకే సమయం సరిపోతుండటంతో చదువుకునేందుకు సమయం ఉండటం లేదు. ఆ ప్రభావం పరీక్ష ఫలితాలపై చూపుతోంది. ఇక దాదాపు అన్ని చోట్ల భవనాలు నిర్మించినా వాటి నిర్వహణ గురించి పట్టించుకోలేదు. గదులు మరమ్మతులకు వచ్చాయి. మూత్రశాలలు, మరుగుదొడ్ల అపరిశుభ్రతతో ఉపయోగించలేని రీతిలో ఉన్నాయి. నిర్వహణకు నిధులు కేటాయిస్తేనే ఈ సమస్య తీరే అవకాశం ఉంది. అప్పట్లో ప్రభుత్వం ఒక్కో పాఠశాల ఏర్పాటుకు 5 ఎకరాల స్థలం కేటాయించింది. ఈ స్థలంలో విద్యాలయాలు నెలకొల్పినా వసతి గృహాలను నిర్మించలేదు. మరికొన్ని చోట్ల వసతి గృహాలను ఏర్పాటు చేసినా వాటిని మాత్రం వినియోగంలోకి తీసుకురావడం లేదు. ఈ పరిస్థితుల కారణంగా మోడల్ స్కూళ్లలో ప్రవేశాల సంఖ్య క్రమంగా తగ్గుతోందని తెలుస్తోంది. ప్రస్తుతం ఇంటర్ విద్యార్థినులకు అదీ 100 మంది మాత్రమే హాస్టల్ వసతి ఉండడంతో పిల్లలను చేర్చేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ఆంగ్ల మాధ్యమం బోధించే, హాస్టల్ వసతి కల్పించే ఇతర ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ ఆశ్రమ పాఠశాలలు, గిరిజన స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్సీ స్కూళ్లలో చేరుస్తున్నారు. ఆశ్రమ పాఠశాలలు ఊరికి దూరంగా ఉండడం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. మోడల్ స్కూల్ భవనానికి విధిగా 5ఎకరాల స్థలం ఉండాలన్న నిబంధనలతో మండల కేంద్రాల్లో అంత స్థలాలు దొరక్క ఊరికి దూరంగా నిర్మించడం పెద్ద సమస్యగా మారింది.

విజయమాతగా భద్రకాళి

- 13వ రోజుకు చేరిన శాకంబరీ ఉత్సవాలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న లక్ష్మీకాంతరావు దంపతులు

వరంగల్ కల్చరల్, జూలై 18: భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు ఘనంగా సాగుతున్నారు. గురువారం నాటికి వేడుకలు 13వ రోజుకు చేరాయి. కాళీ క్రమాన్ని అనుసరించి ఉత్సవ మూర్తిని బలాకాగా అలంకరించి, భద్రకాళి మాతను విజయమాతగా అలంకరించారు. బలాకా అమ్మవారు పిడుగుల వర్షాన్ని కురిపించి శతృనాశనాన్ని చేస్తుందని, విజయమాత అమ్మవారు అనుగ్రహిస్తుందని ప్రధానార్చకులు శేషు తెలిపారు. అమ్మవారిని మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు దంపతులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శేషుభారతి పాల్గొన్నారు.

సమష్టి కృషితో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన

అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

హనుమకొండ కలెక్టరేట్, జూలై 18: అధికారులు, స్వచ్ఛంద సంస్థల కృషి, సమన్వయంతో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఏర్పాటుచేసిన స్పెషల్ డ్రైవ్ ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంపై కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం వివిధ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ఆపరేషన్ ముస్కాన్ టీం నిబంధనల ప్రకారం జిల్లాలోని పరకాల, హనుమకొండ, కాజీపేట పరిధిలోని పారిశ్రామిక ప్రాంతాల్లో, షాపుల్లో, ప్రమాదకరప్రాంతాల్లో కార్మికశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీస్ యూనిట్, చైల్డ్ హెల్ప్‌లైన్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. 14 యేళ్లలోపు బాల బాలికలు పనిచేస్తున్నట్లు గుర్తిస్తే బాలకార్మిక నిర్మూలన చట్టం ప్రకారం సంబంధిత యజమానులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలని, 18 యేళ్లలోపు బాలబాలికలు పని చేస్తున్నట్లు గుర్తిస్తే బాలల న్యాయ చట్టం ప్రకారం యజమానులపై కేసులు నమోదు చేయాలన్నారు. బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ అన్నమనేని అనిల్ చందర్‌రావు, జిల్లా సంక్షేమ అధికారి కె. మధురిమ మాట్లాడారు.

ఈ సమావేశంలో ఎన్సీఎల్పీ డైరెక్టర్లు బుర్ర అశోక్ కుమార్, బాలల సంక్షేమ సమితి సభ్యులు కజాంపురం దామోదర్, సందసాని రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ పరికి సుధాకర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. సాంబశివరావు, జిల్లా బాలల పరిరక్షణ ఇన్‌చార్జి అధికారి ఎస్.ప్రవీణ్ కుమార్, బాలల పరిరక్షణ విభాగం నుంచి మౌనిక, సునిత, సతీష్, విజయ్‌కుమార్‌తో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీసులు, ఫ్యాక్టరీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీదే విజయం

- అవినీతి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు చోటు లేదు
- బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌జీ



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్ జీ

హనుమకొండ టౌన్, జూలై 18 : రాష్ట్రంలో రాబోయే ఏ ఎన్నికల్లోనైనా బీజేపీ పార్టీ విజయం సాధిస్తుందని బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌జీ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం హంటర్‌రోడ్డులో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన చంద్రశేఖర్‌జీ మాట్లాడుతూ.. తెలంగాణలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. అవినీతి, అరాచక కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు తెలంగాణలో చోటు లేదన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లోనే కాదు.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఎన్నికల్లో బీజేపీ గెలవాలనే సంకల్పంతో ప్రతీ ఒక్క కార్యకర్త ముందుకెళ్లాలన్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలపై కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించాలన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ.. భవిష్యత్తులో బీజేపీతో బీఆర్‌ఎస్ పొత్తు పెట్టుకుంటుందని కల్వకుంట్ల కుటుంబం దుష్ప్రచారం చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వెళ్లకుండా నిలువరించడంలో భాగంగానే ఈ ప్రచారాన్ని చేస్తున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి మధ్య పోటీ ఉంటుందని, దానికి కార్యకర్తలు సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాస్టర్ ప్లాన్ అమలుపై సీఎం దాటివేసే ధోరణిని అవలంబిస్తున్నాడన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ మంత్రి విజయరామారావు, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, ఆరూరి రమేశ్, ఒంటేరు జయ్‌పాల్, రాష్ట్ర నాయకులు కన్నెబోయిన రాజయ్యయాదవ్, మంద ఐలయ్య, విజయ్‌చందర్‌రెడ్డి, సిరంగి సంతోష్, సత్యనారాయణ, జిల్లా నాయకులు సంతోష్‌రెడ్డి, జయంత్‌లాల్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

- రుణమాఫీతో జిల్లాలో పండుగ వాతావరణం
- సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు, శ్రేణులు

హనుమకొండ, జులై 18 (ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీ పట్ల గురువారం వరంగల్, హనుమకొండ జిల్లాల వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నాయి. అన్నదాతల్లో ఆనందం అంబరాన్నంటింది. పండుగ వాతావరణం వెల్లివిరిసింది. జిల్లా కేంద్రంలోనూ అలాగే అన్ని మండల కేంద్రాల్లో, గ్రామాల్లో సైతం కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి ఊరేగింపులు తీశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించారు. రుణమాఫీని పురస్కరించుకొని సీఎం రేవంత్‌రెడ్డి సైతం రైతులతో వీడియో కాన్ఫరెన్స్ జరిపారు. రైతు వేదికల్లో అన్నదాతల సమక్షంలో సీఎ వీడియో సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ సీనియర్ నాయకులు, అన్ని మండలాల కిసాన్ సెల్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎస్ఎస్ఎస్‌యూ నాయకులు ఈ సంబరాలకు నేతృత్వం వహించారు. కార్యకర్తలు పార్టీ జెండాలను చేబూని డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ ఊరేగింపులు జరిపారు. బైక్ ర్యాలీలను నిర్వహించారు. అనంతరం ముఖ్య కూడళ్లలో సీఎం నిలువెత్తు చిత్రపటాలకు పాలతో అభిషేకం చేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అన్ని రైతువేదికల్లో రుణవిముక్తి పొందిన రైతులతో అధికారిక సమావేశాలను నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డి వీడియో సందేశాన్ని తిలకింప చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన వాగ్దానాల్లో ఒకటైన రూ.2లక్షల రుణమాఫీని అమలు చేయడం ద్వారా ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నదన్నారు. దీనిని చరిత్రాత్మకమైన ఘట్టంగా అభివర్ణించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఆరు గ్యారంటీలను ఇప్పటికే అమలు చేశారని, రైతులకు ఇచ్చిన వాగ్దానాన్ని రుణమాఫీతో నెరవేర్చారన్నారు. నర్సంపేట నియోజకవర్గంలోని నల్లబెల్లి, చెన్నారావుపేట, ఖానాపురం మండలాల్లో రైతు సంబరాలు ఘనంగా జరిగాయి. చెన్నారావుపేటలో జరిగిన సంబరాలకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరయ్యారు. పరకాలలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఎడ్లబండ్లతో జరిగిన ఊరేగింపులో పాల్గొన్నారు.

ర్యాలీలు

రైతు రుణమాఫీని పురస్కరించుకొని హనుమకొండలోని డీసీసీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యమంతి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద రైతు రుణమాఫీ సంబరాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకు ముందు కాంగ్రెస్ కార్యకర్తలు అంబేద్కర్ సెంటర్‌కు డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా చేరుకున్నారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు జాతీయ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రైతు డిక్లరేషన్‌లో భాగంగా రైతు రుణమాఫీ ప్రకటించిన చోట కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు.



హనుమకొండ డీసీసీ బ్యాంకు ఎదుట బాణసంచా పేల్చి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, సమన్వయకర్త మార్క విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. రైతు రుణమాఫీని పురస్కరించుకొని వరంగల్ జిల్లా పర్వత గిరి మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు క్షీరాభిషేకం జరిపారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంల సీఎం చిత్రపటానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు క్షీరాభిషేకం నిర్వహించారు. ఖిలా వరంగల్ మండలంలోని బొల్లికుంట రైతు వేదిక వద్ద రుణమాఫీ పొందిన రైతులతో సమావేశం జరిగింది. అనంతరం సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరుకావలసి ఉన్నప్పటికీ చివరి నిముషంలో ఆమె పర్యటన రద్దయింది. ఆత్మకూరు మండలం నీరుకుళ్లలోని రైతు వేదికలో జరిగిన సంబరాలకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు.



మైదానంలో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రైతుల సంక్షేమం కోసమే రుణమాఫీ

- ఇతర అప్పుల కోసం డబ్బులు తీసుకోవద్దు
- జిల్లాలోని బ్యాంకర్లతో కలెక్టర్ ప్రావీణ్య



హనుమకొండ కలెక్టరేట్, జూలై 18: రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీని అమలు చేస్తోందని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీపై జిల్లాలోని వివిధ బ్యాంకర్లతో గురువారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతుల బ్యాంకు ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ కాగానే ఇతర అప్పుల కింద డబ్బులను తీసుకోవద్దని బ్యాంకర్లను ఆదేశించారు. ఒకవేళ అప్పుల కింద జమ చేసుకుంటే బ్యాంకర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఆర్థికస్థితిని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ కార్యకలాపాలు స్థిరంగా ఉండేలా చూడటానికి రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం పంట రుణమాఫీ-2024 పథకం అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలో భూమి ఉన్న ప్రతీ రైతు కుటుంబానికి రూ.2లక్షల వరకు ప్రభుత్వం పంట రుణమాఫీ చేస్తోందన్నారు. ఈ పథకం కింద 09-12-2023 తేదీ నాటికి బకాయి ఉన్న అసలు వర్తింపయ్యే వడ్డీ మొత్తానికి అర్హత కలిగి ఉంటుందన్నారు. అర్హత కలిగిన రైతులకు రుణమాఫీ మొత్తాన్ని డీబీటీ పద్ధతిలో నేరుగా రైతు రుణ ఖాతాలకు జమ చేయబడుతుందన్నారు. రుణమాఫీ పథకం గురించి రైతుల సందేహాలకు, ఇబ్బందులకు ఐటీ పోర్టల్ ద్వారా లేదా మండల స్థాయిలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల వద్ద తెలుపవచ్చని తెలిపారు. ప్రతీ అభ్యర్థనను సంబంధిత అధికారులు 30రోజులలోపు పరిష్కరించి దరఖాస్తుదారుడికి తెలుపుతారని కలెక్టర్ పేర్కొన్నారు.

ఫిర్యాదుల కోసం అధికారిని నియమించాలి

రైతుల ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రతీ మండలంలో ఒక అధికారిని నియమించాలని కలెక్టర్ ప్రావీణ్య వ్యవసాయాధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారులతో గురువారం కలెక్టర్‌లో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి నాగేశ్వర్‌రావుతోపాటు వివిధ బ్యాంకులకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

రైతులతో సీఎం భేటీ

రైతు రుణమాఫీ సందర్భంగా బొల్లికుంటకు చెందిన రైతు బొల్లు ఎల్లయ్యతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయడం సంతోషంగా ఉందని, ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధిక శాతం రైతులే ఉంటారని సీఎం అన్నారు. రైతు రుణమాఫీతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొందని రైతు ఎల్లయ్య సీఎంకు తెలిపారు. భీమదేవరపల్లి మండలంలో ముల్కనూరులోని రైతు వేదికలో సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్‌కు రైతులతో పాటు ముల్కనూరు బ్యాంక్ చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి హాజరయ్యారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- వర్షాల నేపథ్యంలో టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు
- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జూలై 18: నగరంలో వచ్చే రెండు రోజుల పాటు భారీవర్షాలు కురుస్తాయని, ఈ మేరకు బల్దియా అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. గురువారం బల్దియా కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో ఎమర్జెన్సీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు. ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ 1800 425 1980, 97019 99645 నెంబర్‌లకు వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అన్నారు. విపత్తు బృందాలు పంపించి సమస్య పరిష్కరించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎంజీఎం సూపరింటెండెంట్ బదిలీ

- కేఎంసీ ప్రిన్సిపాల్ కూడా..
- 26 మంది ప్రొఫెసర్లకు స్థానచలనం



డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ మోహన్‌దాస్

వరంగల్ మెడికల్, జూలై 18: ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ బదిలీ అయ్యారు. ఈయనను ములుగు వైద్య కళాశాల ప్రొఫెసర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. అలాగే కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మోహన్ దాస్ కూడా బదిలీ అయ్యారు. ఈయన నర్సంపేట కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. వీరి స్థానాల్లో ప్రభుత్వం ఇంకా ఎవరిని నియమించలేదు. 2021 జూలైలో కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మోహన్‌దాస్ బాధ్యతలు స్వీకరించారు. కేఎంసీని అకడమిక్, పరిపాలన, అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపి పలువురి మన్ననలు పొందారు. ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ప్రొఫెసర్ చంద్రశేఖర్ ఏప్రిల్ 2022లో ఎఫ్‌ఏసీగా బాధ్యతలు స్వీకరించారు. పలు వివాదాల మధ్య ఎంజీఎం పాలన కొనసాగించారు.

26మంది ప్రొఫెసర్ల బదిలీ

ఎంజీఎం, కేఎంసీలలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సీనియర్ ప్రొఫెసర్లు 36 మంది బదిలీ అయ్యారు. వీరి స్థానంలో కొత్తవారు రానున్నారు. సుదీర్ఘకాలంగా ఇక్కడ పని చేస్తుండటంతో ములుగు, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్ వైద్య కళాశాలలకు బదిలీ అయ్యారు.

ఏడీల బదిలీ

కాకతీయ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ యాదగిరి భూపాలపల్లి వైద్య కళాశాలకు బదిలీ అయ్యారు. ఎంజీఎం ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం కరీంనగర్ వైద్య కళాశాలకు బదిలీ అయ్యారు. కాకతీయ వైద్య కళాశాలలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నోడల్ అధికారిగా పని చేస్తున్న గోపాల్‌రావు జనగామ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు.

డిప్యూటీ సివిల్ సర్జన్‌ల బదిలీ

హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ అంబరీష్ బదిలీపై వచ్చారు. డాక్టర్ అంబరీష్ ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. వరంగల్ సీకేఎం ఆస్పత్రి ఆర్ఎంవోగా హనుమకొండ జిల్లాలో పనిచేస్తున్న డాక్టర్ యాకూబ్‌పాషా బదిలీపై వచ్చారు. వైద్య, ఆరోగ్యశాఖలో వివిధ విభాగాలకు చెందిన మరికొంత మంది ఈ నెల 20లోపు బదిలీ కానున్నారు.

అటవీ శాఖలో బదిలీలు

వరంగల్ క్రైం, జూలై 18: భద్రాద్రి కొత్తగూడెం జోన్ పరిధిలోని అటవీ శాఖలో ఉద్యోగుల బదిలీలు జరిగాయి. గురువారం హనుమకొండ అటవీ శాఖ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. జోన్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో జరిగిన బదిలీల్లో 106 మంది స్థాన చలనం చెందారు. బదిలీ అయిన వారిలో 27 డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, 53 సెక్షన్ ఆఫీసర్లు, 19 సీనియర్ అసిస్టెంట్లు, 7 సూపరింటెండెంట్లు ఉన్నారు.

నేడు ఒకేషనల్ కళాశాలలో జాబ్‌మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వృత్తి విద్యా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్, జూలై 18: ఈనెల 19న హనుమకొండ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో 2021-22, నుంచి 2023-24లో ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు అప్రెంటిషిప్ జాబ్‌మేళా-2024 నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బెడుదం శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కళాశాల ఆవరణలో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాబ్‌మేళాలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.7చొప్పున ఆర్‌డీఎస్‌డీ సంస్థ వారు శిక్షణకాలంలో ఇస్తారని పేర్కొన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులందరూ రెండు జతల బయోడెటాతోపాటు రెండు ఫొటోలు, ఇంటర్, ఎస్సెస్సీ, ఆధార్‌కార్డుతోపాటు ఇతర విద్యార్హతల ధృవపత్రాలను తీసుకునిరావాలని సూచించారు. జాబ్‌మేళా కళాశాల ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఉదయం సెషన్‌లో పారామెడికల్, సాయంత్రం సెషన్‌లో ఇంజనీరింగ్, కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అప్రెంటిషిప్ సాగుతుందని స్పష్టం చేశారు. కాగా, విద్యార్థులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని డీఐఈఓ ఎ.గోపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వృత్తి విద్యాకళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ పి.దివాకర్, ఎన్ఎస్ఎప్ పీవో డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ఎస్.శ్రీనివాస్, అధ్యాపకులు ఎం.విష్ణుకాంత్, ఎం.రాజేంద్రప్రసాద్, పి.విజయకుమార్, ఎ.దిలీప్, ఖాదర్‌బాబా, డి.రవి, చౌహన్, మహేందర్, జయపాల్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రిటైర్డు ప్రొఫెసర్ సుభాష్ మృతి

నివాళులర్పించిన ప్రొఫెసర్లు, విద్యార్థులు

కేయూ క్యాంపస్, జూలై 18: కాకతీయ యూనివర్సిటీ బయో టెక్నాలజీ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ కారంపూడి సుభాష్ (76) గుండెపోటుతో మృతి చెందారు. గత 16న హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచగా దుబ్బాకలోని తన స్వగృహంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు సభ్యులు తెలిపారు. సుభాష్‌కు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు.

1970లో వర్సిటీలో లెక్చరర్‌గా ఉద్యోగంలోకి చేరిన సుభాష్. ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. వర్సిటీలో బాటనీ, బయోటెక్నాలజీ విభాగంలో బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా, వర్సిటీ అభివృద్ధి అధికారిగా, వసతి గృహాల సంచాలకుడిగా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. ప్రొఫెసర్ సుభాష్ కేయూ పూర్వపు వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ జాఫర్ నిజాం పర్యవేక్షణలో డాక్టరేట్ సాధించారు. మృతి చెందిన ప్రొఫెసర్ సుభాష్ మృతికి సంతాపంగా గురువారం కేయూ బయో టెక్నాలజీలో విభాగాధిపతి డాక్టర్ శాస్త్రి తాడూరి నేతృత్వంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ నూనె రామస్వామి, ప్రొఫెసర్ సదానందం, డాక్టర్ పొడేటి శ్రీనివాస్, ప్రొఫెసర్ క్రిష్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.

మొగిళిచర్లలో అనధికారిక లేఔట్ తొలగింపు

వరంగల్ కార్పొరేషన్, జూలై 18: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్ మొగిళిచెర్ల శివారులో సర్వే నెంబర్ 178/2సి, 179సిలో మూడెకరాల విస్తర్ణంలో ఉన్న వ్యవసాయ భూమిలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లేఔట్ ప్లాట్ల హద్దు రాళ్లను గురువారం బల్దియా అధికారులతో పాటు డీఆర్ఎఫ్ సిబ్బంది తొలగించారు. అనుమతి లేకుండా ప్లాట్లు చేసినందుకు గాను లేఔట్‌ను తొలగించినట్లు ఏసీపీ ఖలీల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీబీవో ఖాజాషరీఫ్, చైన్‌మెన్ ప్రశాంత్‌తో పాటు డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

21న సింగర్ సనశ్రీ 8 గంటల నాన్‌స్టాప్ పాటలు

వడ్డెపల్లి, జూలై 18: హనుమకొండ న యీంనగర్‌లోని వాగ్దేవి కాలేజీలో ఈనెల 21న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 108 పాటలను నిరంతరంగా సింగర్ సనశ్రీ ఆలాపించనున్నట్లు కాకతీయ మ్యూజికల్ క్లబ్ సభ్యులు తెలిపారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సింగర్ సనశ్రీ మాట్లాడుతూ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ , తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఈ మూడు బుక్స్‌రికార్డ్స్ కోసం 108 మల్టీ లాంగ్వేజ్ పాటలను నాన్‌స్టాప్‌గా 8 గంటల పాటు ఆలాపించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో తోట పూర్ణచందర్‌రావు, సిరాజొద్దీన్, తిరుపతయ్య, రంగు రఘుపతి, రాంమూర్తి, శ్రీమన్నారాయణ పాల్గొనున్నారు.

పరీక్షలు ముగిసిన విద్యార్థులు హాస్టల్ ఖాళీ చేయాలి..

కేయూ క్యాంపస్, జూలై 18: కాకతీయ యూనివర్సిటీలో తాజాగా పీజీ రెండో ఏడాది పరీక్షలు ముగిసిన విద్యార్థులు జూలై 20వ తేదీలోగా హాస్టళ్లు ఖాళీ చేయాలని కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖాళీ చేసిన విద్యార్థులు హాస్టల్ గదుల తాళాలను కేర్‌టేకర్లు అప్పగించాలని స్పష్టం చేశారు. వర్సిటీ ఆదేశాలు పాటించని విద్యార్థుల గదులను స్వాధీనం చేసుకుని వర్సిటీ అధికారులే తాళాలు వేస్తామని పేర్కొన్నారు. తర్వాత వర్సిటీలో తలెత్తే పరిణామాలకు సిబ్బంది బాధ్యత ఉండదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఐటీఐలో రెండో విడత ప్రవేశాల గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 18: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాల దరఖాస్తుల గడువును ఈ నెల 21 వరకు పొడిగించినట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ జి.సక్రు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు http://iti.telangana.gov.in వెబ్‌పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 18: విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయురాలికి కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో వాసంతి షోకాజ్ నోటీసు జారీ చేశారు. హనుమకొండలోని వడ్డెపల్లి ఉర్దూ మీడియం ప్రైమరీ పాఠశాలను గురువారం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసియా సిద్ధిఖి అనే ఉపాధ్యాయురాలు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నట్లు గుర్తించారు. వర్క్ బుక్‌లను ఉపయోగించకపోవడం, విద్యార్థులకు వర్క్ బుక్స్‌ను ఇవ్వకపోవడం, పాఠశాల మౌలిక వసతులు పట్ల అవగాహన రాహిత్యాన్ని గుర్తించిన కలెక్టర్ ప్రావీణ్య.. ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించడంతో డీఈవో డి.వాసంతి ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

వరంగల్ మెడికల్, జూలై 18: షుగర్, గుండెవ్యాధుల ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 19న శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ ఇ.లక్ష్మణ్ కుమార్, కార్డియాలజిస్టు డాక్టర్ పీవీ అనిల్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పద్మాక్షి పాలిక్లినిక్‌లో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.5వేల విలువైన పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతోపాటు, మరో రూ.1500 విలువైన రెటినోపతి కంటి పరీక్షను సైతం ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు 9955996166, 91338933లలో సంప్రదించాలన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

న్యూశాయంపేట, జూలై 18: కుల గణన చేపట్టి రిజర్వేషన్లు పెంచిన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అధ్యక్షతన సమగ్ర కుల గణన యాత్ర సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీలు దూరం కావడంతోనే గత ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ తగ్గిందని, ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరిచి బీసీలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. బీసీలుఅంటే బ్రిలియంట్ క్యాస్ట్ అని.. బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదన్నారు. బీసీలకు ఉన్న తెలివి ప్రపంచంలో ఎవరికీ లేదని, దమ్ము ధైర్యం ఉన్న కులం బీసీ కులం అన్నారు. గత శాసనసభఎన్నికల ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 6 నెలల్లోపు కులగణన చేపడుతామని చెప్పారని, ఆ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. కులగణన చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై బీసీలు పోరాటం చేస్తారని హెచ్చరించారు.

ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకాల శ్యామ్ కుర్మా, బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు విక్రమ్ గౌడ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మణి మంజరి, బీసీ కులాల జేఏసీ రాష్ట్ర నాయకులు కుందారపు గణేష్‌చారి, బాలగాని బాలరాజు గౌడ్, నగర శేఖర్, వడ్నాల నరేందర్, డాక్టర్ చిర్ర రాజు, బీసీ సంక్షేమ సంఘం చిల్పూర్ మండల అధ్యక్షుడు బత్తుల రాజన్‌బాబు, దాడి మల్లయ్య, నాగరాజు, శోభారాణి, పద్మజతో పాటు పెద్ద సంఖ్యలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కరుణకు విజ్ఞప్తి



వాకాటి కరుణకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి తదితరులు

హనుమకొండ సిటీ, జూలై 18: అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ఉద్యోగ విరమణ తరువాత లభించే ఆర్థిక ప్రయోజనాల అమలుకు సంబంధించిన ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాకాటి కరుణకు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి, ప్రధాన కార్యదర్శి రమాతార విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లో వాకటి కరుణను కలిసి అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, కేంద్రాలకు సంబంధించిన సమస్యల పరిష్కార చర్యలను చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు. రిటైర్మెంట్ అయిన టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయలను ప్రభుత్వం అందచేయనున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలియచేశారు. అయితే ఇందుకు సంబంధించిన జీవోను కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. అనారోగ్య సమస్యలతో ఉన్న టీచర్లు, హెల్పర్లకు వాలంటరీ రిటైర్మెంట్ ఇవ్వాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, టీచర్లకు అదనపు పనులు అప్పగించరాదని, కేంద్రాల్లో వసతులు కల్పించాలనే తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి వేదవతితో పాటు ఎల్లమ్మ, శిరీష, పుష్ప, నాగలక్ష్మి, చిన్నమ్మడు, అనిత తదితరులు పాల్గొన్నారు.

అడవి జంతువుల కోసం 'వేట'కుక్కలు..



ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇటీవల వేటగాళ్లు విచ్చలవిడిగా అడవి జంతువులను మట్టుబెట్టి యథేచ్ఛగా వాటి మాంసాన్ని విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు అడవి జంతువుల కోసం ఉచ్చులు బిగిస్తుంటే.. మరికొందరు విద్యుత్ వైర్లు అమరుస్తున్నారు. ఇంకొందరైతే ఏకంగా వేటకుక్కలను వినియోగిస్తూ అడవి జంతువులను వేటాడుతున్నారు. గురువారం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం పల్లెగుట్ట సమీపంలో కొందరు వేటగాళ్లు అడవి జంతువుల ఇదిగో ఇలా సుమారు పది కుక్కలను వదలగా.. అవి పొలాలను జల్లెడపడుతూ కనిపించాయి. అయితే అటవీ అధికారులు స్పందించి వేటగాళ్లను కట్టడి చేసి అడవి జంతువులను కాపాడాలని జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ



హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో శిశువు రగడ

మగ శిశువుకు బదులు, ఆడ మృత శిశువునిచ్చారని బంధువుల ధర్నా

వరంగల్ మెడికల్, జూలై 18: తమకు మగ శిశువు పుడితే చనిపోయిన ఆడ శిశువును ఇచ్చారని తల్లిదండ్రులు హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన అనూష.. బుధవారం ప్రసవం కోసం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో చేరారు. వైద్యులు ప్రసవం చేశారు. అయితే చనిపోయిన ఆడ శిశువుడును ఇచ్చారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తమకు మగశిశువు పుట్టాడని, ఈ స్థానంలో చనిపోయిన ఆడ శిశువును ఇచ్చారని కన్నీటిపర్యంతం అయ్యారు. వివాహ అనంతరం ఏడేళ్ల తర్వాత గర్భం ధరించిందని, ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే ఇలా చేశారని ఆరోపిస్తున్నారు. కాగా, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ.. తల్లిదండ్రులకు అనుమానం ఉంటే డీఎన్ఏ పరీక్షలకైనా తాము సిద్ధమే అన్నారు. కుటుంబసభ్యులకు ముందుగానే సమాచారం ఇచ్చామని వివరించారు.

గంగదేవిపల్లిని సందర్శించిన విదేశీ బృందం



గంగదేవిపల్లిని సందర్శించిన విదేశీబృందం

గీసుగొండ, జూలై 18: జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని ఇటలీ, సిసిలియా, ఏరిత్రియా దేశాలకు చెందిన ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. బాలవికాస సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 2 వారాల పాటు కమ్యూనిటీ డ్రీవెన్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన విదేశీ బృందం ఫీల్డ్‌విజిట్‌లో గంగదేవిపల్లిని సందర్శించినట్లు జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి తెలిపారు. ఈ సందర్భంగా వారికి గ్రామాభివృద్ధిలో ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యం, గ్రామాభివృద్ధి కమిటీల పనితీరును, సాధించిన అవార్డులు, నగదు పురస్కారాలను రాజమౌళి వివరించారు. కార్యక్రమంలో బాలవికా స సంస్థ డైరెక్టర్ సింగారెడ్డి సునీత, ఆశలత, సుజాత, దీప, రిసోర్స్ పర్సన్స్ గూడ సరోజన, వితంతువుల కమిటీ అధ్యక్షురాలు మేడిద సుశీల పాల్గొన్నారు.

భద్రత చెక్కు అందించిన సీపీ



చెక్కు అందిస్తున్న సీపీ

వరంగల్ క్రైం, జూలై 18: గత నెలలో అనారోగ్యంతో మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ రాజు కుటుంబానికి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా రూ.7లక్షల 89వేల భద్రత చెక్కును అందచేశారు. గురువారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో రాజు సతీమణి మాధవికి కమిషనర్ చెక్కు అందించారు. వారి కుటుంబ సభ్యుల పరిస్థితిని తెలుసుకున్న కమిషనర్.. మిగతా బెనిఫిట్స్ తొందరగా అందించాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో పరిపాలన విభాగం ఏవో రామకృష్ణ స్వామి, సెక్షన్ సూపరింటెండెంట్ జలజ, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్ తదితరులు పాల్గొన్నారు.

సీకేఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా షర్మిల

ఆర్ఎంవోగా యాకుబ్ పాషా.. బదిలీపై రానున్న వైద్యులు

గిర్మాజిపేట, జూలై 18: వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జి.షర్మిల, ఆర్ఎంవోగా డాక్టర్ యాకుబ్ పాషాలు నియమితులయ్యారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ బదిలీల్లో ప్రొఫెసర్ కేడర్‌లో ప్రస్తుత సీకేఎం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న గైనకాలజీ అండ్ అబ్‌స్ట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ టి.నిర్మలాకుమారి.. నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు బదిలీ అయ్యారు. హైదరాబాద్ గాంధీ వైద్య కళాశాలలో గైనకాలజీ అండ్ అబ్‌స్ట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ జి.షర్మిల వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. అలాగే డిప్యూటీ సివిల్ సర్జన్ కేడర్‌లో ప్రస్తుత సీకేఎం ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ శ్యామ్ కుమార్ జనగామ డీఎంహెచ్‌వో కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో హనుమకొండ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ యాకుబ్ పాషా ఆర్ఎంవోగా వస్తున్నారు. అలాగే సివిల్ అసిస్టెంట్ సర్జన్ కేడర్‌లో సీకేఎం ఆస్పత్రి రేడియాలజీ డాక్టర్ రాంబాబు దామెర పీహెచ్‌సీకి, డాక్టర్ వై.వనజ హసన్‌పర్తి పీహెచ్‌సీకి, పీపీ యూనిట్ డాక్టర్ శ్రీదేవి కడిపికొండ పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. కాగా, సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి రేడియోగ్రాఫర్ సిద్ధార్థ 40 శాతం బదిలీల్లో లేకపోవడంతో గురువారం జరిగిన కౌన్సెలింగ్‌లో సీకేఎం ఆస్పత్రిలోనే యథావిధిగా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం నర్సింగ్ అధికారులు, శనివారం ఫార్మసిస్టులు, ల్యాబ్‌టెక్నిషియన్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లకు బదిలీ కౌన్సెలింగ్ జరగనుంది.

21న జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్

వరంగల్ స్పోర్ట్స్, జూలై 18: వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ అధ్వర్యంలో ఈ నెల 21న హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి రేటింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చీఫ్ ఆర్బిటర్ చిన్న రాముల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న ప్రపంచ చదరంగం(చెస్) దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి వరంగల్ జిల్లాల స్థాయిలో అండర్-7, 9, 11, 13 బాలబాలికల విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు శుక్రవారం టీటీడీ కల్యాణ మండపంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 9963214108 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన డీఎస్సీ పరీక్ష

మొదటి సెషన్‌లో 89.6, రెండో సెషన్‌లో 89.13 శాతం మంది హాజరు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 18: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీ-2024 జిల్లాలో గురువారం నుంచి ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలో 5 పరీక్ష కేంద్రాల్లో సీబీటీ పద్ధతిలో నిర్వహిస్తున్న పరీక్ష ప్రశాంతంగా ప్రారంభమైంది. మొదటి రోజు ఉదయం పూట సెషన్‌లో 1,206 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 1,038 మంది హాజరు కాగా 168 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పూట నిర్వహించిన రెండో సెషన్‌లో ఒకే ఒక సెంటర్‌లో 138 మంది అభ్యర్థులకు గాను 123 మంది హాజరయ్యారు. మొదటి రోజు తొలి సెషన్‌లో 89.6 శాతం, మలి సెషన్‌లో 89.13 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం పూట సెషన్‌లో చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ పరీక్ష కేంద్రంలో 102 మంది, అయాన్ డిజిటల్ సెంటర్‌లో 216, జయ ఇనిస్టిట్యూట్ కేంద్రంలో 210, మోక్షిత సెంటర్‌లో 387, నోబెల్ టెక్నాలజీస్ సెంటర్‌లో 153 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. మధ్యాహ్నం పూట సెషన్‌లో అయాన్ డిజిటల్ కేంద్రంలో 123 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు స్థానిక నిర్వాహకురాలు డి. వాసంతి తెలిపారు.

యాప్, వెబ్ సైట్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించేలా అవగాహన కల్పించాలి..

హనుమకొండ టౌన్, జూలై18 : టీజీ ఎన్పీడీసీఎల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించేలా వినియోగదారులకు అవగాహన కల్పించాలని నోడల్ ఆఫీసర్లను సీఎండీ ఆదేశించారు. గురువారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో నోడల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో ఏ విధంగా బిల్లు చెల్లించేలా అనే దానిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌లో భాగంగా ఫీడర్లపై అంతరాయాలను తగ్గించడానికి ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఏబీ స్విచ్‌లు మరమ్మతులు చేసుకొని, వాటిని ఓపెన్ చేసుకొని పని చేయడం ద్వారా అంతరాయాలు తగ్గుతాయన్నారు. ప్రతీ సర్కిల్‌లో ఇలా చేయడం ద్వారా అంతరాయాలు కనిష్టస్థాయికి తగ్గుతాయన్నారు. విద్యుత్ అంతరాయాలపై ఎప్పటికప్పుడు కిందిస్థాయి సిబ్బందికి మార్గనిర్దేశం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, సీజీఎంలు తిరుమల్‌రావు, కిషన్, రాజుచౌహాన్, కె.ఎస్.గుప్త, జీఎంలు గౌతమ్‌రెడ్డి, నాగప్రసాద్, వేణుబాబు, దేవేందర్, మాధవరావు, అన్నపూర్ణ, డీఈ (టి) శ్రీధరాచారి తదితరులు పాల్గొన్నారు.



ములుగులో బాణాసంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు



లింగాల ఘనపురంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య

మాఫీ జరిగె.. పండుగ వచ్చే..



మహబూబాబాద్ రైతువేదికలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి

దేవరుప్పులలో పొలం వద్ద రైతులు, కాంగ్రెస్ నాయకుల సంబురాలు





హనుమకొండలోని డీసీసీబీ కార్యాలయం ఎదుట జరిగిన సంబరాల్లో డప్పు కొడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

ఎన్నికల హామీగా కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన మాట మేరకు రూ.2లక్షల రుణమాఫీకి శ్రీకారం చుట్టింది. గురువారం రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేస్తూ 'రుణమాఫీ పండుగ' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ క్రమంలో గ్రామాల్లో సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు చిత్రపటాలు, ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యేలు, నేతలు ర్యాలీలు.. ఎద్దులబండ్లతో ఊరేగింపులు నిర్వహించారు. బాణసంచా కాల్చారు. మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా రైతులు కూడా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇక రైతువేదికల్లో జరిగిన కార్యక్రమాలకు హాజరైన రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ సచివాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి అయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సీఎంతో మాట్లాడి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.



భూపాలపల్లి జిల్లా చిట్యాలలో జరిగిన ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



తొర్రూరు మండలం మాటేడులో ఎద్దులబండిపై నుంచి రైతులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి



ఆత్మకూరు మండలం హౌజ్‌బుజుర్గ్ గ్రామంలో బైకు ర్యాలీలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



సీఎం రేవంత్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రైతు ఎల్లయ్య

మీకు రుణపడి ఉంటాం..

రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తాం

సీఎం రేవంత్‌తో బొల్లికుంట రైతు ఎల్లయ్య

శంభునిపేట, జూలై 18: రైతులకిచ్చిన మాట నిలుపుకొన్న సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటామని వరంగల్‌లోని ఉర్సు ప్రాంతానికి చెందిన రైతు బొల్లు ఎల్లయ్య అన్నారు. రుణమాఫీ సందర్భంగా గురువారం ఖిలావరంగల్ మండలం బొల్లికుంటలో పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడగా అందులో భాగంగా వరంగల్‌కు చెందిన రైతు బొల్లు ఎల్లయ్య మాట్లాడుతూ.. రైతులకు ఒకే విడతలో రుణమాఫీ చేసి రైతులకు మేలు చేసిందని, సీఎంతో చెప్పారు. జోడో యాత్ర సభలో భాగంగా వరంగల్‌లో నిర్వహించిన సభలో ఇచ్చిన డిక్లరేషన్ మేరకు రైతు రుణమాఫీ చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. తాము రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తామని, ఆయన్ను వరంగల్‌కు మళ్లీ తీసుకురావాలని రేవంత్ రెడ్డిని కోరారు. అందుకు స్పందించిన సీఎం రేవంత్.. రైతు రుణమాఫీ వరంగల్ డిక్లరేషన్‌లోనే చెప్పామని అధికారంలోకి వచ్చి చేశామని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీని వరంగల్ తీసుకొస్తే సభను విజయవంతం చేస్తారా అని ఎల్లయ్యను అడుగగా.. 5లక్షల మంది రైతులను తీసుకువస్తాం అని ఎల్లయ్య సమాధానం ఇచ్చారు.

బాలికల వసతి గృహాన్ని మార్చాలి

హనుమకొండ కలెక్టరేట్, జూలై18: హనుమకొండ జులైవాడలో ఉన్న పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతి గృహాన్ని అంబేద్కర్ భవన్ ముందు ఉన్న కొత్త భవనంలోకి మార్చాలని లంబాడా హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) నాయకులు జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కోరారు. ఈ మేరకు ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర వెంకట్, గిరిజన రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ భాస్కర్ నాయక్, అరుణ్ నాయక్, శ్రీనివాస్ నాయక్, రోహిత్, ప్రవీణ్ కుమార్‌లు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఓరుగల్లు సాక్షిగా మాట నిలబెట్టుకున్న సీఎం

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూలై 18: పోరాటాల గడ్డ ఓరుగల్లు సాక్షిగా రైతులకు ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ మాటను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలబెట్టుకున్నారని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయానికి ఓరుగల్లే వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వం రైతులకు రుణమాఫీ ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయ ఆవరణలో చైర్మన్ అధ్యక్షతన సంబురాలు జరిగాయి. పాలకమండలి సభ్యులు, సహకార సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చిత్రపటానికి రవీందర్‌రావు క్షీరాభిషేకం చేశారు. బాణాసంచా పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. రేవంత్‌రెడ్డి చిత్రంతో కూడిన కేక్‌ను రవీందర్‌రావు కట్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో పార్టీ అధినేత రాహుల్‌గాంధీ పాల్గొన్న సభలో వరంగల్ డిక్లరేషన్ పేరిట రేవంత్‌రెడ్డి రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ప్రకటించారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఆరు గ్యారంటీల అమలు, రుణమాఫీపై ప్రజలు, రైతులకు వాగ్దానం చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి రుణమాఫీ చేయడం అభినందనీయమన్నారు. దేశ చరిత్రలోనే రుణమాఫీ ఘట్టం చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. ఈ ఘనత రేవంత్‌రెడ్డికే దక్కిందని పేర్కొన్నారు. రుణమాఫీ వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో 57,129 మంది రైతులకు లబ్ధిచేకూరిందని, మొత్తంగా 249.61 కోట్ల రుణమాఫీ జరిగినట్లు రవీందర్‌రావు వివరించారు. ఆగస్టు 15 నాటికి మొత్తంగా రూ.2లక్షల రుణమాఫీ ప్రక్రియ సంపూర్ణంగా జరుగుతుందన్నారు. రైతుల పక్షపాతిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలిచారన్నారు. రుణమాఫీ కారణంగా రాష్ట్రంలోని రైతుల ఆనందోత్సాహాలకు అవధులు లేవన్నారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డికి రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు మార్నేని రవీందర్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, బ్యాంకు డైరెక్టర్లు రాజేశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్, గోపాల్‌రావు, నర్సింగరావు, రమేశ్, పీఏసీఎస్ చైర్మన్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం

రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి

ఐనవోలు, జూలై 18 : ఉపాధ్యాయుల సమస్యలు పీఆర్టీయూ సంఘంతోనే పరిష్కరించనున్నట్టు పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. పీఆర్టీయూ సభ్యత్వ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం ఐనవోలు, వెంకటాపూరం, సింగారం, మరియపురం, పున్నేలు, పంథిని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ.. త్వరలోనే ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తామని, అందుకు సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించగా గైడ్ లైన్స్ సిద్ధం చేయాలని ఆదేశించారని తెలిపారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతలు ఇప్పించిన ఘనత పీఆర్టీయూకే దక్కుతుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు నగదు రహిత చికిత్స అందించే విధంగా నూతన హెల్త్ స్కీంను త్వరలోనే సీఎంతో ఉత్తర్వులు ఇప్పిస్తామన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టడంతో సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు గుడికందుల సమ్మయ్య, జూలూరు చంద్రమోహన్, మాజీ అధ్యక్షుడు గుర్రం రాజు, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి తిరునగరి శ్రీను, అసోసియేట్ అధ్యక్షులు తిరునగరి సూరి బబు, బొమ్మెర సోమ య్య తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి



రాంనగర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు



అంబేద్కర్ సెంటర్‌లో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



మడికొండలో రైతు రుణమాఫీ ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమంలో పాల్గొన్న జంగా రాఘవరెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య

రుణమాఫీతో వెల్లువెత్తిన సంబరాలు

వడ్డెపల్లి, జూలై 18: ప్రతీ రైతును రుణవిముక్తి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పలువురు రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ నేతలు అన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశానుసారం రుణమాఫీ చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం సీఎంకు ధన్యవాదాలు తెలుపుతూ హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు కాంగ్రెస్ శ్రేణులు క్షీరాభిషేకాలు చేశారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, బాణసంచా పేల్చి సంబరాలను నిర్వహించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత ఈవీ శ్రీనివాస్‌రావు, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్, విజయశ్రీరజాలి, మామిండ్ల రాజు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళసంపత్ యాదవ్‌లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఇచ్చిన మాట మేరకు రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు వరకు రైతుల పేరిట ఉన్న బకాయిలకు రుణమాఫీ వర్తిస్తుందని అన్నారు. అందుకే ఏక మొత్తంలో రూ. 2 లక్షల రుణమాఫీ పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. రైతుల ఖాతాల్లో ఆగస్టు 15 లోపు రూ. 2 లక్షల రుణమాఫీ డబ్బు జమ అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు నసీం జహాన్, ఎనుకొంటి నాగరాజు, నెక్కొండ కిషన్, బోడ డిన్నా, కాంగ్రెస్ పార్టీ జిల్లా నేతలు డాక్టర్ రామకృష్ణ, మహ్మద్ అంకూస్, రహీమున్నీసా బేగం, తాళ్లపెల్లి సుధాకర్, మండల సమ్మయ్య, వల్లెపు శ్రీనివాస్, తాళ్లపెల్లి రవీందర్, మొగ్గం లింగమూర్తి, సుగుణ కిశోర్, సత్యనారాయణ, డాక్టర్ శ్రవణ్, మేరి, నాగరాజు పాల్గొన్నారు.

రైతును రాజును చేయడమే లక్ష్యం

మడికొండ: రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్షమని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. రైతు రుణమాఫీ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం గురువారం మడికొండలోని రైతు వేదికలో నిర్వహించారు. కార్యక్రమంలో జంగా రాఘవరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉండి రూ.2 లక్షలు రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి విడతల వారీగా ఇచ్చిన రుణమాఫీ.. బ్యాంకు వడ్డీలకు సరిపోలేదని విమర్శించారు. రైతుల సంక్షేమం కోసం పాదయాత్ర చేసి వారి అవసరాలు తెలుసుకొని రైతులకు మేలు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తరహాలో రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్రశంసించారు. ఒకే విడతలో రూ. 2లక్షల రుణమాఫీ చేసిన ఘనత దేశంలో ఒక్క తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని నమ్మి వరంగల్ సభలో రాహుల్ గాంధీ ఇచ్చిన రైతు డిక్లరేషన్ హామీని నెరవేర్చడంతో గ్రామ గ్రామాన రైతులు పండగ చేసుకుంటున్నారని తెలిపారు.

కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. రుణమాఫీ రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. హనుమకొండ జిల్లాలో ఒక్క రోజులోనే 22 వేల మంది రైతుల ఖాతాల్లోకి రూ.145కోట్లు జమ అయ్యాయన్నారు. మరో రెండువిడతల్లో రూ.2లక్షల రుణమాఫీ పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ దామోదర్‌రెడ్డి, కాజీపేట తహసీల్దార్ బావుసింగ్, ఏవో దొండపాటి శ్రీధర్‌రెడ్డి, ఏఈవోలు భరత్, జయప్రకాష్, రజిత, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నాయకులు గంగుల శ్రీనివాస్ రెడ్డి, వస్కుల శంకర్, బిల్ల రవిందర్, కుర్ల మోహన్, బైరి లింగమూర్తి, దువ్వ విజయ్, రసజ్ఞ, నీలం రజినివేణుయాదవ్, వస్కుల శ్రీను, గడుసు రాజు, చంటి, వినయ్, గౌతమ్, భిక్షపతి, కొలంబో పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

మడికొండలో రైతుల సంబరాలు

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ. 2లక్షల రుణమాఫీలో లక్షరూపాయలు రుణమాఫీ చేసినందుకు మడికొండలోని రైతు వేదిక వద్ద గురువారం రైతులు సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి పాల్గొని సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటించడంతో బాణసంచా కాల్చారు. స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నాయకులు గంగుల శ్రీనివాస్‌రెడ్డి, వస్కుల శంకర్, బిల్ల రవిందర్, కుర్ల మోహన్, బైరి లింగమూర్తి, దువ్వ విజయ్, రసజ్ఞ, నీలం రజినివేణుయాదవ్, వస్కుల శ్రీను, గడుసు రాజు, చంటి, వినయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రేటర్ వరంగల్ 45వ డివిజన్ కడిపికొండలో మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్మెట వెంకటరమణగౌడ్, సట్ల సదానందం, బస్కె శ్రీలేఖక్రిష్ణ, రాము, బస్కె ప్రణయ్, నర్మెట వేణు, శీలం రమేష్, నాగపురి రాజయ్య, బత్తిని బిజయగిరి, లాదెల్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● రాంనగర్: లక్ష రూపాయల రుణమాఫీ చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని హనుమకొండ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిలి వెంకటరాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గురువారం భీమారంలోని రైతువేదికలో సమావేశం ఏర్పాటు చేశారు. రుణమాఫీ చేసిన రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం రైతువేదిక నుంచి హసన్‌పర్తి వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగళ్లపల్లి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, నేతలు కిరణ్, వీసం సురేందర్‌రెడ్డి, బిల్లా ఉదయ్‌రెడ్డి, మెరుగు రాజేష్‌గౌడ్, చల్లా గోపాల్‌రెడ్డి ఏర్కొండ శ్రీనివాస్, జన్ను రవిందర్, పుల్ల రవిందర్, ఆరెల్లి వెంకటస్వామి పాల్గొన్నారు.

● ఐనవోలు: రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ పథకం మొదటి విడత నిధుల విడుదలపై గురువారం కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. రూ. లక్ష వరకు రుణమాఫీ నిధులను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్‌ను ఐనవోలు రైతు వేదికలో వీక్షించారు. మొదటి విడత రూ.లక్ష విడుదల చేయడాన్ని హర్షించారు. దశలవారీగా ప్రతీ రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ జరిగి తీరుతుందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏవో ఆడెపు కవిత, మాజీ ఎంపీపీ మార్నేని మధుమతి, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఏఈవోలు మీన, అనూష, సువర్ణ, బిందు, ఆఫ్రీన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రుణమాఫీని హర్షిస్తూ మాజీ సర్పంచ్ బోయినపల్లి శ్రీనివాస్‌రావు నేతృత్వంలో రాంనగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జెట్టబోయిన రాజు, బొమ్మినేని రాకేష్‌రెడ్డి, యాకర సాంబయ్య, చీకటి శ్రీనివాస్, జలగం ఎల్లకుమార్, బుర్ర యాదగిరిగౌడ్, వెంకన్న, నవీన్ పాల్గొన్నారు.

● ధర్మసాగర్: రుణమాఫీ చేయడాన్ని హర్షిస్తూ ధర్మసాగర్ మండల కేంద్రంలో సీఎం చిత్ర పటానికి మండల పార్టీ అధ్యక్షుడు ప్రసాద్ క్షీరాభిషేకం చేశారు. అమరవీరుల స్థూపం వద్ద కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. బస్టాండ్ నుంచి రైతు వేదిక వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ముత్తిరెడ్డి అమరేం దర్‌రెడ్డి, మండల నాయకులు వెంకట్‌రెడ్డి, లెనిన్, రవీందర్, దుర్గయ్య, మాజీ ఎంపీటీసీ రాజు, రాజకుమారి, యామిని, లక్ష్మి, అనురాధ, విప్లవరెడ్డి పాల్గొన్నారు.

● వడ్డెపల్లి: రైతుల రుణమాఫీని పురస్కరించుకొని గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని సర్దార్ సర్వాయి పాపన్న జంక్షన్ వద్ద డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంక హరిబాబు ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గోపాల్‌పూర్ మాజీ సర్పంచ్ దూలం సదానందం గౌడ్, మాజీ ఉప సర్పంచ్ చింత రమేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు రుద్రోజు మణీంద్రనాథ్, భూక్యా విజయ్‌నాయక్, దూలం పరమేశ్ గౌడ్, దామోదర్, మహ్మద్ హైదర్, వెంకట్‌రెడ్డి, బొల్లినేని సుధాకర్, పల్లకొండ సరోజన పాల్గొన్నారు.

● హనుమకొండ కలెక్టరేట్: రైతులకు రుణమాఫీ చేస్తానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టారని టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ అన్నారు. గతంలో హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో తెలంగాణలో రైతు రుణమాఫీ చేస్తానని రాహుల్‌గాంధీ ప్రకటించిన నేపథ్యంలో గురువారం అదే మైదానంలో కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిల చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సమన్వయ కర్త మార్క విజయ్ కుమార్‌తోపాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బల్దియాలో బదిలీల ప్రక్రియ షురూ

40 శాతం మంది ఉద్యోగులకు స్థానచలనం

బదిలీల ప్రక్రియను పర్యవేక్షించిన కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూలై 18: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన కార్యాలయంతోపాటు కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల్లో విధులు నిర్వర్తించే 4వ తరగతి ఉద్యోగులకు గురువారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచే బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, హనుమకొండ అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్‌ఓ గణేశ్, ఇన్‌చార్జి అదనపు కమిషనర్ కృష్ణారెడ్డి, డీఎంహెచ్‌వో సాంబశివరావు, సూపరింటెండెంట్లు రావుల ఆనంద్, బాకం సంతోష్‌లతో పాటు డిప్యూటీ తహసీల్దార్లు సంతోష్‌కుమార్, శ్యామ్, డాక్టర్ పుట్ట మహేందర్‌రావు, ప్రతాప్‌రెడ్డిశ్యామ్‌లు ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఉద్యోగ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల బదిలీలు పూర్తిగా పారదర్శకంగా జరుగుతాయన్నారు. 40శాతానికి మించకుండా సర్వీస్ బుక్ ఆధారంగా సీనియారిటీని దృష్టిలో పెట్టుకుని బదిలీలు చేయనున్నట్లు తెలిపారు. వైద్యపరమైన సమస్యలున్నవారు, గుండెజబ్బులు, బైపాస్ సర్జరీ, క్యాన్సర్, మానసిక వికలాంగులైన పిల్లలు జన్మించినవారు, కిడ్నీ మార్పిడీచేసుకున్న వారు, వితంతువులకు ఈ బదిలీలలో మినహాయింపు ఉంటుందని వెల్లడించారు.

445 మంది ఉద్యోగులు హాజరు

4వ తరగతి ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌లో 445 మంది ఉద్యోగులు హాజరయ్యారు. బల్దియా నుంచి పరకాలకు, పరకాల నుంచి హనుమకొండకు 40 శాతం ఉద్యోగులలో 112 మందికి బదిలీ తప్పదని సీనియర్ అధికారులు చెబుతున్నారు. ఈమేరకు 30 కేటగిరీలలో ఉద్యోగాలు చేస్తున్న అటెండర్ల నుంచి జూనియర్ అసిస్టెంట్ల వరకు ఒక్క రోజు పాటు జరిగిన కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జూనియర్ అసిస్టెంట్లు, బిల్‌కలెక్టర్లు, ఫైన్‌మెన్‌లు, వాటర్‌క్యారియర్స్, మ్యాన్‌మజ్దూర్, వర్క్ఇన్‌స్పెక్టర్లు, పంప్ ఆపరేటర్లు, హెల్పర్లు, బోర్‌వెల్ ఆపరేటర్లు, అటెండర్లు, లైన్‌మెన్‌లు, పీహెచ్ వర్కర్లు, జవాన్లు, మాలీమాలన్‌లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. వీరికి హనుమకొండ జిల్లా పరిధిలోని పరకాల, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్యాలయం, కాజీపేట, కాశిబుగ్గ కార్యాలయాల పరిధిలోని 66 డివిజన్‌లలో విధులు నిర్వర్తిస్తారు. మరో రెండు రోజుల్లో బదిలీల జాబితా అధికారికంగా విడుదల చేయనున్నారు.



మహిళా ఉద్యోగికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కమిషనర్

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

కలెక్టర్ ప్రావీణ్య

వడ్డెపల్లి, జూలై 18: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను వెంటనే కల్పించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. 'మన ఊరు- మన బడి' కార్యక్రమంలో భాగంగా హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం సందర్శించారు. పాఠశాలలోని తరగతిగదుల్లో చేపట్టిన విద్యుత్, టాయిలెట్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందరికీ అందించారా? అని విద్యార్థులను అడిగారు. అనంతరం వడ్డెపల్లి మిడిదొడ్డివాడలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వన మహోత్సవంలో భాగంగా వడ్డెపల్లి పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి డీఈవో వాసంతి, జిల్లా సంక్షేమ అధికారి మధురిమ తదితరులు ఉన్నారు.

ఈవీఎంల స్ట్రాంగ్‌రూంలను తనిఖీ చేసిన కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంలను హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య గురువారం తనిఖీ చేశారు. ప్రతీ నెల నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా హనుమకొండ జిల్లాలోని పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను కలెక్టర్ తనిఖీ చేసిన అనంతరం స్ట్రాంగ్ రూంల వద్ద కొనసాగుతున్న పోలీస్ భద్రత, రికార్డుల నిర్వహణ, సీసీ కెమెరాల నిఘాను ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాదరావుతోపాటు ఇతర అధికారులు ఉన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ పి. ప్రావీణ్య

గుడిసె వాసులకు పట్టాలివ్వాలి

• సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

• తహసీల్దార్‌కు వినతి

కాజీపేట, జూలై 18: న్యూ శాయంపేట 579 సర్వే నం బర్‌లోని కందుల బండలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు వెంటనే పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం కాజీపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఈ ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఎం.చుక్కయ్య మాట్లాడారు. సర్వే నంబర్ 579లోని 7 ఎకరాల 10 గుంటల ప్రభుత్వ స్థలంలో మూడేళ్లుగా నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు.

వీరికి ప్రభుత్వమే పట్టాలిచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జూలై 12న గుడిసెవాసులను న్యూ శాయంపేటకు చెందిన కొందరు దుండగులు మద్యం సేవించి గుడిసె వాసులపై దాడులు చేశారని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం గుడిసెవాసుకుల పట్టాలివ్వాలని కోరుతూ కాజీపేట తహసీల్దార్ బావుసింగ్‌కు వినతి పత్రం అందజేశారు. మండలపార్టీ నాయకులు జంపాల రమేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఓరుగంటి సాంబయ్య, కారు ఉపేందర్, కె.విమల, మదన్, రేణుక, జన్నం త్‌తోపాటు గుడిసెవాసులు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


రిజిస్ట్రేషన్ శాఖలో ప్రైవేటు వ్యక్తుల హవా

రాంనగర్, జూలై 18: జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల హవా నడుస్తోంది. అధికారులు నిర్వహించే విధులు ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఏదైనా పని కావాలన్నా ప్రైవేటు వ్యక్తులను సంప్రదిస్తే సరిపోతుందనే స్థాయిలో వారి పెత్తనం కార్యాలయంలో సాగుతోంది. అధికారులు వారి వ్యక్తిగత పనుల కోసం నియమించుకున్న ప్రైవేటు వ్యక్తులు.. కార్యాలయంలోని ప్రతీ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో వీరి హవా కొనసాగుతోంది.

కాగా, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రికార్డు రూమ్ కీలకమైంది. ఈ రికార్డు రూమ్‌లోనే క్రయవిక్రయాలకు సంబంధించిన డాక్యుమెంట్లు ఉంటాయి. అటువంటి రికార్డు రూమ్ బాధ్యతలు ఒక ప్రైవేటు వ్యక్తి నిర్వహించడం గమనార్హం. రికార్డు రూమ్ ఇన్‌చార్జి (సీనియర్ అసిస్టెంట్) వరంగల్ రూరల్ కార్యాలయం ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఆ బాధ్యతలు ఒక ప్రైవేటు వ్యక్తికి అప్పగించారు. ఎలాంటి అర్హత లేని వ్యక్తికి కీలక బాధ్యతలు అప్పగించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మూడు నెలలుగా సదరు ప్రైవేటు వ్యక్తి బాధ్యతలు నిర్వహిస్తుండటం గమనార్హం. గతంలో కార్యాలయం మార్చినప్పుడు పలు పత్రాలు పోయాయనే ఆరోపణలున్నాయి. కీలక పత్రాలు భద్రపరిచే రూమ్ బాధ్యతలు ప్రయివేటు వ్యక్తికి అప్పగించడం ప్రమాదకరమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పర్మినెంట్ ఉద్యోగికి బాధ్యత అప్పగించాల్సిన అవసరం ఉంది.

విద్యుత్ అంతరాయం

హనుమకొండ టౌన్, జూలై 18 : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈ సాంబరెడ్డి తెలిపారు. ఆర్‌ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని దర్గా, బియాబనీనగర్, గాంధీనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, బీజేపీ క్వార్టర్స్ ఏరియాలో ఉదయం 10.30 నుంచి 1 గంట వరకు, సోమిడి సబ్‌స్టేషన్ పరిధిలోని సోమిడి, కాజీపేట, విష్ణుపురి, రహమత్‌నగర్, వెంకటాద్రినగర్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.



విశేషం

అతడే గురువు

21న గురుపౌర్ణమి



గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురు స్సాక్షాత్ పరబ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః

గురువు సృష్టికర్త అయిన బ్రహ్మ. స్థితికర్త అయిన విష్ణువు. లయకర్త అయిన మహేశ్వరుడు. అందుకే గురువు పరబ్రహ్మం. అవ్యక్త స్వరూపుడు. గురుదేవుడు మానవ రూపంలోనే ఉండి జ్ఞానం బోధిస్తున్నాడు... ఈ మాటలు వేరేవరో అన్నవి కావు... సాక్షాత్తూ పరమేశ్వరుడే పార్వతికి చెప్పినవి. ఇది 'స్కాంద పురాణం'లో చోటుచేసుకున్న పవిత్ర విషయం. మూడు అధ్యాయాలతో, 351 శ్లోకాలతో 'సనత్కుమార సంహిత'గా ప్రాచుర్యం అది పొందింది.

తల్లితండ్రుల తరువాత స్థానం గురువుదే. 'ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్ నిబోధిత...'... మేలుకొని, మేలుకొలుపులో వెలిగిపోయి, సత్యాన్ని ఎరుకపరచుకొని ముందుకు సాగాలనీ, గమ్యాన్ని చేరుకోవాలనీ, జీవితాన్ని ధన్యం చేసుకోవాలనీ శ్రుతులు చెబుతున్నాయి. గమ్యాన్ని చేర్చేవాడు గురువు. అందుకే అతను పరబ్రహ్మ. 'గురుగీత'లో గురు వైభవాన్ని వివరిస్తూ "బ్రహ్మానంద స్వరూపుడు, పరమ సుఖాన్ని ప్రసాదించేవాడు, కేవలం జ్ఞాన స్వరూపమైనవాడు, ద్వంద్వాలకు అతీతుడు, ఆకాశ రూపుడు, 'తత్త్వమసి' తదితర మహా వాక్యాలకు లక్ష్యమైనవాడు, అద్వయుడు, నిత్యుడు, పరిశుద్ధుడు, నిశ్చలుడు, సర్వ సంకల్పాలకు సాక్షి అయినవాడు, భావాతీతుడు, గుణాతీతుడు... అతడే గురువు" అన్నాడు పార్వతితో పరమేశ్వరుడు.

గుకారశ్చ స్థకారస్తు రుకార స్తన్నిరోధకృత్
అంధకార వినాశిత్వాత్ గురురిత్యభిధీయతే

"గుకారం అంటే చీకటి (అజ్ఞానం). చీకటిని పోగొట్టే ప్రకాశం... రుకారం (జ్ఞానం). గురువు అంటే అజ్ఞానాంధకారాన్ని దూరం చేసేవాడు" అంటోంది గురు గీత. "క్షీరాన్ని ఇచ్చేది ధేనువు, జ్ఞానాన్ని ఇచ్చేది గురువు. గాలిని ఇచ్చేది తరువు. జాలిని చూపేది గురువు" అన్నారు స్వామి సుందర చైతన్యానంద ఒక సందర్భంలో. శిష్యులే కాకుండా ఎవరు ఆపదల్లో ఉన్నా వారిని వెంటనే గురువు దరిచేర్చుకుంటాడు. వారి ఆర్తిని తీరుస్తాడు. అతను ఏ ఆశలు లేనివాడు. శాంత స్వభావుడు. అజేయ శక్తి. తనకన్నా తన శిష్యులు ఇంకా ఎత్తుకు ఎదగాలని ఆశిస్తాడు. అది తప్ప వేరే ఆలోచన, ఆకాంక్ష లేనివాడు. గురు హృదయం గురించి ఇంకా ఎంతైనా చెప్పవచ్చు.

భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉంది. గురువును త్రిమూర్తి స్వరూపుడిగా భావన చేస్తూ పూజించడం అనాదిగా వస్తోంది. జ్ఞానభిక్ష పెట్టే మహాత్ముడు గురువు. ఆ గురువులకే గురువు... వేదవ్యాసుడు. వ్యాసుడి అసలు పేరు కృష్ణుడు. నల్లని మేని ఛాయ కలిగినవాడు కనుక 'కృష్ణుడు' అనే పేరు వచ్చింది. సత్యవతీ పరాశరుల పుత్రుడైన అతను ద్వీపంలో జన్మించాడు. కాబట్టి 'కృష్ణ ద్వైపాయనుడు' అంటారు. ఆయనను కొందరు సాక్షాత్తూ నారాయణుడి అంశగా, మరికొందరు సదాశివుడి అవతారంగా భావిస్తారు. వ్యాసుడికి పూర్వం అనేక కల్పాలలో... పలువురు మహర్షులు వేద, పురాణ, ఇతిహాసాలను ప్రవచించారు. కాలక్రమంలో... వాటిలో చాలావరకూ శిథిలం అయిపోగా... ఈ కల్పంలో వ్యాసుడు వాటన్నిటినీ ఏర్చికూర్చి నాలుగు వేదాలతో పాటు పంచమ వేదమైన భారతాన్నీ, పురాణ వాఙ్మయాన్నీ ఉద్ధరించాడు. ఈ కారణంగా ఆయనను 'వేదవ్యాసుడి'గా కీర్తిస్తారు. ఆ వేద, పురాణ, ఇతిహాస వాఙ్మయాన్ని తన శిష్యుల ద్వారా జగత్తుకు అందించిన వ్యాసుణ్ణి తొలి గురువుగా పరిగణిస్తారు. వ్యాసుడు జన్మించిన ఆషాఢ పౌర్ణమిని గురుపౌర్ణమిగా, వ్యాస పౌర్ణమిగా... తరతరాలుగా జరుపుకొంటున్నారు.

ఆత్మ జ్ఞానాన్ని అందించేవాడు గురువు. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' అన్నారు పూర్వులు. జ్ఞానార్జనలో ప్రధానమైనది గురుబోధ. గురు శిష్యుల మధ్య ఉండే బంధం పవిత్రమైనది. గురువులో ఉన్న పవిత్రత బోధించడంలో, శిష్యుడిలో ఉన్న పవిత్రత సేవించడంలో తెలుస్తుంది. మనల్ని మనం ఉద్ధరించుకోవడానికి, అహంకారాన్ని తగ్గించుకోవడానికి, గురు కృపను పొందడానికి గురుసేవ చేయాలి. గురు పౌర్ణమి నాడు వారిని గుర్తు చేసుకోవాలి. వారిపట్ల మన భక్తి శ్రద్ధలను, విధేయతను తెలుపుకోవాలి.

సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం
అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం... అని గురువులకు అంజలి ఘటిద్దాం.

● ఆయపిళ్ళ రాజపాప

ఆషాఢ మాసానికీ, గోరింటాకుకూ విడదీయలేని అనుబంధం. ఈ నెలలో ఒకసారైనా గోరింటాకు పెట్టుకొనే ఆనవాయితీ పూర్వకాలం నుంచీ ఉంది. వర్షాకాలంలో గోరింటాకు పెట్టుకోవడం ఆరోగ్యదాయకం కూడా. గోరింటాకు పుట్టుక గురించి ఒక కథ ప్రచారంలో ఉంది. దాని ప్రకారం:

గోరింటాకు అసలు పేరు గౌరింటి ఆకు... అంటే 'గౌరి ఇంటి ఆకు'. 'గౌరి' అంటే పార్వతీదేవి. ఆమె బాల్యంలో తన చెలికత్తెలతో ఉద్యానవనంలో ఆటలు ఆడుతూ రజస్వల అయింది. ఆమె నుంచి నేలపై నెత్తుటి చుక్క పడింది. అది పడిన ప్రదేశంలో ఒక మొక్క మొలిచింది. ఈ విషయాన్ని పర్వతరాజుకు గౌరీదేవి చెలికత్తెలు చెప్పారు. ఆయన తన పరివారంతో అక్కడికి వచ్చాడు. ఈలోగా చెట్టు పెద్దదయిపోయింది. పార్వతి తన బాల్య చాపల్యంతో... ఆ చెట్టు ఆకును కోసింది. ఆమె వేళ్ళు ఎర్రబడ్డాయి. ఏం జరిగిందోనని పర్వతరాజు కంగారు పడ్డాడు. "నాకు ఎలాంటి బాధా కలగలేదు. పైపెచ్చు ఇది వేళ్ళకు చక్కని అలంకారంగా కూడా కనిపిస్తోంది" అని చెప్పింది పార్వతి.

"నేను పార్వతీదేవి రుధిరాంశతో పుట్టాను. కానీ నా వల్ల ఈ లోకానికి ఏం ప్రయోజనం?" అని ఆ చెట్టు అడిగింది. అప్పుడు పర్వతరాజు "ఇక మీదట మానవ లోకంలో మహిళలకు సౌభాగ్య చిహ్నంగా ఈ ఆకు


గోరింటాకు... ఆషాఢం

నిలిచి, లోక ప్రసిద్ధం అవుతుంది. రజస్వల సమయాన ఉద్భవించిన ఈ చెట్టు మహిళలలో గర్భాశయ దోషాలను, అతి ఉష్ణాన్నీ తొలగిస్తుంది. మహిళలకు ఆరోగ్యాన్ని చేకూరుతుంది. అంతేకాదు... చేతులకు, కాళ్ళకు అందాన్ని ఇచ్చే అలంకార వస్తువుగానూ వినియోగపడుతుంది. ఆ విధంగా నీ పుట్టుక సార్థకమవుతుంది. గౌరీదేవి ఇంటిలో పుట్టావు కాబట్టి నీ ఆకును 'గౌరింటాకు'గా పిలుస్తారు" అని ఆ చెట్టుకు వరం ఇచ్చాడు.

గౌరితో సహా మహిళలందరూ ఆ చెట్టు ఆకుల పసరును చేతులకూ, కాళ్ళకూ అందంగా తీర్చిదిద్దుకున్నారు. కుంకుమకు సందేహం కలిగింది. 'ఈ ఆకును నుదుట కూడా దిద్దుకుంటే... నా ప్రాధాన్యత తగ్గిపోతుందేమో' అనే తన అనుమానాన్ని గౌరీదేవికి చెప్పింది.. "ఇది నుదుట పండదు" అని కుంకుమకు గౌరి అభయం ఇచ్చింది. అందుకే... నుదుటి మీద ఈ ఆకు పసరు రాసుకున్నా పండదు. కాలక్రమేణా 'గౌరింటాకు'... వాడుకలో 'గోరింటాకు' అయింది. గోరింటాకు ఏడాదికి ఒకసారి ఆషాఢమాసంలో పుట్టింటికి... అంటే పార్వతీదేవి దగ్గరకు వెళుతుందట! తాను అక్కడ ఉన్నప్పుడు కూడా తనను ఎవరూ మరచిపోకుండా ఉండడానికి... ఆ నెలలో మహిళలు తప్పకుండా గోరింటాకు పెట్టుకోవాలని కోరిందట! అదే సంప్రదాయంగా మారింది.



గోరింటాకుకు ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఇది గర్భాశయ దోషాలను నివారిస్తుంది. అరచేతి మధ్యలో మహిళల గర్భానికి రక్తాన్ని చేరవేసే ప్రధాన నాడులు ఉంటాయి. వాటిలో అతి ఉష్ణాన్ని గోరింటాకు తొలగించి, ప్రశాంతపరుస్తుంది. ప్రసవం వల్ల కలిగే గర్భాశయ బాధలు నయమవుతాయి. వర్షాకాలంలో... నీటి కారణంగా చర్మ సమస్యలు ఎదురవుతాయి. చేతులకు కాళ్ళకు గోరింటాకు పెట్టుకుంటే... ఈ సమస్యలను నివారించుకోవచ్చు.



సహజయోగ

స్వయం గురుతత్త్వం

న గురోరధికం తత్త్వం న గురోరధికం తపః
తత్త్వ జ్ఞానాత్పరం నాస్తి తస్మై శ్రీగురవే నమః

"గురువును మించిన తత్త్వం లేదు. గురువును మించిన తపస్సు లేదు. అటువంటి గురుదేవునికి నమస్కరిస్తున్నాను..."- గురువు ఉన్నత స్థానాన్ని గురుగీతలోని ఈ శ్లోకం వివరిస్తోంది. ప్రతి శిష్యుడు తన గురువును పూజించడం చాలా అవసరం. ఇది అనాదిగా వస్తున్న సంప్రదాయం. అయితే ఆ గురువు సద్గురువు అయి ఉండాలి. శ్రీగణేశుడు తన తల్లిని పూజించి... ఆది గురువు అయ్యాడు. గురుత్వానికి మూలం, సారం ఆయనే. గురువు స్త్రీ కావచ్చు, పురుషుడు కావచ్చు. కానీ ఆ గురువులోని మాతృ స్వభావమే తన శిష్యులను తీర్చిదిద్ది... గురువులుగా మారుస్తుంది. కాబట్టి మీరు ముందుగా గురువులు కావాలి. అయితే మీలో మాతృతత్త్వాన్ని పెంచుకుంటేనే అది సాధ్యం.

గురువు ప్రప్రథమంగా మనల్ని భగవంతుడితో అనుసంధానం చేయడానికి ప్రయత్నిస్తాడు. అంటే... మీ కుండలినీ శక్తిని జాగృతపరచి... సర్వవ్యాపితమైన శక్తితో విమ్మల్ని అనుసంధానం చేసే సామర్థ్యం గురువుకు ఉండాలి. తమలోని గురుతత్త్వం లేనివారు కూడా ఇతరులకు గురువులు కావాలనుకుటారు. స్వయం గురువుగా వ్యక్తమైన వారు ఇతరులకు గురువు కావాలని ఎన్నడూ కోరుకోరు. మిమ్మల్ని మీరు గమనించుకోండి. ఉన్నతమైన స్థితికి చేరుకోవడానికి ప్రయత్నించండి. మీ ఆత్మ సాక్షాత్కారం పొందండి. అప్పుడే మీరు గురువు కాగలుగుతారు. అదే స్వయంగురుతత్త్వం.

'గురుః స్సాక్షాత్ పరబ్రహ్మ' అన్నారు పెద్దలు. పరబ్రహ్మ అంటే ఆదిశక్తి తాలూకు శక్తి. మీరు ఆత్మసాక్షాత్కారం పొందిన తరువాత... ఆ శక్తే మీలో ప్రవహిస్తుంది. అప్పుడు మీరు పరబ్రహ్మకు సాధనంగా మారుతారు. మీలో స్వయం గురుతత్త్వ స్థితిని పెంపొందించుకుంటారు. గురువుకు ఉండాల్సిన ఉత్తమ గుణాలు ఎన్నో ఉన్నాయి.. ఆ గుణాలకు యజమాని శివుడు. శివతత్త్వం అంటే గురుతత్త్వమే. ఆ గుణాలన్నీ మీలో ప్రస్ఫుటమవాలి. ప్రకాశించాలి. అప్పుడు మీరు విరాట్‌శక్తిలో భాగమవుతారు. ఇతరులకు ధర్మాన్ని బోధించగలుగుతారు. "కొందరు తమను గురువులుగా, పీఠాధిపతులుగా, ధర్మాధికారులుగా చిత్రించుకుంటూ... ధనవంతులను, అధికారులను శిష్యులుగా చేసుకుంటున్నారు. ప్రసార సాధనాల ద్వారా పేరు తెచ్చుకొని, సత్యాన్వేషకులను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఒక తల్లిగా మీకు నచ్చజెబుతున్నాను.... అటువంటి వారి వద్దకు వెళ్ళి మీ వినాశనాన్ని మీరే కొని తెచ్చుకోకండి. మీ ఆత్మను మీరే నాశనం చేసుకోకండి" అని శ్రీమాతాజీ నిర్మలాదేవి తన ప్రవచనాలలో స్పష్టంగా తెలియజేశారు.

"కుండలినీ జాగృతితో ఆత్మసాక్షాత్కారం పొంది సహజ యోగ సాధన చేయగలిగితే... మీలో స్వయంగురుతత్త్వం పెంపొందుతుంది. ఆధ్యాత్మిక గురువుగా మీరు నిజాయితీగా ఉండాలి, సత్యాన్ని ధైర్యంగా ప్రకటించగలగాలి, నైతిక జీవనాన్ని కొనసాగించాలి. ప్రేమతో, మర్యాదతో, హుందాగా ఉండాలి. అన్ని వైషమ్యాలను, జాతి, వర్ణ బేధాలనూ విడనాడాలి. ధర్మాతీతులుగా, సంకుచిత మనస్తత్వం ఉండకూడదు. సర్వమతాల సారాన్ని గ్రహించాలి, గౌరవించాలి. ప్రజలను మీవైపు ఆకర్షించే శక్తిని కలిగి ఉండాలి. బంధరాహిత్యాన్ని కలిగి ఉండాలి. బంధరాహిత్యం అంటే నిర్మలత్వం, అదే అమాయకత్వం. దాని వెలుగులో అపరిశుద్ధమైనదేదీ మీకు కనబడదు. మీ శరీరాన్ని, కోరికలను అదుపులో ఉంచుకోవాలి. బద్ధకస్తులు, త్యాగానికి ఇష్టపడనివారు ఎన్నడూ గురువు కాలేరు. గురువుగా నిత్యజీవితంలో అనేక విషయాలకు అతీతంగా ఉండగలగాలి. మిమ్మల్ని వ్యతిరేకించేవారితో వాదించనక్కర్లేదు. గురువు అణకువ కలిగి, మృదువుగా వ్యవహరించాలి. దేన్నీ ఆశించకూడదు. గురువుకు జిహ్వ చాపల్యం ఉండకూడదు. ఎప్పుడు కోపం ప్రదర్శించాలో, ఎప్పుడు శాంతంగా ఉండాలో, ఎప్పుడు ఏది మాట్లాడాలో, ఎంతవరకూ మాట్లాడాలో తెలిసి ఉండాలి. చాలా మంది గురువులు మౌనం పాటించడం వల్ల శక్తిమంతులయ్యారు" అంటూ గురువుకు ఉండాల్సిన లక్షణాలను వివిధ సందర్భాల్లో మాతాజీ వివరించారు.



డాక్టర్ పి. రాకేష్ (8988982200)
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

ఆ గురువును గుర్తించండి

'చంద్రమా మానసో జాతః'... మనస్సు చంద్రుడితో సంబంధం కలిగి ఉంటుంది. గురుపూర్ణిమ నాటి చంద్రుడు పూర్ణత్వానికి చిహ్నం. అందుకే ఆ పూర్ణత్వాన్ని ఒకసారి పరికించడానికి, మనలోకి మనం తొంగి చూసుకోవడానికి, జీవితాన్ని ఒకసారి అవలోకించడానికి గురుపూర్ణిమ మంచి తరుణం.

ఎవరికైనా జీవితాన్ని మించిన గురువు మరెవరు? ప్రతి ఒక్కరికీ జీవితం అనేక పాఠాలు నేర్పుతుంది. జీవితం వేరు, గురువు వేరు కాదు. అవి రెండూ విడదీయలేనివి. జీవితంలోకి చూసుకోలేనప్పుడు గురుతత్త్వాన్ని అనుభవించలేం. మనం తరచూ కళ్ళు మూసుకొని, మన కోరికల గుర్రాల మీద స్వారీ చేస్తూ ఉంటాం. జీవితం మనకు అందించే జ్ఞానాన్ని అగౌరవ పరుస్తూ ఉంటాం. జ్ఞానాన్ని గౌరవించడం అంటే జీవితాన్ని గౌరవించడమే. మన సొంత జీవితాన్ని తరచి చూడడానికీ, అది ఇచ్చిన జ్ఞానాన్ని గుర్తించడానికి గురుపూర్ణిమ మంచి రోజు.

గురుపూర్ణిమ నాడు గుర్తుంచుకోవాల్సిన మరో విషయం... జీవితం ఇచ్చిన బహుమతులను ఉపయోగించుకోవడం. మీలో ప్రతి ఒక్కరూ జీవితంలో చాలా ఆశీర్వాదాలు, బహుమతులు



ఆర్ట్ ఆఫ్ లివింగ్

పొందారు. వాటిని సద్వినియోగం చేసుకోండి. తద్వారా మరిన్ని బహుమతులు లభిస్తాయి. ఇచ్చేవాడు (భగవంతుడు) ఎలాంటి గుర్తింపునూ కోరుకోకుండా, అవిశ్రాంతంగా ఇస్తూనే ఉన్నాడనీ, అదంతా మీ ప్రతిభే అని మీరు అనుకునేలా మరీ ఇస్తున్నాడనీ, మీరే స్వయంగా సంపాదించుకున్నారని అనుకొనేలా ఇస్తున్నాడనీ గుర్తించండి. నిజానికి ఏదీ మీది కాదు. కానీ మీరు తీసుకున్నట్టు కూడా అనిపించని విధంగా అవన్నీ మీకు ఇస్తున్నాడు. ఇలా జీవితం ఇచ్చిన, ఇస్తున్న బహుమతులను సద్వినియోగం చేసుకోండి. అంటే... సమాజ, ప్రపంచ శ్రేయస్సుకోసం, ఇతరులలో దైవిక గుణాలను ప్రేరేపించడం కోసం వాటిని ఉపయోగించండి. మీకు మంచి వాగ్ధాటి ఉంటే... మీ మాటలతో పదిమందికి ఉత్తేజం కలిగించండి. సాంత్వన పొందేలా చూడండి. అంతేకాని ఇతరులను నిందించడానికి, చెడు మాట్లాడేందుకు మీ మాటలు వృథా చేయకండి. మీకు అద్భుతమైన మేధస్సు లభించింది. దాన్ని మానవాళి మేలు కోసం మరింత ఉత్తమంగా ఉపయోగించండి. మీకు మంచి కంఠ స్వరం ఉంటే... దాన్ని సద్వినియోగపరచుకోండి. శారీరక బలం ఉంటే సేవ చెయ్యండి. ప్రపంచానికి సేవ చేయడం అంటే పరమాత్మను ఆరాధించడమే. జ్ఞానాన్ని గౌరవించడం ద్వారా మీ జీవితంతో పాటు మీ చుట్టూ ఉన్న అనేక జీవితాలు మెరుగుపడతాయి. ఉన్నత స్థితికి ఎదుగుతాయి.


జీవితంలో అనుసరించవలసిన మరో అందమైన లక్షణం... ఆర్భాటం లేకుండా ధర్మాన్ని పాటించడం. మీకు ఎవరైనా బహుమతి ఇచ్చారని అనుకుందాం. ఆ తరువాత వాళ్ళు దాని గురించి పదేపదే మీకు గుర్తు చేస్తూ ఉంటే ఎలా ఉంటుంది? చికాకుగా అనిపిస్తుంది కదా! మీరు పాటించే ధర్మం గురించి ప్రచారం చేసుకోవడం, పదేపదే చెప్పుకోవడం కూడా అలాంటిదే.

ప్రతి ఒక్కరిలోనూ ఒక గురువు ఉన్నాడు. మీ జ్ఞాన జ్యోతిని వెలిగించండి, మీలోని ఆ గురువుకు హారతి ఇవ్వండి. ఇంతకూ హారతి అంటే ఏమిటి? జ్ఞానంలో, ఆనంద పారవశ్యంలో లీనం కావడాన్నీ, కరిగిపోవడాన్నీ అది సూచిస్తుంది. ఏది సత్యం? ఏది మిథ్య? ఏది సరైనది? ఏది సరైనది కాదు? ఈ ప్రశ్నలు వేరే ఎవ్వరినీ అడగవలసిన అవసరం లేదు. మీలో ఉన్న గురుతత్త్వమే ఇది సరైనదనీ, ఇది తప్పు అనీ చెబుతుంది. ఆ గురుతత్త్వాన్ని తప్పకుండా గౌరవించాలి.

గురుపూర్ణిమ... సాధకులకు పండగ రోజు. ఈ రోజున వారు తమ ప్రయాణాన్ని అవలోకించుకొని, సాధించినదాన్ని, సాధించాల్సిన లక్ష్యాన్నీ గురువుకు సమర్పణ చేస్తారు. కృతజ్ఞతా భావంతో ఉత్సవం చేసుకుంటారు. అందుకే గురుపూర్ణిమ జీవన ప్రయాణాన్ని సమీక్షించుకొనే రోజు, సరిదిద్దుకొనే రోజు. తాము జీవితంలో ఎంత దూరం ప్రయాణించాం, ఏయే అనుభవాలు పొందాం, ఏ జ్ఞానాన్ని సంపాదించాం, ఎన్ని ఆటంకాలను అధిగమించాం, అంతిమంగా ప్రయాణం ఎటువైపు సాగుతోంది? అనే అంశాలను సమీక్షించుకొనే రోజు. మళ్ళీ సేవకు, సత్సంగానికీ, ఆధ్యాత్మిక సాధనకు తమను తాము పునరంకితం చేసుకొనే రోజు.

● గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్

విశేషం



శ్రీ టీకారాయలు

కర్ణాటకలో సాదినాడు అనే రాజ్యానికి యువరాజు దోండు రఘునాథ రాయలు. అతను ఒక రోజు తన అనుయాయులతో వేటకు బయలుదేరాడు. మిట్టమధ్యాహ్నం అయింది. అతనికి, అతని గుర్రానికి బాగా దాహం వేస్తోంది. కొంతదూరంలో భీమానది కనిపించింది. గుర్రాన్ని నేరుగా నదిలోకి నడిపించాడు. గుర్రం మీద నుంచి దిగకుండా, కిందికి వంగి... నదీ ప్రవాహానికి నోరు తాకించి, నీరు తాగడం మొదలుపెట్టాడు.

శ్రీమధ్వాచార్యుల ప్రత్యక్ష శిష్యులలో ఒకరైన శ్రీ అక్షోభ్య తీర్థులు ఇదంతా నది ఒడ్డునుంచి గమనిస్తున్నారు. అంతకుముందు రోజు తనకు కలలో వెల్లడయిన సూచన మేరకు... ఆయన ఆ నదీతీరానికి వచ్చారు. తమ మఠానికి తదుపరి అధికారి కావలసిన మహానుభావుడి కోసం నిరీక్షిస్తున్నారు. 'భీమా నదిలో అశ్వారూఢుడై వంగి... నీటిని తాగే విచిత్ర వ్యక్తే మీ ఉత్తరాధికారి' అనేది ఆయనకు కలలో వచ్చిన సూచన. ఆ దృశ్యాన్ని ప్రత్యక్షంగా చూడగానే... "కిం పశుః పూర్వదేహే?" (నీవు కిందటి జన్మలో పశువువా?) అనే మాటలు ఆయన నోట వెలువడ్డాయి. ఆ మాటలు వినగానే రఘునాథ రాయలుకు గత జన్మ జ్ఞానం కలిగింది.

వాయుదేవుడి అవతారమైన శ్రీమధ్వాచార్యులు ఒక రోజు నిరుపమానమైన, రుద్రాది దేవతలకు కూడా ఆశ్చర్యం కలిగించే వాక్ ప్రవాహంతో... తను రాసిన భాష్యాలను శిష్యులకు వివరిస్తున్నారు. రోజూ ఆయన గ్రంథాలను మోసుకొని తీసుకొచ్చే ఎద్దు కూడా దూరంగా ఒక మూల కూర్చొని ఉంది. అప్పుడు ఆ శిష్యులలో కొందరు "స్వామీ! తమ అద్భుత గ్రంథాల అపురూప వివరణను మీరే స్వయంగా చెబుతున్నారు కాబట్టి మాకు చక్కగా అర్థమవుతోంది. కానీ వాటికి టీకా తాత్పర్యాలు రాసి... మాకు, లోకానికి తెలియజేసే భాగ్యశాలి ఎవరు?" అని ప్రశ్నించారు. ఆ పని ఆ వృషభం చేస్తుందని ఆయన సమాధానం ఇచ్చారు. అందరూ ఆశ్చర్యపోయారు. అది గ్రంథాలను మోసే ఎద్దు అనీ, రోజూ తమతో పాటే పాఠాలు వింటోందనీ వారికి తెలుసు కానీ, అది స్వర్గాధిపతి అయిన దేవేంద్ర స్వరూపమని తెలియదు.

గురువు మాటలు విన్న తరువాత... కొందరు శిష్యులు మాత్సర్యానికి గురయ్యారు. పాముకాటుకు గురై ఆ ఎద్దు మరణించాలని శపించారు. ఆ ప్రకారం ఒక పాము వచ్చి కాటు వేయడంతో... ఎద్దు మరణించింది సర్వజ్ఞుడైన శ్రీమధ్వాచార్యులు... తాను రచించిన 'ద్వాదశ స్తోత్రా'న్ని పఠిస్తూ... కమండలంలోని మంత్రజలాన్ని ఆ ఎద్దుమీద సంప్రోక్షణ చేయగానే.. అది మళ్ళీ బతికింది. గత జన్మలో తాను వృషభమై... కన్నుల పండువగా చూసిన శ్రీమధ్వాచార్యుల విశ్వమనోహరమైన ఆకృతి, అసమానమైన ఆయన శాస్త్ర గ్రంథాల ప్రవచనం, తన వీపు మీద వాటిని మోసుకొని తిరిగి జీవితాన్ని సార్థకం చేసుకోవడం... ఇలా ఎన్నో దృశ్యాలు రఘునాథ నాయకుల కళ్ళ ముందు కదిలాయి. ఆయన మనస్సును ఆవరించి ఉన్న అజ్ఞానపు తెర తొలగిపోయింది.

తన రాజ్యం, హోదా, ఇద్దరు భార్యలు, అపారమైన సంపద... అవన్నీ తృణప్రాయమనే సత్యం రఘునాథ నాయకుడి ముందు నిలిచింది. అతను అక్షోభ్యతీర్థుల దగ్గరకు పరుగున వచ్చాడు. తన తలను భక్తిగా ఆయన పాదాలకు తాకించాడు. "నన్ను మీ శిష్యుడిగా స్వీకరించండి. శ్రీమధ్వ శాస్త్రాన్ని ఉపదేశించి నన్ను పునీతుణ్ణి చెయ్యండి" అని వేడుకున్నాడు. అక్షోభ్యతీర్థులు అతణ్ణి సంతోషంగా పైకి లేపి "నీకు మధ్వశాస్త్ర ఉపదేశం కాదు, మధ్వాచార్యుల వేదాంత సామ్రాజ్యానికి అధిపతిగా పట్టాభిషిక్తుణ్ణి చేస్తాను. సన్యాసి కావడానికి సిద్ధంగా ఉండు" అన్నారు. "నాకు శాస్త్ర జ్ఞానం చాలు. అంతటి ఉన్నత పదవికి నేను అర్హుణ్ణి కాను" అన్నాడు రఘునాథరాయలు. "ఇది దైవ సంకల్పం. నువ్వు అంగీకరించాలి" అని చెప్పారు అక్షోభ్యతీర్థులు. "అది దైవ సంకల్పమైతే నాకూ సమ్మతమే. కానీ దాన్ని నేను ఎలా తెలుసుకోగలను?" అని ప్రశ్నించాడు రఘునాథుడు. "నీవు ఈ రోజంతా నాతోనే ఉండు. నాకు సూచన చేసిన దేవుడు... నీకు కూడా సూచన చేస్తాడు" అని బదులిచ్చారు అక్షోభ్యతీర్థులు,

ఆ రోజు రాత్రి రఘునాథ రాయలుకు కలలో శ్రీ వాయుదేవులు కనిపించి "నీవు సన్యాసాన్ని స్వీకరించు. శ్రీరాముణ్ణి పూజించు. విద్యలో అగ్రగణ్యుడవు అవుతావు. సర్వజ్ఞానులూ నిన్ను ఆశ్రయిస్తారు" అని నిర్దేశించారు. మరుసటిరోజే రఘునాథ రాయలు సన్యాస దీక్షను స్వీకరించాడు. ఆనాటి నుంచి 'జయతీర్థులు' అనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు.

అధికార పీఠాన్ని ఏలవలసిన తన కుమారుడు వేదాంత పీఠాన్ని అధిరోహించాడని తెలుసుకున్న రఘునాథ రాయల తండ్రి నరసింహరాయలు కోపంతో ఊగిపోయాడు. అక్షోభ్యతీర్థులును దారుణంగా దూషించాడు. అయితే దైవలీల ముందే తెలిసిన గురువు సంయమనాన్ని పాటిస్తూ "మీరు మీ కుమారుడితో మాట్లాడండి. కావాలంటే వెనక్కి తీసుకుపోవచ్చు" అని చెప్పారు. నరసింహరాయలు తన కుమారుణ్ణి ఇంటికి తీసుకువెళ్ళాడు. అతని బుద్ధిని మార్చడం కోసం... శయ్యాగృహాన్ని అలంకరించి... కోడలిని లోపలకు పంపాడు. అయితే మంచం మీద తన కుమారుడి స్థానంలో బుసలు కొడుతున్న భయంకరమైన సర్పం... జగత్తునే తనలో లీనం చేసుకొనే తేజోరాశి ప్రత్యక్షమయింది. తన కుమారుడు కేవలం తన వంశోద్ధారకుడు కాదు, లోకోద్ధారకుడు, అతను పుట్టినది సంసార బంధాల కోసం కాదు, తనలాంటి ఎందరినో సంసార సాగరాన్ని దాటించడానికి అని నరసింహరాయలుకు అర్థమయింది. తక్షణమే తన కుమారుణ్ణి అక్షోభ్యతీర్థులుకు అప్పగించాడు. తన అజ్ఞానాన్ని క్షమించాలని పశ్చాత్తాపంతో వేడుకున్నాడు. "దైవానుగ్రహం వల్ల మీకు మరొక కుమారుడు జన్మిస్తాడు" అని గురుశిష్యులిద్దరూ నరసింహరాయలుకు అభయం ఇచ్చారు.

పూర్వ జన్మలో శ్రీమధ్వాచార్యుల నుంచి విన్న శాస్త్రాన్నే... ఈ జన్మలో గురువైన అక్షోభ్యతీర్థులు ద్వారా శ్రీ జయతీర్థులు మరోసారి విన్నారు. "శ్రీ మధ్వాచార్యుల రచనలు శబ్దంలో వామన రూపంలో, అర్థాల పరంగా త్రివిక్రమ స్వరూపంలో ఉంటాయి. వారి భాష్యాలకు టీకా రాయడానికే నీ అవతారం" అని అక్షోభ్యతీర్థులు ఆయనను ఆదేశించారు. శ్రీమధ్వాచార్యుల బ్రహ్మసూత్ర భాష్యానికి 'తత్త్వ ప్రకాశిక', అణు వ్యాఖ్యానానికి 'న్యాయ సుధ' అనే టీకాలను శ్రీజయతీర్థులవారు రచించారు. వీటిలో 'న్యాయ సుధ మేరు శిఖరం లాంటిది. అలాగే మాధ్వాచార్యుల గీతాభాష్యం, ఋగ్భాష్యం, ఉపనిషత్ భాష్యాలతో పాటు ఆచార్యుల పద్దెనిమిది గ్రంథాలకు సైతం టీకా రచన చేసి మధ్వపరంపరలో టీకారాయలుగా శ్రీ జయతీర్థులు' ప్రసిద్ధి చెందారు. పలు స్వతంత్ర గ్రంథాలను కూడా ఆయన రచించారు. ఆయన రచనా పటిమనూ, గొప్పతనాన్నీ ఎందరో మహనీయులు కొనియాడారు. "శ్రీ జయతీర్థుల గ్రంథాలను అధ్యయనం చేయడం మోక్షదాయకం. కానీ అందరికీ అది సాధ్యం కాకపోవచ్చు. కనీసం ఆయన పేరును స్మరిస్తే చాలు... 'జ' అంటే జయశీలులం అవుతాం, 'య' అంటే యముడు (రోగాలు, అపమృత్యువు) భయపడతాయి. 'తీ' అంటే తిమిర పాతకాలు నశిస్తాయి. 'థ' అంటే తాపత్రయం పరిహారమవుతుంది" అంటారు దాసవరేణ్యులైన విజయదాసులు. ఈనెల 24 నుంచి 26 వరకూ శ్రీజయతీర్థుల ఆరాధనోత్సవాలు దేశమంతటా... అన్ని మధ్వ మఠాలలో జరుగుతాయి. యోగులలో రాజు, కర్ణాటకలోని మలఖేడ్‌లో కొలువైన శ్రీజయతీర్థులను ఆ పుణ్య దినాలలో స్మరించుకొని పునీతులం అవుదాం.

● మధ్వ ప్రచార పరిషత్, (9440258841)

దిక్సూచి DIKSUCHI

జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరోతరగతి ప్రవేశాలు



నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్)- దేశ వ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 'జవహర్ నవోదయ విద్యాలయ సెలెక్షన్ టెస్ట్(జేఎన్‌వీఎస్‌టీ) 2025' ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఇవి కో-ఎడ్యుకేషనల్ రెసిడెన్షియల్ స్కూళ్లు. బాల బాలికలకు విడివిడిగా హాస్టల్స్ ఉంటాయి. భోజన, వసతి సౌకర్యాలతో పాటు పన్నెండో తరగతి వరకు బోధన ఉచితం. యూనిఫాం, పాఠ్య పుస్తకాలు కూడా ఇస్తారు.

అర్హత: ప్రస్తుతం ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో అయిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్ఐఓఎస్ నుంచి 2024 సెప్టెంబరు 15 నాటికి 'బి' సర్టిఫికెట్ కాంపిటెన్సీ కోర్సు పూర్తిచేసేవారు కూడా అర్హులే. విద్యార్థులు 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి.

జేఎన్‌వీ సెలెక్షన్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం 2 గంటలు. మొత్తం మార్కులు 100. ఈ పరీక్షలో మూడు సెక్షన్లు ఉంటాయి. వీటిలో మొత్తం 80 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌లో 40 ప్రశ్నలు అడుగుతారు. దీనికి 50 మార్కులు కేటాయించారు. అర్థమెటిక్ టెస్ట్, లాంగ్వేజ్ టెస్ట్‌ల్లో ఒక్కోదానిలో 20 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో దానికి 25 మార్కులు ఉంటాయి. నెగెటివ్ మార్కులు లేవు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌కు గంట; మిగిలినవాటికి ఒక్కోదానికి అర్ధ గంట పరీక్ష సమయం ఇస్తారు. విద్యార్థులు బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద సమాధానాలు గుర్తించాలి. తెలుగు రాష్ట్రాల్లో ఈ పరీక్షని తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మరాఠీ, ఉర్దూ, ఒరియా, కన్నడ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **జేఎన్‌వీ సెలెక్షన్ టెస్ట్ తేదీలు:** 2025 జనవరి 18, ఏప్రిల్ 12
- **వెబ్‌సైట్:** www.navodaya.gov.in


సీఈసీఆర్ఐలో బీటెక్

కరైకుడి(తమిళనాడు)లోని సెంట్రల్ ఎలక్ట్రోకెమికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎస్ఐఆర్-సీఈసీఆర్ఐ)-బీటెక్ (కెమికల్ అండ్ ఎలక్ట్రోకెమికల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో అదర్ స్టేట్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. జేఈఈ మెయిన్ 2024 ఆలిండియా ర్యాంక్ ఆధారంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 6
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** ఆగస్టు 9
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్:** ఆగస్టు 21
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 23
- **వెబ్‌సైట్:** cecri.res.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/UBoUKBQలో చదవండి.

ఐఐఎఫ్‌టీలో ఆన్‌లైన్ పీజీ డిప్లొమా



ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- ఎగ్జిక్యూటివ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(ఈపీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది 15 నెలల వ్యవధి గల వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో మూడు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లు పూర్తయిన తరవాత ప్రోగ్రామ్‌లో బ్రేక్ తీసుకోవచ్చు. గరిష్ఠంగా మూడేళ్లలో ప్రోగ్రామ్‌ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌ని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. వారాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు వరకు సెషన్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా పోర్ట్ విజిట్, ఇండస్ట్రీ విజిట్, రీసెర్చ్ ప్రాజెక్ట్, అసైన్‌మెంట్స్ ఉంటాయి. సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం అయిదేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

మ్యాట్ నోటిఫికేషన్

ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ)-మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్) 2024 ఆగస్టు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా దేశంలోని ప్రముఖ బిజినెస్ స్కూళ్లు అందిస్తున్న మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

మ్యాట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో అయిదు సెక్షన్‌లు ఉంటాయి. సెక్షన్‌కు 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 150 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

ఐబీటీ షెడ్యూల్: ఆగస్టు 14న ఎగ్జామ్ రాయాలనుకొనేవారు ఆగస్టు 9లోపు, ఆగస్టు 23న పరీక్ష రాయాలంటే ఆగస్టు 18లోపు దరఖాస్తు చేసుకోవాలి.

సీబీటీ షెడ్యూల్: చివరి తేదీ: ఆగస్టు 11
- **సీబీటీ టెస్ట్ తేదీ:** ఆగస్టు 18

పీబీటీ షెడ్యూల్: చివరి తేదీ: ఆగస్టు 18
- **పీబీటీ టెస్ట్ తేదీ:** ఆగస్టు 25
- **వెబ్‌సైట్:** mat.aima.in

పంచకర్మ టెక్నీషియన్ కోర్సు

భారత ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్(సీసీఆర్ఏఎస్)- పంచకర్మ టెక్నీషియన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ రెగ్యులర్ నాన్ రెసిడెన్షియల్ కోర్సు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రెయినింగ్ పూర్తయ్యేనాటికి అభ్యర్థులకు 18 ఏళ్లు నిండాలి.

- **రిజిస్టర్డ్/స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 31
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** అక్టోబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.ccras.nic.in

మరో రికార్డును సాధించిన కల్కి



విడుదలైన మొదటి రోజు నుంచే హిట్ టాక్ తెచ్చుకుని వరుస రికార్డులు సృష్టిస్తోంది 'కల్కి 2898 ఏ.డీ' సినిమా. ఇటీవలే రూ.1000 కోట్లు సాధించిన ఏడవ ఇండియన్ సినిమాగా.. రెండవ ప్రభాస్ సినిమాగా నిలిచింది. ఈ రికార్డుల వేటలో భాగంగా ఈ సినిమా మరో అరుదైన ఘనతను సాధించింది. టికెట్ బుక్కింగ్స్ అప్లికేషన్ 'బుక్ మై షో'లో అత్యధిక టికెట్స్ బుక్ అయిన సినిమాగా ఖ్యాతి గడించింది. 12.15 మిలియన్స్ (దాదాపు రూ.1 కోటి 25 లక్షలు) టికెట్స్ బుక్ అయిన ఈ సినిమా అంతకుముందు 'జవాన్' సినిమా పేరిట ఉన్న రికార్డును తిరగరాసింది. 'జవాన్' 12.01 (దాదాపు రూ.1 కోటి 20 లక్షలు) మిలియన్స్ టికెట్ బుకింగ్స్‌తో ప్రస్తుతం రెండో స్థానంలో ఉంది. కాగా, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పాన్ ఇండియన్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్‌లో ప్రభాస్ 'భైరవ' పాత్రలో.. అమితాబ్ బచ్చన్ పురాణ యోధుడు 'అశ్వత్థామ'గా..కమల్ హాసన్, దీపికా పదుకొనే, రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్రల్లో అలరించారు. ఈ సినిమాకు కొనసాగింపుగా పార్ట్-2 తెరకెక్కనుందని చిత్ర బృందం ప్రకటించిన సంగతి తెలిసిందే.

నిన్ను కన్న కనులే




తమిళ చిత్రకథానాయకుడు విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'ది గోట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలయ్యాయి. సినిమాలోని రెండో పాట 'నిన్ను కన్న కనులే'ను గురువారం విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ ఫ్యామిలీ సాంగ్‌ను యువన్ శంకర్‌రాజా, ఎస్పీ చరణ్, చిత్ర పాడారు. విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, ప్రభుదేవా, మోహన్, జయరామ్, స్నేహ, లైలా, మీనాక్షి చౌదరి తదితరులు ఇతర ముఖ్య తారాగణం. కల్పాతి ఎస్ అఘోరమ్, కల్పాతి ఎస్.గణేశ్, ఎస్.సురేశ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది. వెంకట్ ప్రభు దర్శకుడు.



ఘట్టమనేని వంశం నుంచి మరో హీరో

హీరో కృష్ణ మనవడు, నటుడు, నిర్మాత రమేశ్‌బాబు తనయుడు జయకృష్ణ హీరోగా అరంగేట్రం చేస్తున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా గురువారం పద్మాలయా సంస్థ కార్యాలయంలో అభిమానుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో జయకృష్ణ కేక్ కట్ చేశారు. దివంగత రమేశ్‌బాబు సతీమణి, జయకృష్ణ తల్లి మృదుల ఈ సందర్భంగా మాట్లాడుతూ 'బాబు కోసం కొన్ని కథలు విన్నాం. అందరం కలసి ఓ కథను ఎంపిక చేస్తాం. మంచి బేనర్ ద్వారా చక్కని సినిమాతో జయకృష్ణ త్వరలోనే మీ ముందుకు వస్తాడు' అని చెప్పారు. అభిమానులందరికీ జయకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతున్న జాన్వీ కపూర్



బాలీవుడ్ నటి జాన్వీకపూర్ ఇటీవలే 'మిస్టర్ అండ్ మిసెస్ మహీ' చిత్రంతో ప్రేక్షకులను అలరించారు. ఓ పక్క వరుస బాలీవుడ్ చిత్రాల్లో నటిస్తూనే.. టాలీవుడ్‌లోనూ ఎన్టీఆర్, రామ్‌చరణ్, నాని సినిమాల్లో కథానాయిక పాత్రను పోషిస్తున్నారీ బ్యూటీ. తాజాగా, ఆమె అనారోగ్యానికి గురయ్యారు. ఫుడ్ పాయిజనింగ్ వల్ల తీవ్ర అనారోగ్యానికి గురైన ఆమెను ముంబైలోని హాస్పిటల్‌లో చేర్చారు. జాన్వీ ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారని.. తన కూతురి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు ఆమె తండ్రి బోనీ కపూర్ వెల్లడించారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడ్డాక ఆమెను హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేస్తారని ఆయన చెప్పారు. ప్రస్తుతం జాన్వీ కపూర్ 'ఉలఝ్' అనే చిత్రంలో నటించారు. ఇందులో ఆమె పోషించే పాత్ర పేరు సుహాన భాటియా. దేశంలో అతి పిన్న వయసులోనే డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఎదిగిన సుహాన భాటియా విజయ ప్రస్థానమే ఈ సినిమా కథాంశం. సినిమా ఆగస్టు 2న విడుదలవుతోంది.

దీపావళికి రాకీ రాక



విష్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంతో రవి తేజ ముళ్లపూడి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో విష్వక్ సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీని మేకర్స్ ఖరారు చేశారు. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న 'మెకానిక్ రాకీ' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో విష్వక్‌సేన్ గన్, రెంచ్ పట్టుకొని గంభీరమైన లుక్‌లో కనిపించారు. వైవా హర్ష, హర్షవర్ధన్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: సత్యం రాజేశ్, విద్యాసాగర్ జె, సినిమాటోగ్రఫీ: మనోజ్ కటసాని, ఎడిటర్: అన్వర్ అలీ

వారం రోజుల ముందుగానే..



రక్షిత్ అట్లూరి హీరోగా నటించిన తాజా చిత్రం 'ఆపరేషన్ రావణ్'. న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు వెంకట్ సత్య రూపొందించారు. తెలుగు, తమిళ భాషల్లో తయారైన ఈ సినిమాలో సంగీర్తన కథానాయిక. ముందు అనుకున్నట్లు కాకుండా వారం రోజుల ముందుగానే అంటే ఈ నెల 26న సినిమాను విడుదల చేస్తున్నట్లు చిత్ర నిర్మాత ధ్యాన్ అట్లూరి చెప్పారు. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చిందని ఆయన తెలిపారు. రాధిక శరత్‌కుమార్ ఓ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో చరణ్‌రాజ్, విద్యాసాగర్, రాకెట్ రాఘవ, రఘు కుంచె ఇతర ముఖ్య తారాగణం.

కశ్మీర్ నేపథ్యంలో...



శివ కార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'అమరన్'. కమల్‌హాసన్ తన సొంత బేనర్ రాజ్‌కమల్ ఇంటర్నేషనల్ ఫిల్మ్స్‌పై సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్‌తో కలసి నిర్మిస్తున్నారు. సాయిపల్లవి కథానాయిక. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న 'అమరన్' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ బుధవారం ప్రకటించారు. ప్రముఖ జర్నలిస్ట్, రచయిత శివ్ అరూర్ రచించిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్' పుస్తకంలోని 'మేజర్ వరదరాజన్' జీవిత గాథ ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. కశ్మీర్ నేపథ్యంలో యాక్షన్ ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో సరికొత్త పాత్రలో శివకార్తికేయన్ కనిపించనున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సీహెచ్ సాయి.

ట్రోలర్స్‌పై డీజీపీకి 'మా' ఫిర్యాదు

సోషల్ మీడియా వేదికల ద్వారా సినిమా తారలపై జరుగుతున్న ట్రోలింగ్‌పై 'మా' (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) చర్యలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో భాగంగా 'మా' సభ్యులైన శివ బాలాజీ, రాజీవ్ కనకాల, శివకృష్ణ తెలంగాణ డీజీపీ జితేందర్‌ను కలసి వినతి పత్రం అందించారు. అందులో ఈ ట్రోలింగ్స్‌కు పాల్పడుతున్న 250 యూట్యూబ్ చానళ్లపై చర్యలు తీసుకోవాలని 'మా' సభ్యులు డీజీపీని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన డీజీపీ.. సైబర్ సెక్యూరిటీ సహకారంతో ఈ అంశంపై చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని.. అందులో ఇటువంటి ట్రోలర్స్‌పై నిఘా పెడతామని 'మా' సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 'మా' సభ్యులు మాట్లాడుతూ "ఈ ట్రోలింగ్స్ హద్దులు దాటిపోయాయి. వీటి వల్ల చాలా మంది నటీనటులు ఇబ్బంది పడుతున్నారు. 24 గంటల్లోపు ఓ ప్రత్యేక కో ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసి ట్రోలింగ్ చేసే చానళ్లను గుర్తిస్తాం" అని చెప్పారు.

ఇన్ఫీ లాభం రూ.6,368 కోట్లు

2024-25 ఆదాయ అంచనా 3-4 శాతానికి పెంచిన సంస్థ

ఈసారి 20,000 వరకు ఫ్రెషర్ల నియామకాలు

బెంగళూరు: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి (క్యూ1) కంపెనీ ఏకీకృత నికర లాభం రూ.6,368 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి నమోదైన రూ.5,945 కోట్ల లాభంతో పోలిస్తే 7.1 శాతం వృద్ధి నమోదైంది. ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో ఆర్జించిన రూ.7,969 కోట్ల లాభంతో పోలిస్తే మాత్రం 20.1 శాతం క్షీణించింది. కాగా, ఈ క్యూ1లో కంపెనీకి కార్యకలాపాల ద్వారా సమకూరిన ఆదాయం వార్షిక ప్రాతిపదికన 3.6 శాతం వృద్ధితో రూ.39,315 కోట్లకు పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయ వృద్ధి అంచనాను కంపెనీ గతంలో ప్రకటించిన 1-3 శాతం నుంచి 3-4 శాతానికి పెంచింది. నిర్వహణ లాభాల మార్జిన్ అంచనాను మాత్రం యథాతథంగా 20-22 శాతంగా కొనసాగించింది. క్యూ1 నిర్వహణ మార్జిన్ 21.1 శాతంగా నమోదైంది. "బలమైన, విస్తృత స్థాయి వృద్ధి, మెరుగైన నిర్వహణ మార్జిన్, సమృద్ధికరమైన డీల్స్, అత్యధిక నగదు సృష్టితో ఈ ఆర్థిక సంవత్సరానికి అద్భుతమైన ప్రారంభం లభించింది. మా వైవిధ్య సేవలు, క్లయింట్లకు మాపైన అపార నమ్మకం, నిర్విరామ కృషికిదే సాక్ష్య"మని ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండీ సలీల్ పరేఖ్ అన్నారు.



కర్ణాటక ప్రభుత్వ నిర్ణయమేదైనా మద్దతిస్తాం

ఉద్యోగ నియామకాలకు సంబంధించి కర్ణాటక ప్రభుత్వం ఏ నిబంధనలు లేదా మార్గదర్శకాలు ప్రవేశ పెట్టినా మా కంపెనీ అందుకు లోబడి ఉంటుందని ఇన్ఫీ చీఫ్ సలీల్ పరేఖ్ స్పష్టం చేశారు. "రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మేం కార్యకలాపాలు సాగిస్తాం. ప్రభుత్వాలు ఏ నియమ, నిబంధనలు తీసుకొచ్చినా మేం మద్దతిస్తా" మని పేర్కొన్నారు.

మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఇన్ఫోసిస్ 410 కోట్ల డాలర్ల విలువైన భారీ డీల్స్‌ను దక్కించుకుంది. అయితే, మార్కెట్ అంచనా 500 కోట్ల డాలర్ల కంటే తక్కువిది. అంతే కాదు, ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో లభించిన 450 కోట్ల డాలర్ల భారీ డీల్స్‌తో పోల్చినా తగ్గింది.
- ఇన్ఫీ అతిపెద్ద ఆదాయ వనరు అయిన ఆర్థిక సేవల రంగం నుంచి రాబడి ఈ క్యూ1లో 0.3 శాతం తగ్గి 27.5 శాతానికి పరిమితమైంది. రిటైల్ రంగ ఆదాయం వాటా కూడా 3 శాతం తగ్గి 13.8 శాతానికి జారుకుంది
- ఐటీ రంగానికి అతిపెద్ద మార్కెట్ అయిన ఉత్తర అమెరికా నుంచి ఆదాయం 1.2 శాతం తగ్గగా.. యూరప్ మార్కెట్ నుంచి రాబడి 9.1 శాతం పెరిగింది. ఇండియా మార్కెట్ రెవెన్యూ 19.9 శాతం వృద్ధి చెందగా.. మిగతా ప్రాంతాల నుంచి ఆదాయం 2.3 శాతం పెరిగింది.
- ఈ మార్చి త్రైమాసికం చివరి నాటితో పోలిస్తే, గడిచిన మూడు నెలల్లో ఇన్ఫోసిస్ ఉద్యోగుల సంఖ్య నికరంగా 1,908 తగ్గి 3,15,332కు పరిమితమైంది. ఏడాది క్రితం స్థాయితో పోలిస్తే ఉద్యోగులు 6 శాతం తగ్గారు. వరుసగా ఆరు త్రైమాసికాలుగా కంపెనీ ఉద్యోగుల సంఖ్య తగ్గుతూ వస్తోంది.
- ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 12.7 శాతానికి పెరిగింది. మార్చితో ముగిసిన క్వార్టర్‌లో అట్రిషన్ రేటు 12.6 శాతంగా ఉంది.
- ఈ ఆర్థిక సంవత్సరంలో అవసరానుగుణంగా 15,000-20,000 మంది ఫ్రెషర్లను నియమించుకోనున్నట్లు ఇన్ఫోసిస్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ జయేష్ సంఘ్రాజ్కా తెలిపారు.

తోషిబా ట్రాన్స్‌మిషన్ రూ.500 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విద్యుత్ పరికరాల తయారీలోని తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ (టీటీడీఐ) ఉత్పత్తి సామర్థ్యాల విస్తరణపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్ కేంద్రంగా ఉన్న తమ ప్లాంట్‌లో 1,000 కోట్ల జపాన్ యెన్‌లు (సుమారు రూ.500 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్టు ప్రకటించింది. ఉత్పత్తి సామర్థ్యాలను 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే రాబోయే మూడేళ్ల కాలంలో (2024-2026 ఆర్థిక సంవత్సరాల నాటికి) ఒకటిన్నర రెట్లు పెంచనున్నట్టు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో సర్జ్ అరెస్టర్ల తయారీకి కొత్త తయారీ ప్లాంట్ కూడా కంపెనీ ఏర్పాటు చేస్తోంది. ద్వితీయార్థంలో ఈ ప్లాంట్ ఉత్పత్తులు వాణిజ్యపరంగా అందుబాటులోకి వస్తాయని తెలిపింది.

తకేడాతో డాక్టర్ రెడ్డీస్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తకేడా ఫార్మాస్యూటికల్ కంపెనీకి చెందిన వోనోప్రాజాన్ టాబ్లెట్లను వాణిజ్యపరంగా మార్కెటింగ్ చేయడానికి డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. నోటి ద్వారా ఉపయోగించే ఈ యాక్టివ్ పొటాషియం కాంపిటీటివ్ యాసిడ్ బ్లాకర్‌ను (పీసీఏబీ) రిఫ్లక్స్ ఎసోఫజైటిస్ సంబంధిత యాసిడ్ పెప్టిక్ రుగ్మతల చికిత్సలో ఉపయోగిస్తారు. ఈ ఒప్పందం కింద వోనోప్రాజాన్ టాబ్లెట్లను డాక్టర్ రెడ్డీస్ సొంత బ్రాండ్ వోనో పేరు మీద 10 ఎంజీ, 20 ఎంజీ పరిమాణంలో ఉత్పత్తి చేసి మార్కెటింగ్ చేస్తుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,840 ▼	68,600 ▼	99,200 ▼
ముంబై	73,979 ▲	67,765 ▲	91,555 ▼



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

19వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	555
వరంగల్	542	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	115
వరంగల్	110	గుంటూరు	116
కరీంనగర్	110	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	121
కర్నూలు	110	నెల్లూరు	121
విశాఖపట్నం	106	అనంతపురం	115
గోదావరి	115		

తగ్గిన సాగర్ సిమెంట్ నష్టాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి గాను సాగర్ సిమెంట్ నష్టాలు తగ్గాయి. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో కంపెనీ రూ.560.6 కోట్ల కన్సాలిడేటెడ్ రెవెన్యూపై రూ.32.2 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ రెవెన్యూ రూ.539.67 కోట్లుగా ఉండగా నికర నష్టం రూ.42.28 కోట్లుగా ఉంది. సమీక్షా కాలంలో మొత్తం వ్యయాలు రూ.602.75 కోట్ల నుంచి రూ.616.45 కోట్లకు పెరిగాయి. సమీక్షా త్రైమాసిక కాలంలో సార్వత్రిక ఎన్నికలు, ఎండల తీవ్రత కారణంగా అమ్మకాలు తగ్గినప్పటికీ ఆర్థిక ఫలితాలు అంచనాలకు తగ్గట్టుగానే ఉన్నాయని సాగర్ సిమెంట్ జాయింట్ ఎండీ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

విలాస భవనాలు తెగ కొనేస్తున్నారు..!

హైదరాబాద్‌లో 44% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో రూ.4 కోట్లకు పైబడిన విలువ గల విలాసవంతమైన భవనాలకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య కాలంలో దేశంలోని 7 ప్రధాన నగరాల్లో విలాసవంతమైన ఇళ్లకు డిమాండ్ 27 శాతం పెరిగింది. ఈ ఆరు నెలల కాలంలో 8,500 లగ్జరీ ఇళ్లు అమ్ముడుపోయాయని సీబీఆర్‌ఈ తాజా నివేదికలో తెలిపింది. గత ఏడాది ఇదే కాలంలో అమ్ముడుపోయిన లగ్జరీ ఇళ్ల సంఖ్య 6,700గా ఉంది. ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, హైదరాబాద్ నగరాలు లగ్జరీ ఇళ్లకు ప్రముఖ మార్కెట్లుగా మారాయి. ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో 3,300 యూనిట్లు, ముంబైలో 2,500 యూనిట్లు, హైదరాబాద్‌లో 1,300 యూనిట్లు అమ్ముడుపోయాయి. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే హైదరాబాద్ మార్కెట్లో లగ్జరీ ఇళ్ల అమ్మకాలు 44 శాతం పెరిగాయి.

విశాఖ, విజయవాడల్లో భారీగా పెరిగిన ఇళ్ల ధరలు: దేశంలోని 30 అగ్రగామి మార్కెట్లలో నివాస గృహాలకు డిమాండ్ భారీగా పెరిగిన కారణంగా ఇళ్ల ధరలు గత నాలుగేళ్ల కాలంలో 94 శాతం పెరిగాయని రియల్ ఎస్టేట్ డేటా అనలిటిక్ కంపెనీ ప్రాప్ ఈక్విటీ తెలిపింది. 2019-20తో పోల్చితే 2023-24 నాటికి ప్రాజెక్టు సగటు ప్రారంభ ధరను పరిగణనలోకి తీసుకుని ప్రాప్ ఈక్విటీ ఈ నివేదిక తయారుచేసింది. ఈ టాప్ 30 మార్కెట్లలో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం, విజయవాడ, గుంటూరు ఉన్నాయి. ఆ నివేదిక ప్రకారం 24 ద్వితీయ శ్రేణి మార్కెట్లలో ఇళ్ల ధరల్లో రెండంకెల వృద్ధి చోటు చేసుకుంది. వీటిలో కూడా టాప్ 10 మార్కెట్లలో ధరల వృద్ధి 54 శాతం నుంచి 94 శాతం మధ్యన ఉంది. విశాఖలో ఇళ్ల ధర 11 శాతం మేరకు పెరిగింది.



సెన్సెక్స్ @ 81,000

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా నాలుగో రోజూ సరికొత్త శిఖరాలకు ఎగబాకాయి. సెన్సెక్స్ తొలిసారిగా 81,000 మైలురాయిని దాటగా.. నిఫ్టీ 24,800 స్థాయిని అధిగమించింది. ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్‌ఎంసీజీ రంగ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. గురువారం నష్టాల్లో ప్రారంభమైన సెన్సెక్స్.. 326 పాయింట్ల మేర క్షీణించి 80,390 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. మధ్యాహ్నం నుంచి కొనుగోళ్లు పుంజుకోవడంతో సూచీ మళ్లీ లాభాల్లో పయనించి ఏకంగా 81,000 స్థాయిని దాటేసింది. ఒక దశలో 806 పాయింట్ల లాభంతో 81,522.55 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి సెన్సెక్స్ 626.91 పాయింట్ల లాభంతో 81,343.46 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ప్రారంభ నష్టాల నుంచి తేరుకుని ఒక దశలో 224.75 పాయింట్ల వృద్ధితో 24,837.75 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివరికి 187.85 పాయింట్ల లాభంతో 24,800.85 వద్ద జీవితకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి దేశీయ ఐటీ దిగ్గజాలు అంచనాలకు మించిన పనితీరు కనబర్చడంతో పాటు రూపాయి మరింత క్షీణించడంతో ఈ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లు జరిపారని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. కాగా ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.454.32 లక్షల కోట్లకు (5.43 లక్షల కోట్ల డాలర్లు) పరిమితమైంది.

రూ.750 కోట్లతో అరబిందో ఫార్మా షేర్ల బైబ్యాక్

0.88 శాతం వాటా వెనక్కు
ఒక్కో షేరుకు రూ.1,460 చెల్లింపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అరబిందో ఫార్మా రూ.750 కోట్లతో షేర్ల బైబ్యాక్‌ను చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా 0.88 శాతం వాటాకు సమానమైన మొత్తం 51,36,986 షేర్లను వెనక్కు తీసుకోనున్నట్లు తెలిపింది. ఒక్కో షేరును రూ.1,460కి బైబ్యాక్ చేయనున్నట్లు పేర్కొంది. టెండర్ ఆఫర్ రూట్ ద్వారా చేపట్టనున్న ఈ బైబ్యాక్‌కు రూ.750 కోట్ల వరకు వెచ్చించనున్నట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది. ఇందుకు జూలై 30వ తేదీని రికార్డు తేదీగా నిర్ణయించినట్లు తెలిపింది. జూన్ త్రైమాసికం ముగిసేనాటికి కంపెనీలో ప్రమోటర్లకు 51.8 శాతం వాటా ఉండగా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్‌ఐఐ)కు 16.73 శాతం, మ్యూచువల్ ఫండ్స్‌కు 19.17 శాతం వాటాలున్నాయి. కాగా కంపెనీ షేర్ల బైబ్యాక్‌ను చేపట్టడం ఇదే తొలిసారి. గురువారం బీఎస్‌ఈలో అరబిందో ఫార్మా షేరు 2.49 శాతం నష్టంతో రూ.1,337.50 వద్ద క్లోజైంది.

ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణలో కీలక పురోగతి

బిడ్డర్లకు ఆర్‌బీఐ అనుమతి జారీ

న్యూఢిల్లీ: ప్రస్తుతం ఎల్‌ఐసీ ఆధీనంలో ఉన్న ఐడీబీఐ బ్యాంక్‌ను కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చిన బిడ్డర్లకు ఆర్‌బీఐ 'ఫిట్ అండ్ ప్రాపర్' అనుమతిని మంజూరు చేసినట్లు తెలిసింది. తద్వారా బ్యాంక్ ప్రైవేటీకరణ ప్రక్రియలో మరో అడుగు ముందుకు పడింది. ఎందుకంటే, బిడ్డర్లు బ్యాంకింగ్ నియంత్రణ నియమావళికి లోబడి ఉన్నారని ఆర్‌బీఐ ధ్రువీకరించడం ఈ ప్రక్రియ పురోగతికి కీలకం. ఇక తుది నిర్ణయం కేంద్రం చేతుల్లో ఉంది. వచ్చేవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే 2024-25 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల ఇందుకు సంబంధించిన సంకేతాలిచ్చే అవకాశాలున్నాయి. ఐడీబీఐ బ్యాంక్ కొనుగోలు బరిలో కోటక్ మహీంద్రా బ్యాంక్‌తో పాటు సీఎస్‌బీ బ్యాంక్ ప్రమోటర్ ఫెయిర్‌ఫాక్స్ ఇండియా హోల్డింగ్స్ కూడా ఉన్నట్లు సమాచారం. ఐడీబీఐ బ్యాంక్‌లో కేంద్రం 45.5 శాతం వాటా కలిగి ఉండగా.. ఎల్‌ఐసీ 49.24 శాతం వాటాతో అతిపెద్ద వాటాదారుగా కొనసాగుతోంది.

కేవీబీ లాభంలో 28% వృద్ధి

చెన్నై: ప్రైవేట్ రంగంలోని కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ).. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.458.65 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.358.63 కోట్లు)తో పోల్చితే లాభం 27.86 శాతం వృద్ధి చెందింది. సమీక్షా కాలంలో నికర వడ్డీ ఆదాయం కూడా 14.27 శాతం వృద్ధితో రూ.1,025 కోట్లకు చేరుకుంది. కాగా స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 1.99 శాతం నుంచి 1.32 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.59 శాతం నుంచి 0.38 శాతానికి తగ్గినట్లు పేర్కొంది. వృద్ధి, లాభదాయకతపరంగా మెరుగైన పనితీరును కనబరచటం ఎంతగానో కలిసి వచ్చిందని తెలిపింది. కాగా జూన్ త్రైమాసికం ముగిసేనాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.1,70,059 కోట్లు అధిగమించింది

స్పోర్ట్స్

సూర్యకే పగ్గాలు

- శుభ్‌మన్‌కు వైస్ కెప్టెన్సీ
- వన్డేలకు రోహిత్, కోహ్లీ
- లంక టూర్‌కు భారత జట్లు



టీ20 జట్టు

సూర్యకుమార్ (కెప్టెన్), గిల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రింకూ సింగ్, రియాన్ పరాగ్, రిషభ్ పంత్, శాంసన్, హార్దిక్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, ఖలీల్ అహ్మద్, సిరాజ్. (15 మంది)

వన్డే జట్టు

రోహిత్ శర్మ (కెప్టెన్), గిల్ (వైస్ కెప్టెన్), కోహ్లీ, కేఎల్ రాహుల్, పంత్, శ్రేయాస్ అయ్యర్, శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, సిరాజ్, సుందర్, అర్ష్‌దీప్, రియాన్ పరాగ్, అక్షర్, ఖలీల్, హర్షిత్ రాణా. (15 మంది)

న్యూఢిల్లీ: భారత టీ20 జట్టు కొత్త కెప్టెన్‌గా డాషింగ్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్‌ను ఎంపికచేశారు. లంకతో టీ20, వన్డే సిరీస్‌లకు భారత జట్లను గురువారం బీసీసీఐ ప్రకటించింది. పొట్టి వరల్డ్‌కప్ తర్వాత విశ్రాంతిలో ఉన్న రోహిత్, విరాట్ కోహ్లీ వన్డే జట్టులోకి వచ్చారు. ఈ నెల 27 నుంచి శ్రీలంకతో జరిగే మూడు టీ20ల సిరీస్ నుంచి ఫుల్‌టైమ్ సారథిగా సూర్య ప్రయాణం ఆరంభం కానుంది. ఇక మూడు వన్డేల సిరీస్ వచ్చే నెల 2 నుంచి జరగనుంది. రాహుల్ ద్రవిడ్ తర్వాత కోచ్‌గా నియమితుడైన గౌతమ్ గంభీర్ ఇదే తొలి సిరీస్. శుభ్‌మన్ గిల్‌ను వైస్ కెప్టెన్‌గా ప్రకటించారు. టీ20 ఫార్మాట్‌కు రోహిత్ వీడ్కోలు పలకడంతో.. హార్దిక్ పాండ్యాకు పగ్గాలు అప్పగిస్తారని భావించారు. కానీ, హార్దిక్‌కు టీమ్ పగ్గాలు అప్పజెప్పేందుకు కొత్త కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఆసక్తి కనబర్చలేదు. 2026 పొట్టికప్‌ను దృష్టిలో ఉంచుకొని జట్టును తయారు చేస్తున్న విషయాన్ని పాండ్యాకు అర్థమయ్యే విధంగా చెప్పినట్టు సమాచారం. టీ20లు ఆడేందుకు అంగీకరించిన హార్దిక్.. వ్యక్తిగత కారణాలతో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. రియాన్ పరాగ్, ఢిల్లీ పేసర్ హర్షిత్ రాణాకు 50 ఓవర్ల ఫార్మాట్‌లో తొలిసారి చోటు దక్కింది. కాగా, శ్రేయాస్ అయ్యర్ అనూహ్యంగా వన్డే టీమ్‌లో రీఎంట్రీ ఇచ్చాడు. బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ నిలిపివేయడంతో అయ్యర్ అంతర్జాతీయ కెరీర్ ముగిసిందని భావించారు. కానీ, గౌతీతో ఉన్న సాన్నిహిత్యం శ్రేయాస్ కెరీర్‌కు ఒకరకంగా ఊపిరిలూదింది.


హర్షిత్ రాణా

మా బంధం ముగిసింది

నటాషా, నేను విడిపోయాం
హార్దిక్ వెల్లడి



న్యూఢిల్లీ: టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, అతడి సెర్బియా భార్య నటాషా స్టాన్కోవిచ్ విడిపోయారు. ఈ విషయాన్ని హార్దిక్, నటాష ఇన్‌స్టా వేదికగా గురువారం రాత్రి అధికారికంగా ప్రకటించారు. నాలుగేళ్ల తమ వైవాహిక బంధానికి ముగింపు పలుకుతున్నట్టు హార్దిక్ వెల్లడించాడు. కుమారుడు అగస్త్యను తీసుకుని నటాషా బుధవారం సెర్బియా వెళ్లిపోయింది. కలిసి సాగేందుకు ప్రయత్నించినా కుదరలేదని..అందువల్ల పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకున్నట్టు హార్దిక్ వివరించాడు. 2020లో హార్దిక్, నటాషా వివాహ బంధంతో ఒక్కటికాగా..మరుసటి ఏడాది వారికి మగబిడ్డ జన్మించాడు. బాబు బాధ్యతను తామిద్దరం చూసుకుంటామని వారు చెప్పారు.


పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన హైదరాబాద్ షూటర్ ఇషాసింగ్ గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా సీఎం ఆమెకు 'ఆల్ ది బెస్ట్' చెప్పారు.

'ఆసియా' పోరుకు అమ్మాయిలు సై

బరిలో ఎనిమిది జట్లు
ఆరంభ మ్యాచ్‌లో నేపాల్ x యూఏఈ
మధ్యాహ్నం 2 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..


ట్రోఫీతో కెప్టెన్లు

దంబుల్లా: ఈ ఏడాది అక్టోబరులో మహిళా టీ20 ప్రపంచకప్ జరగాల్సి ఉంది. అయితే అంతకంటే ముందే ఆసియాకప్‌తో అలరించేందుకు ఆయా జట్లు సిద్ధమవుతున్నాయి. శ్రీలంక ఆతిథ్యమివ్వనున్న ఈ టోర్నీ శుక్రవారం నుంచి ఈనెల 28 వరకు జరుగుతుంది. ఆరంభ మ్యాచ్‌ల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి నేపాల్-యూఏఈ.. రాత్రి 7.30 నుంచి భారత్-పాక్ తలపడనున్నాయి. ఇక టోర్నీలోని ఫైనల్ సహా మొత్తం 15 మ్యాచ్‌లూ రణ్‌గిరి దంబుల్లా అంతర్జాతీయ స్టేడియంలోనే నిర్వహించనున్నారు. మొత్తంగా పాల్గొనే 8 జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. **గ్రూప్-ఎ**లో భారత్, నేపాల్, పాక్, యూఏఈ ఉండగా.. **గ్రూప్-బి**లో బంగ్లాదేశ్, మలేసియా, శ్రీలంక, థాయ్‌లాండ్ జట్లున్నాయి. ఒక్కో జట్టు తమ గ్రూపులో మూడు మ్యాచ్‌లు ఆడుతుంది. అనంతరం రెండు గ్రూపుల్లోని టాప్-2 జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి.

మనదే ఆధిపత్యం: ఆసియాకప్ ఆరంభం నుంచే భారత మహిళల జట్టు తమ హవాను కొనసాగిస్తోంది. మొత్తం 8సార్లు ఈ టోర్నీ జరగ్గా కేవలం 2018ని మినహాయిస్తే అన్నిసార్లూ భారత జట్టే చాంపియన్‌గా నిలిచింది. మొదట 2004 నుంచి 2008 వరకు వన్డే ఫార్మాట్‌లో జరిగిన ఆసియాకప్.. 2012 నుంచి పొట్టి ఫార్మాట్‌కు మారింది. రెండేళ్ల క్రితం బంగ్లాదేశ్‌లో జరిగిన ఆసియాకప్‌లోనూ హర్మన్‌ప్రీత్ సేన గెలిచింది. అలాగే టీ20 ఆసియాకప్‌లో 20 మ్యాచ్‌లు ఆడగా 17 గెలిచింది. ఇప్పుడు డిఫెండింగ్ చాంపియన్‌గా మరోసారి తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలనుకుంటోంది. మరోవైపు నేపాల్ జట్టు 2016 తర్వాత ఆసియాకప్‌లో చోటు దక్కించుకోగా.. యూఏఈకిది వరుసగా రెండో టోర్నీ.

పాక్‌తో టైటిల్ వేట

నేడు టీమిండియా తొలి మ్యాచ్
రాత్రి 7 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

మహిళల ఆసియాకప్ ఆరంభ మ్యాచ్‌లోనే భారత జట్టు తమ చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను ఎదుర్కొనబోతోంది. ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్‌కప్‌నకు సన్నాహకంగానే కాకుండా టీమ్ కాంబినేషన్ కోసం కూడా హర్మన్‌ప్రీత్ సేన ఈ టోర్నీని వినియోగించుకోవాలనుకుంటోంది. టీ20 ఫార్మాట్‌లో జరిగిన నాలుగు పర్యాయాల్లో మూడుసార్లు భారత్ విజేతగా నిలిచింది. అలాగే అంతర్జాతీయ టీ20ల్లో ప్రత్యర్థి పాక్‌పై భారత మహిళలు సంపూర్ణ ఆధిపత్యంతో ఉన్నారు. ఆడిన 14 మ్యాచ్‌ల్లో 11-3తో పైచేయిగా ఉండడం విశేషం. ఇప్పుడు తమ గ్రూప్ 'ఎ'లోనే ఉన్న పాక్‌ను చిత్తుగా ఓడించి అద్భుత బోణీతో టైటిల్ వేటను ఆరంభించాలనుకుంటోంది. ఇటీవల దక్షిణాఫ్రికాతో ముగిసిన మూడు టీ20ల సిరీస్‌ను 1-1తో డ్రా చేసుకున్న భారత్ చక్కటి ఆత్మవిశ్వాసంతో ఉంది. అలాగే రెగ్యులర్ మ్యాచ్‌లతో ప్రాక్టీస్‌కు ఢోకా లేకుండాపోయింది. భారత బ్యాటింగ్‌లో స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన తిరుగులేని ఫామ్ కొనసాగిస్తోంది. అటు షఫాలీ ఆటలోనూ మెరుపులు కనిపిస్తే ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు కనిపిస్తాయి. కెప్టెన్ హర్మన్ మిడిలార్డర్‌లో నిలకడగా ఆడుతోంది. అన్నింటికంటే ముఖ్యంగా జట్టు బౌలర్లు అన్ని ఫార్మాట్లలోనూ అదరగొడుతుండడం సానుకూలాంశం. అటు గత మేలో ఇంగ్లండ్‌పై 0-3తో టీ20 సిరీస్‌ను కోల్పోయిన పాక్ జట్టులో ఆరుగురిని తొలగించారు. మరో ముగ్గురికి ఈ ఏడాది ఒక్క మ్యాచ్ కూడా ఆడిన అనుభవం లేదు. దీంతో పటిష్ఠ భారత్‌కు పాక్ ఏమేరకు పోటీనిస్తుందో వేచిచూడాల్సిందే..

గ్రూప్ 'ఎ'లో భారత్ షెడ్యూల్

తేదీ	ప్రత్యర్థి
జూలై 19	పాకిస్థాన్
జూలై 21	యూఏఈ
జూలై 23	నేపాల్

తులిక.. తెచ్చేనా పతకం?


తులికా మాన్
జూడో

పారిస్‌కు వందమందికి పైగా బృందంతో భారత్ బరిలో దిగుతోంది. ఇందులో ఒక్క ప్లేయరే తలపడుతున్న క్రీడాంశాలు మూడున్నాయి. వాటిలో జూడో ఒకటి. అది కూడా మహిళల విభాగంలో. ఆమే ఢిల్లీకి చెందిన 25 ఏళ్ల తులికా మాన్. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల్లో తులిక రజత పతకం సొంతం చేసుకుంది. మహిళల +78 కిలోల విభాగంలో మొత్తం 1345 పాయింట్లు సాధించిన ఆమె..ఒలింపిక్ క్వాలిఫికేషన్ ర్యాంకింగ్స్‌లో 36వ స్థానంలో నిలిచింది. తులిక ప్రస్తుతం స్పెయిన్‌లోని వలెన్సియాలో శిక్షణ తీసుకుంటోంది. అటు నుంచే ఈనెల 26న ఒలింపిక్స్ ప్రారంభం నాటికి పారిస్ చేరుకోనుంది. తులిక తొలి బౌట్ ఆగస్టు రెండున జరగనుంది. గత టోక్యో విశ్వక్రీడల్లోనూ జూడోలో భారత్ నుంచి ఒక్కరే బరిలో ఉన్నారు. మహిళల 48 కిలోల విభాగంలో సుశీలా దేవి లికంబమ్ తలపడింది. కానీ ఆమె తొలి రౌండ్‌ను దాటలేకపోయింది. ఈనేపథ్యంలో తులికా మాన్ అయినా ఒలింపిక్స్‌లో భారత్ తొలి పతకం అందిస్తుందేమో చూడాలి.


పారిస్ ఒలింపిక్స్ 7 రోజుల్లో

పారిస్‌లో ఇనుప తెర !

పారిస్: మరికొద్ది రోజుల్లో ఒలింపిక్స్ ప్రారంభం కానుండడంతో క్రీడల నిర్వాహకులు భద్రతా చర్యలపై దృష్టి సారించారు. ఉగ్రవాద చర్యల నిరోధంలో భాగంగా..సెంట్రల్ పారిస్ సహా సెన్ నదీపరివాహక ప్రాంతంలో గురువారం ఇనుప తెరను ఏర్పాటు చేశారు. ఈనేపథ్యంలో పోలీసులు ప్రత్యేకంగా జారీ చేసిన పాస్ ఉంటే తప్ప సెన్ నదిని దాటేందుకు, సెంట్రల్ పారిస్‌లో తిరిగేందుకు అనుమతించడంలేదు. కిలోమీటర్ల పొడవున ఇనుప తెర ఏర్పాటు చేయడంతోపాటు పోలీసులనూ భారీగా మోహరించారు. ఫోన్‌లో క్యూఆర్ కోడ్ లేదా పేపర్ ప్రింట్ ఉన్నవారినే ఈ ప్రాంతంలో తిరిగేందుకు పోలీసులు అనుమతిస్తున్నారు.

ఇంగ్లండ్ వరల్డ్ రికార్డు

4.2 ఓవర్లలోనే 50 రన్స్
తొలి ఇన్నింగ్స్ 416


పోప్ (121)

నాటింగ్‌హామ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఇంగ్లండ్ జట్టు బజ్‌బాల్ గేమ్‌తో చెలరేగింది. గురువారం ఆరంభమైన ఈ టెస్టులో మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య జట్టు మొదటి 4.2 ఓవర్లలోనే 50 పరుగులు పూర్తి చేసి అత్యంత వేగంగా ఈ ఫీట్‌ను సాధించిన టీమ్‌గా చరిత్రకెక్కింది. గతంలోనూ ఈ రికార్డు (1994లో దక్షిణాఫ్రికాపై 4.3 బంతుల్లో) ఇంగ్లండ్ పేరిటే ఉంది. ఈ దూకుడైన ఆటతీరుతో మొదటి రోజు ఆట ముగిసేసరికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 88.3 ఓవర్లలో 416 పరుగులకు ఆలౌటైంది. పోప్ (121) శతకం, ఓపెనర్ డకెట్ (71) హాఫ్‌సెంచరీ సాధించారు. అలాగే మిడిలార్డర్‌లో కెప్టెన్ స్టోక్స్ (69), వోక్స్ (37), బ్రూక్, (36), స్మిత్ (36) రాణించారు. అల్జారికి 3.. హాడ్జ్, సింక్లెయిర్, సీల్స్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.



ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత గురువారం సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు.

హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రవి గుప్తా బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రవి గుప్తా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఐపీఎస్‌ల బదిలీల్లో అప్పటి వరకు డీజీపీగా ఉన్న రవిగుప్తాను హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేసింది. బదిలీ అయినప్పటి నుంచి సెలవులో ఉన్న ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

టీజీ న్యాబ్ పనితీరు భేష్

» కేంద్ర హోం మంత్రి అమిత్ షా

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యాంటీ-నార్కోటిక్స్ విభాగం టీజీ న్యాబ్ పనితీరును కేంద్రం కొనియాడింది. తెలంగాణలో డ్రగ్స్ కట్టడికి అనుసరిస్తున్న విధానాలు, శిక్షల శాతం, నిందితుల ఆస్తుల అటాచ్‌మెంట్ తదితర అంశాల్లో టీజీ న్యాబ్ పనితీరు భేషుగ్గా ఉందని వ్యాఖ్యానించింది. గురువారం కేంద్ర హోం మంత్రి అమిత్‌షా నేతృత్వంలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) అన్ని రాష్ట్రాల సీఎస్‌లు, డీజీపీలు, హోంశాఖ ముఖ్య కార్యదర్శులతో వర్చువల్ సమావేశం ఏర్పాటు చేసింది. తెలంగాణ నుంచి డీజీపీ జితేందర్, టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా హాజరయ్యారు.

ప్రజాపాలన కేంద్రాలను వినియోగించుకోవాలి

» రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ప్రజాపాలన సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సేవా కేంద్రాన్ని గురువారం మంత్రి పరిశీలించారు. ప్రజాపాలనలోని ఆరు గ్యారెంటీల్లో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకం ద్వారా అమలవుతున్న రూ.500 గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు సమాచార సవరణ కోసం ప్రజా పాలన సేవా కేంద్రాలకు వెళ్లాలన్నారు. కాగా, ఆషాఢమాసం బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి పొన్నం అధికారులను కోరారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన ఆలయాలకు బోనాల చెక్కులను పంపిణీ చేశారు.

సీఎస్ శాంతికుమారితో రైల్వే జీఎం భేటీ

హైదరాబాద్, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపట్టిన రైల్వే ప్రాజెక్టులకు స్థలాల కేటాయింపులు, ఆయా ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు తదితర సమస్యలపై వారు చర్చించారు. ఈ మేరకు గురువారం సచివాలయంలో రైల్వే అధికారుల బృందంతో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో చేపట్టిన రైల్వే ప్రాజెక్టుల ప్రగతి వివరాలను సీఎస్ తెలుసుకున్నారు.

20, 21 తేదీల్లో ప్రపంచ కమ్మ మహాసభలు

పంజాగుట్ట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20, 21 తేదీల్లో తొలిసారిగా ప్రపంచ కమ్మ మహాసభలు నిర్వహిస్తున్నామని కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు జెట్టి కుసుమ కుమార్ తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో నిర్వహించనున్న ఈ సభలను శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ మేరకు ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫెడరేషన్ సభ్యులతో కలిసి జెట్టి కుసుమకుమార్ ఈ సభల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సభల్లో పలు అంశాలపై చర్చలు, ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయన్నారు. 21న జరిగే సభలకు ఏపీ సీఎం చంద్రబాబును ఆహ్వానించినట్లు వెల్లడించారు. ఫెడరేషన్ సభ్యులు ఈడ్పుగంటి సుబ్బారావు, ఎం.భానుప్రసాద్, బి.శ్రీనివాసరావు, ఎం.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గాంధీ, ఉస్మానియా సూపరింటెండెంట్ల బదిలీ

» మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లకూ స్థానచలనం

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల సూపరింటెండెంట్లను సర్కారు బదిలీచేసింది. సాధారణ బదిలీల్లో భాగంగా పలువురు సీనియర్ వైద్యాధికారులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తూ గురువారం నిర్ణయం తీసుకున్నారు. గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్ రాజారావును యాదాద్రి-భువనగిరి మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్‌గా, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రమేశ్‌రెడ్డిని యాదాద్రి-భువనగిరి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేసింది. ఉస్మానియా హాస్పిటల్ సూపరింటెండెంట్ నాగేందర్‌ను మహేశ్వరం టీచింగ్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా, మాజీ డీఎంఈ త్రివేణిని మహేశ్వరం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. నిజామాబాద్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా.. నల్లగొండ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజకుమారి గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్‌ను నర్సంపేట్ మెడికల్ కాలేజీకి బదిలీచేశారు. హైదరాబాద్‌లోని మిగిలిన ఆస్పత్రుల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారినీ ఒకట్రెండు రోజుల్లో బదిలీ చేయనున్నట్టు తెలిసింది.

ఉప ఎన్నికలపై బీజేపీ నజర్!

» ఐదారుగురు బలమైన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఆకర్షించి వారితో రాజీనామా చేయించే ప్లాన్

» బీజేపీ జాతీయ నాయకత్వం ముందు ప్రతిపాదన

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌లోని ఐదారుగురు బలమైన నేతలను ఆకర్షించి.. వారితో రాజీనామా చేయించి, వారిని తమ పార్టీలోకి తీసుకుని.. ఉపఎన్నికలకు వెళ్లాలని కమలనాథులు యోచిస్తున్నారా? తద్వారా రాష్ట్రంలో మరింత బలపడాలని భావిస్తున్నారా? అంటే.. ఆ పార్టీ వర్గాలు ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమే ఇస్తున్నాయి. ఇలా చేయడం వల్ల.. ఇప్పటికే కాంగ్రె‌స్‌లో చేరిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై కూడా రాజీనామా చేయాలనే ఒత్తిడి పెరుగుతుందని రాష్ట్ర బీజేపీ ముఖ్యనేతలు కొందరు అంచనా వేస్తున్నారు. దీనిపై వారు పార్టీ జాతీయ నాయకత్వం వద్ద ఒక ప్రతిపాదన చేసినట్టు సమాచారం. ఇతర పార్టీల ఎమ్మెల్యేలు రాజీనామా చేసి వస్తేనే తీసుకుంటామన్న నిబంధన కారణంగా పలువురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరేందుకు ముందుకు రావడం లేదని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే కాంగ్రె‌స్‌లోచేరిన ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరు వాస్తవానికి బీజేపీలో చేరేందుకు ప్రయత్నాలు చేశారని.. కానీ, రాజీనామా అంశంపై తమ విస్పష్ట వైఖరి కారణంగా వారు చేరలేదని ఆ వర్గాలు వివరించాయి. మరికొందరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేందుకు ఆసక్తిగా ఉన్నా, మునుగోడు ఫలితం నేపథ్యంలో వారు పునరాలోచిస్తున్నట్టు సమాచారం. రాజీనామా చేశాక మళ్లీ కచ్చితంగా గెలిచే సత్తా ఉన్నవారిని ఆకర్షించి ఉప ఎన్నికలకు వెళ్లడం ద్వారా అటు కాంగ్రెస్ దూకుడుకు కళ్లెం వేయడంతో పాటు ఇటు బీఆర్‌ఎస్‌నూ మరింత దెబ్బకొట్టినట్లు అవుతుందన్న అభిప్రాయం కొంతమంది ముఖ్యనేతల్లో ఉంది.

రాష్ట్ర బడ్జెట్ 25న?



» 23 నుంచి అసెంబ్లీ సమావేశాలు

» 2 వరకు శాసన సభ, మండలి?

» రైతు భరోసా, బీసీ రిజర్వేషన్లపై చర్చ!

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఈ నెల 25న అసెంబ్లీలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్, మే, జూన్, జూలై నెలలకు ప్రభుత్వం 'ఓట్-ఆన్-అకౌంట్' బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. దాని గడువు ఈ నెల 31తో ముగియనుంది. దీంతో అసెంబ్లీలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి 31లోపు ఆమోదం పొందాల్సి ఉంది. ఈ క్రమంలో 25న బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది. ఈ నెల 23 నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. మండలి సమావేశాలు 24 నుంచి ప్రారంభం అవుతాయి. ఈ మేరకు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అనుమతి ఇవ్వడంతో శాసనసభా కార్యదర్శి వి.నర్సింహాచార్యులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 23న ఉదయం 11 గంటలకు శాసన సభ, 24న ఉదయం 10 గంటలకు మండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. ఇటీవల మృతి చెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందితకు 23న సంతాపం తెలపనున్నారు. సమావేశాలను 23న ప్రారంభించి, ఆదివారం మినహాయించి 31 వరకు ఎనిమిది రోజుల పాటు కొనసాగిస్తారా? లేక ఆగస్టు 2 వరకు 10 రోజుల పాటు నిర్వహిస్తారా? అనేది శాసనసభా వ్యవహారాల కమిటీ (బీఏసీ) సమావేశంలో తేల్చనున్నారు. ఆగస్టు 3న సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ క్రమంలో 2 వరకు సమావేశాలను కొనసాగించవచ్చని తెలుస్తోంది. ఈ సమావేశాలు 31 తర్వాత కూడా కొనసాగించదలిస్తే ఆ లోపే ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించుకోవాల్సి ఉంటుంది.

రైతుభరోసాపై చర్చ..!

ఈ సమావేశాల్లో ప్రధానంగా రైతు భరోసాపై చర్చ జరగనుంది. పథకం విధివిధానాల రూపకల్పనకు ఎమ్మెల్యేల అభిప్రాయాలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రైతు భరోసాపై లఘు చర్చ చేపట్టే అవకాశం ఉంది. రైతులకు ఖరీఫ్ సీజన్ సొమ్ము అందించాల్సి ఉన్నందున.. విధివిధానాలను త్వరగా రూపొందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. అందుకే ఈ సమావేశాల్లోనే సభ్యుల అభిప్రాయాలు తీసుకుంటుందని భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహం రూపకల్పనపైనా చర్చ చేపట్టవచ్చని తెలుస్తోంది. కొన్ని కీలక బిల్లులనూ ప్రవేశపెడతారని సమాచారం. ఇక స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లపైనా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ అంశాన్ని కూడా చర్చకు పెట్టవచ్చని తెలుస్తోంది. సంక్షేమ పథకాల్లో అక్రమంగా లబ్ధి పొందినవారి నుంచి సొమ్మును రికవరీ చేసే అంశంపైనా సభలో చర్చిస్తారని సమాచారం. జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసే అంశమూ చర్చకు రావొచ్చు. రాష్ట్రంలో హత్యలు, అత్యాచారాలు పెరిగి, శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయంటూ ఇటీవల ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశాలున్నాయి.

రుణం మాఫీ.. రైతు ఖుషీ..!

రాష్ట్రవ్యాప్తంగా అన్నదాతల సంబరాలు.. పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ శ్రేణుల వేడుకలు

» సీఎం రేవంత్, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

హైదరాబాద్/సిటీ/కరీంనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించడంతో రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి. కాంగ్రెస్ శ్రేణులు, రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. పలుచోట్ల బాణసంచా కాల్చుతూ, నృత్యాలు చేస్తూ, మిఠాయిలు పంచుకుంటూ వేడుకలు చేసుకున్నారు. గ్రామగ్రామాన పండగ వాతావరణం నెలకొంది. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకొన్నాయి. కార్యకర్తలు, నాయకులు డప్పు చప్పుళ్ల మధ్య నృత్యం చేస్తూ బాణసంచా కాల్చుతూ సందడి చేశారు. స్వీట్లు పంపిణీ చేసి, పరస్పరం అభినందనలు చెప్పుకొన్నారు. పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీతో కలిసి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ కేక్ కోశారు. రుణమాఫీతో రైతులందరూ పండగ చేసుకుంటున్నారన్నారు. ఏకకాలంలో రుణమాఫీ చేయడం దేశ చరిత్రలోనే తొలిసారి అన్నారు. సుమారు 70 లక్షల మంది రైతులకు మేలు చేకూర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.31 వేల కోట్లు నిధులు వెచ్చించి రుణమాఫీ ప్రకటించి, సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. రైతు డిక్లరేషన్‌లో భాగంగా రాహుల్ ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేశారు. రైతులను సన్మానించి, స్వీట్లు పంచారు. డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ జన సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఓయూలోనూ విద్యార్థి నేతలు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.



రుణమాఫీపై 'ఆంధ్రజ్యోతి'లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రకటన చదువుతూ ఆనందం వ్యక్తం చేస్తున్న హనుమకొండ జిల్లా దేవునూరుకు చెందిన రైతు దంపతులు రమేష్ రెడ్డి, విజయ



గాంధీ భవన్ వద్ద సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు, దీపాదాస్ మున్షీ

ఉద్యోగులకు 'క్యాబేజీలు, సొరకాయలు'

రుణమాఫీపై రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు, రైతు చింపుల సత్యనారాయణరెడ్డి వినూత్న రీతిలో ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. సచివాలయ ఉద్యోగులకు క్యాబేజీ, సొరకాయలు ఉచితంగా అందించారు. రుణమాఫీ తనకు కూడా వర్తించిందని, ఆ పథకం అమలులో సచివాలయ ఉద్యోగులు కీలక భూమిక పోషించడంతో వారికి తన పొలంలో పండిన కూరగాయలను ఇవ్వాలని నిర్ణయించుకున్నానని, అందుకే 2 వేల సొరకాయలు, 2 వేల క్యాబేజీలను అందించానని చెప్పారు.

గ్రామాల్లో రుణమాఫీ సంబరాలు

కరీంనగర్ సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాల్లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు, రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. రామడుగులో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూర్‌లో డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సంబరాల్లో పాల్గొన్నారు. రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతువేదికల్లో రైతులు చూసేందుకు ఏర్పాట్లు చేశారు.



అధికారులతో సమీక్ష చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్ ఎత్తిపోతలకు తక్షణమే టెండర్లు

అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

3,4 వారాలకోసారి సమీక్షిస్తానని వెల్లడి

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి తక్షణమే టెండర్లు పిలవాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ పథకం పురోగతిపై ప్రతి మూడు లేదా నాలుగు వారాలకోసారి తాను సమీక్ష చేస్తానని చెప్పారు. గురువారం తన నివాసంలో ఈ పథకంపై నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్ కుమార్‌తో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పురోగతిపై రేవంత్ ఆరా తీయగా.. ప్రస్తుతం డిజైన్లను తయారు చేస్తున్నామని, త్వరలోనే తుదిరూపు ఇస్తామని అధికారులు చెప్పారు. ఒక వైపు డిజైన్లు సిద్ధం చేస్తూ.. మరోవైపు పనుల కోసం టెండర్లు పిలవాలని సీఎం నిర్దేశించారు. ఇక భూత్పూరు జలాశయం నుంచి ఈ పథకానికి నీటిని తరలించాలని ఇప్పటికే ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. 4.02 టీఎంసీలను నిల్వ చేసేలా ఈ ప్రాజెక్టు కింద జలాశయాలు నిర్మించనున్నారు. అలాగే, కొడంగల్‌లో ఫిష్ మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పశుసంవర్ధక శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. మద్దూరు గురుకుల క్యాంపస్ నిర్మాణంపైనా పలు సూచనలు చేశారు.

జీవో 317పై నేడు మంత్రివర్గ ఉపసంఘం భేటీ

» జీఏడీకి శాఖల వారీ నివేదికలు

» 2008 డీఎస్సీ బాధితులకు ఉద్యోగాలపై విధివిధానాలు ఖరారు చేసే చాన్స్

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జీవో 317కు సంబంధించి ఉద్యోగుల వినతులపై చర్చించేందుకు మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో సమావేశం కానుంది. మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ నేతృత్వంలోని ఉపసంఘం.. ఇప్పటికే స్పౌజ్, మెడికల్, మ్యూచువల్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల భార్య/భర్త చేసుకున్న దరఖాస్తులపై సానుకూల నిర్ణయం తీసుకుంది. మిగిలిన అభ్యంతరాలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులపై శాఖల వారీగా నివేదికలు సిద్ధమయ్యాయి. ఈనెల 16 నాటికి అన్ని నివేదికలు సాధారణ పరిపాలన శాఖ(జీఏడీ)కు చేరాయి. వీటిపై మంత్రివర్గ ఉపసంఘం చర్చించనుంది. అలాగే 2008డీఎస్సీ బాధితులకు ఉద్యోగాలిచ్చే అంశంలో విధివిధానాలపైనా చర్చించనున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన నష్టపోయిన వారి వివరాలను విద్యాశాఖ సేకరించింది. ఆరు వారాల్లో ఉద్యోగాలిస్తామని జూన్ 27న ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఈ నేపథ్యంలోనే డీఎస్సీ బాధితులకు ఉద్యోగాలపై విధివిధానాలను ఉపసంఘం ఖరారు చేసే అవకాశముంది.

మౌఖిక ఆదేశాలేనా.. ఉత్తర్వులు లేవా?

త్రిసభ్య కమిటీపై ఉద్యోగుల ఐకాసలో సందిగ్ధం

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వానికి సలహాలు, సూచనలు అందించేందుకు ఏర్పాటైన త్రిసభ్య కమిటీకి అధికారిక ఉత్తర్వులు ఉన్నాయా లేవా అనే సందిగ్ధం ఉద్యోగ సంఘాల్లో నెలకొంది. జీ చిన్నారెడ్డి నేతృత్వంలో ప్రొఫెసర్ కోదండరాం, ఐఏఎస్ అధికారిణి దివ్య దేవరాజన్‌తో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ పలు దఫాలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమైంది. ప్రభుత్వ మౌఖిక ఆదేశాల ప్రకారమే పనిచేస్తోంది తప్ప విధి విధానాలపై నేటికీ అధికారికంగా ఉత్తర్వులు రాలేదని ఉద్యోగుల ఐకాస నాయకులు చెబుతున్నారు. గురువారం టీజీవో, టీఎన్‌జీవో నేతృత్వంలోని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి తమ డిమాండ్లను వివరించారు. ఈ సందర్భంలో త్రిసభ్య కమిటీ ఏర్పాటుకు సంబంధించిన ఉత్తర్వులపై మంత్రులను ఐకాస ప్రతినిధులు వివరణ కోరగా స్పష్టత రాలేదు. సీఎంవో కార్యదర్శి శేషాద్రిని కూడా కలవగా ఈ విషయం కూడా తననే అడిగితే ఎలా అని ఆయన సున్నితంగా తిరస్కరించారు. దీంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారిని ఆశ్రయించారు. అక్కడ కూడా ఎలాంటి స్పష్టత రాలేదని ఐకాస ప్రతినిధులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. గత 20 రోజులుగా సీఎస్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామన్నారు. కాగా, 20 రోజులుగా జీఏడీ సర్వీసెస్ కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉండడంతో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఉద్యోగుల ఐకాస ఆవేదన వ్యక్తం చేస్తోంది.

రైతుబంధు నిధులు రుణమాఫీకి మళ్లింపు

రూ.లక్ష వరకు అప్పు తీసుకున్నది 40 లక్షల మందికిపైగా అన్నదాతలు


11 లక్షల మందినే ఎలా ఎంపిక చేస్తారు: కేటీఆర్

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రైతు బంధు కింద జూన్‌లో వారికి ఇవ్వాల్సిన నిధుల్లో నుంచి రూ.7,000 కోట్లను రేవంత్ సర్కారు రుణమాఫీకి మళ్లించిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు తెలిపారు. హక్కుగా రావాల్సిన రైతు బంధు డబ్బుల్లో కొంత మొత్తాన్ని విదిల్చి, రుణమాఫీ చేస్తున్నామని పోజులు కొడుతున్నారని అన్నారు. రుణమాఫీ పేరిట రేవంత్ సర్కార్ రైతులను మోసగిస్తోందని విమర్శించారు. 40 లక్షల మందికిపైగా రైతులు రూ.లక్ష వరకు రుణాలు తీసుకుంటే కేవలం 11 లక్షల మందినే ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. 2014, 2018లో కేసీఆర్ సర్కార్ చేసిన రుణమాఫీతో పోలిస్తే పావు వంతు రైతులకే అర్హత కల్పించారని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో 2014లోనే రూ.లక్ష లోపు రుణాలు మాఫీ చేసేందుకు రూ.16,144కోట్లు వెచ్చించి దాదాపు 35 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చామని వెల్లడించారు. 2018లో 37లక్షల మంది రైతులకు రూ.లక్షలోపు రుణమాఫీకి రూ.19,198 కోట్లు వెచ్చించామని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం రూ.2లక్షల వరకు ఉన్న పంట రుణాలు మాఫీ చేయాలని, అర్హులైన రైతులందరికీ వారి ఖాతాల్లో రైతు బంధు డబ్బులు చేయాలని కేటీఆర్ గురువారం ఎక్స్‌లో డిమాండ్ చేశారు.కాగా, ప్రజలతో ఎలా వ్యవహరించాల్లో పోలీస్ సిబ్బందికి నేర్పించాలని.. ఈ విషయంలో ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని డీజీపీ జితేందర్‌కు కేటీఆర్ సూచించారు. ఒక వాహనదారుడిని పోలీసులు దుర్భాషలాడుతున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయిందని, సామాన్య పౌరుడితో పోలీసులు మాట్లాడిన భాష తీవ్ర అభ్యంతరకరమన్నారు.

రాజీనామాకు నేను సిద్ధమే..!

» అన్ని హామీలు నెరవేర్చకుంటే మీరు చేస్తారా?: హరీశ్ సవాల్

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, అందులోని 13 హామీలను ఆగస్టు 15వ తేదీ లోపు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అమలు చేస్తే.. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమేనని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మరోసారి ప్రకటించారు. ఆ తేదీలోపు వీటన్నింటిని అమలు చేయకుంటే మీరు రాజీనామా చేస్తారా? అని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. రాష్ట్రంలో రుణమాఫీ అమలు నేపథ్యంలో గురువారం ఓ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. రుణమాఫీ చేయలేరంటూ.. తమకు సవాల్ విసిరిన వ్యక్తిని రాజీనామా చేయాలని కోరమని చేసిన వ్యాఖ్యపై 'ఎక్స్' వేదికగా హరీశ్ స్పందించారు. తనకు పదవులు, రాజీనామాలు కొత్త కాదని, రైతులకు, పేదలకు, అణగారిన వర్గాలకు తన వల్ల మంచి జరుగుతుందంటే పదవులకు ఎన్ని సార్లయినా రాజీనామా చేయడానికి వెనుకాడబోనని స్పష్టం చేశారు.



తనికెళ్ల భరణి, ఆయన కుటుంబసభ్యులను ఆశీర్వదిస్తున్న పండితులు

కలియుగ వైకుంఠం యాదగిరిగుట్ట

ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి కుటుంబసమేతంగా గురువారం యాదగిరిగుట్ట వచ్చారు. తన సతీమణి పుట్టిన రోజు సందర్భంగా భరణి తన కుటుంబసభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. యాదగిరిగుట్ట క్షేత్రం కలియుగ వైకుంఠంగా విరాజిల్లుతోందని స్వామివారి దర్శనానంతరం ఆయన విలేకరులతో అన్నారు. కాగా, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.13,81,128 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. - భువనగిరి అర్బన్

హరీశ్.. ఇక రాజీనామా చెయ్!

» ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, అడ్లూరి డిమాండ్

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కారు రైతు రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న హరీశ్‌రావు తక్షణమే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీపై హర్షం వ్యక్తం చేస్తూ జగిత్యాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి, అడ్లూరి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల్లోనే రైతు రుణమాఫీ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. రుణమాఫీతో 60 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. హరీశ్‌రావు హైదరాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజీనామా పత్రంతో సిద్ధంగా ఉండాలని, రాజీనామా పత్రం ఫార్మాట్‌ను జగిత్యాల జిల్లా కాంగ్రెస్ తరఫున పంపిస్తామని చెప్పారు. నాడు వరంగల్ సభలో రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 లోపు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ జరుగుతోందని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు సంబరాలు జరుపుకోవాలని కోరారు. రుణమాఫీ రైతు లోకానికి శుభసూచకమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ అన్నారు. రుణమాఫీ అమలు విషయంలో ప్రతిపక్షాలు సహకరించి రైతులకు మేలు జరిగేలా చూడాలని కోరారు.

ఏం సాధించారని సంబరాలు..? : బండి సంజయ్

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ పథకానికి సంబంధించిన రైతుల జాబితాలో కోతపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఏం సాధించారని సంబరాలు చేసుకుంటున్నారని కాంగ్రెస్ నేతలపై విరుచుకుపడ్డారు. 'రబీ, ఖరీఫ్ సీజన్లలో చెల్లించాల్సిన రైతు భరోసా సొమ్ము ఎగ్గొట్టినందుకా..? పంట నష్ట పరిహారం ఇవ్వకుండా అన్నదాతలను గోస పెట్టినందుకా..? రుణమాఫీలో కోత పెట్టి రైతులను మోసం చేసినందుకా..?' అని నిలదీశారు. రాష్ట్రవ్యాప్తంగా 70 శాతం మంది రైతులకు రుణమాఫీ వర్తింపజేయకపోవడం దారుణమని మండిపడ్డారు. "రూ.2 లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ కొర్రీల మీద కొర్రీలు పెడుతూ కొద్ది మందికే పథకం వర్తింపజేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 39 లక్షల మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తుంటే.. 11 లక్షల మందికి మాత్రమే అమలు చేస్తుండటం అన్యాయం. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి లెక్కల ప్రకారం రాష్ట్రంలో రైతులు తీసుకున్న రుణాల మొత్తం రూ.64 వేల కోట్లకుపైమాటే. అందులో పదోవంతు మాత్రమే చెల్లించి సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సకాలంలో రుణమాఫీ చేసి ఉంటే రైతులు డీఫాల్టర్లుగా మారేవారు కాదు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల్లోపు రైతులు తీసుకున్న అప్పులన్నింటికీ అసలు, వడ్డీతో సహా చెల్లించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే" అని సంజయ్ ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆ ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలి

» ఈ విషయాన్ని రాజ్యసభలో ప్రస్తావిస్తా

» రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి

ఖమ్మం, జూలై 18(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర విభజన సమయంలో భద్రాచలం మండలం నుంచి ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన ఐదు పంచాయతీలను ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా తిరిగి తెలంగాణలో కలపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి విజ్ఞప్తి చేశారు. అలాగే భద్రాచలం అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ మేరకు గురువారం ఖమ్మంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. విభజన సమయంలో ఏడు ముంపు మండలాలను ఆర్డినెన్స్ ద్వారానే కేంద్రం ఆంధ్రాలో కలిపిందని రేణుకాచౌదరి గుర్తుచేశారు. ఇప్పుడు కూడా అదే పద్ధతిలో భద్రాచలానికి అనుకున్న ఉన్న ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలని కోరారు. ఈ విషయాన్ని రానున్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని ఆమె తెలిపారు. భద్రాచలం రైల్వేలైన్, కొవ్వూరు రైల్వేలైన్‌తో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి ఎంపీ రఘురాంరెడ్డి సహకారంతో కృషిచేస్తానని తెలిపారు. ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మంజిల్లా అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి ఎంపీగా కృషి చేస్తామని, కేంద్రం నుంచి జిల్లాకు రావాల్సిన నిధులు, పనులపై పోరాడతానని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీకి శ్రీకారం చుట్టి అమల్లోకి తేవడం రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, అప్పుల నుంచి విముక్తి లభిస్తుందని అన్నారు.

రేపు ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్!

» వరంగల్‌లో 'కృతజ్ఞతా సభ'కు రాహుల్‌కు ఆహ్వానం!

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఢిల్లీ వెళ్లనున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతో భేటీ కానున్నట్టు సమాచారం. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వరంగల్‌లో నిర్వహించిన రైతు డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో రుణమాఫీ పథకం అమలుచేసిన విషయాన్ని వారికి తెలియజేయనున్నారు. వరంగల్‌లోనే 'కృతజ్ఞతా సభ' నిర్వహించాలని నిర్ణయించామని, ఆ సభకు రావాలని రాహుల్ గాంధీని ఆహ్వానించనున్నట్టు తెలిసింది. సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి, ఐమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెళతారని సమాచారం. కాగా, వరంగల్‌లో కృతజ్ఞతా సభ ఏర్పాట్లపై రాష్ట్ర పార్టీ నేతలు దృష్టి సారించారు.

పండుగోలె మారనుంది వ్యవసాయం!

» పాటను ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): "పండుగోలె మారనుంది వ్యవసాయం.. మాఫీ కానుంది మన పంటల రుణం.. ఎంతగొప్పదిలే సర్కారు సాయం.. అన్నదాత క్షేమమూ మన ముఖ్యమంత్రి ధ్యేయం" అంటూ సాగే పాటను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. సచివాలయంలో గురువారం రుణ మాఫీని ప్రారంభించడానికి ముందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పాట సీడీని డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులతో కలిసి సీఎం విడుదల చేశారు.

'రుణమాఫీ' పేరుతో సైబర్ మోసాలు: డీజీపీ

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పండుగల సమయంలో ఆఫర్లు.. కొవిడ్ సమయంలో వ్యాక్సిన్లు, బ్యాంకు లోన్లు, ఉద్యోగావకాశాలు.. ఇతర సమయాల్లో ట్రాఫిక్ చలాన్లు..! ఇలా ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుకూలంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్న కేటుగాళ్లు ఇప్పుడు రైతులను టార్గెట్‌గా చేసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 'రుణమాఫీ'ని ఇప్పుడు ఎరగా మార్చుకుని, సరికొత్త మోసానికి తెరతీశారు. "కింది లింకును క్లిక్ చేసి, రిజిస్టర్ అయితే.. రుణమాఫీకి అర్హులవుతారు" అంటూ వాట్సాప్, ఎస్సెమ్మెస్ ద్వారా లింకులను పంపుతున్నారు. ఆ లింకులను క్లిక్ చేసిన వారి స్మార్ట్‌ఫోన్లలోకి రిమోట్ యాక్సెస్ ట్రోజన్(ర్యాట్)ను చొప్పించి, బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఇలారాష్ట్రంలో ఒకట్రెండు ఘటనలు వెలుగు చూడడంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. రైతుబంధు పేరుతో వచ్చే సందేశాలను నమ్మి, అపరిచిత లింకులపై క్లిక్ చేయొద్దని డీజీపీ జితేందర్ హెచ్చరించారు.

తొలివిడతలో నల్లగొండకు అత్యధిక నిధులు!

» 83,124 మంది రైతులకు రూ.454కోట్లు బదిలీ

హైదరాబాద్, హుస్నాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ పథకంలో భాగంగా తొలి విడతలో లక్ష రుణ మాఫీ ప్రక్రియలో నల్లగొండ నుంచి అత్యధిక మొత్తంలో రుణాలు మాఫీ అయ్యాయి. ఈ జిల్లాలో 78,463 కుటుంబాలకు చెందిన 83,124 మంది రైతులకు రూ.454.49 కోట్లు మాఫీ చేశారు. రెండు, మూడు స్థానాల్లో వరుసగా సిద్దిపేట, సూర్యాపేట జిల్లాలున్నాయి. సిద్దిపేట జిల్లాలో 50,295 కుటుంబాలకు చెందిన 53,137 మంది రైతులకు రూ. 290.24 కోట్లు.. సూర్యాపేట జిల్లాలో 52,418 కుటుంబాల్లోని 56,274 మంది రైతులకు రూ. 282.98 కోట్ల రుణమాఫీ జరిగింది. చివరి స్థానంలో మేడ్చల్ జిల్లా ఉంది. ఈ జిల్లాలో 2,667 కుటుంబాలకు చెందిన 2,781 మంది రైతులకు రూ.12.53 కోట్లు మాఫీ అయ్యాయి. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే అత్యధిక మొత్తంలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని అందోల్ పరిధిలో 19,186 కుటుంబాలకు చెందిన 20,216 మంది రైతులకు రూ. 107.83 కోట్ల రుణమాఫీ జరిగింది. రెండోస్థానంలో కరీంనగర్ జిల్లా పరిధిలోని హుస్నాబాద్ ఉంది. ఈ నియోజకవర్గం నుంచి 18,101 కుటుంబాల్లోని 18,907 ఖాతాలకు చెందిన 106.74కోట్లు మాఫీ అయినట్లు మంత్రి పొన్నం వెల్లడించారు. రుణమాఫీకి సంబంధించి ఫిర్యాదుల కోసం రాష్ట్ర వ్యవసాయ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఐటీ పోర్టల్ ఏర్పాటుచేశామని, మండలస్థాయిలో కూడా సహాయ కేంద్రాలు ఏర్పాటుచేశామని ప్రభుత్వం వెల్లడించింది.

దొంగల మాటలు నమ్మొద్దు!

పాస్‌బుక్కు ప్రాతిపదికగానే రుణమాఫీ..లక్ష వరకు రుణమాఫీ చేశాం: రేవంత్

హైదరాబాద్, జులై 18 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులో పంట రుణం తీసుకున్న ప్రతీ రైతుకూ మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రుణమాఫీకి పట్టాదారు పాసుపుస్తకమే ప్రాతిపదిక అని స్పష్టం చేశారు. రైతు కుటుంబాన్ని గుర్తించటానికి మాత్రమే రేషన్ కార్డును పరిగణనలోకి తీసుకుంటున్నామని, రేషన్‌కార్డు లేని వారికి కూడా రుణమాఫీ జరుగుతుందని తేల్చిచెప్పారు. రేషన్‌కార్డు తప్పనిసరని ప్రచారం చేస్తున్న కొంతమంది దొంగలు చెప్పే దొంగ మాటలను రైతులు నమ్మొద్దంటూ విజ్ఞప్తి చేశారు. రుణమాఫీపై సవాళ్లు విసిరిన వారి (హరీశ్‌రావు) రాజీనామాల కోసం పట్టుబట్టబోమని చెప్పారు. వాళ్లు ఎట్లాగూ పారిపోతారని తెలుసని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మాట ఇస్తే నిలబెట్టుకుంటుందని, సోనియా గాంధీ, రాహుల్‌గాంధీలు మాటిస్తే అది శిలాశాసనమేనని చెప్పారు. గాంధీ కుటుంబం రాజకీయ ప్రయోజనాల కోసం మీలాంటి మాటలు మాట్లాడదంటూ పరోక్షంగా కేసీఆర్ కుటుంబాన్ని విమర్శించారు. రేవంత్‌రెడ్డి గురువారం సచివాలయంలో రెండు లక్షల రైతు రుణ మాఫీ పథకానికి శ్రీకారం చుట్టారు. లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేసిన చెక్కులను పలువురు రైతులకు స్వయంగా పంపిణీ చేశారు. పంపిణీకి ముందు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లోని రైతు వేదికల వద్ద సమావేశమైన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. 2014లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి, అసలు, వడ్డీ చెల్లిస్తామని హామీ ఇచ్చి నాలుగైదు విడతల్లో చేసిందని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. 2018 లో రెండోసారి అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తయినా హామీని నెరవేర్చలేకపోయారన్నారు. మొదటి ఐదేళ్లలో రూ.12 వేల కోట్లు మాత్రమే చెల్లించిందని చెప్పారు. రెండో దఫా అధికారంలోకి వచ్చాక రూ.16 వేల కోట్లకు గాను రూ.9 వేల కోట్లు కూడా సరిగా చెల్లించలేదని అన్నారు. పదేళ్ల పాలనలో 21 వేల కోట్ల రూపాయల మాఫీ కూడా సక్రమంగా చేయలేకపోయారని చెప్పారు. కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక పోయారని, ముఖ్యమంత్రి చెప్పారంటే జరిగి తీరుతుందనే విశ్వాసాన్ని కోల్పోయేలా చేశారని విమర్శించారు. 2022లో వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని, 2023లో తుక్కుగూడలో సోనియాగాంధీ ఆరు గ్యారెంటీలు ప్రకటించారని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని నెరవేరుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ధైర్యంగా, దర్పంగా లక్ష రూపాయల వరకు అప్పులున్న రైతులకు రూ.6,099 కోట్లు చెల్లించిందన్నారు. జిల్లా పరిషత్, శాసన మండలి, శాసనసభ, లోక్‌సభల్లో 16 ఏళ్ల తన సుదీర్ఘ రాజకీయ రాజకీయ జీవితంలో రుణమాఫీ చేసిన ఈ రోజు మరుపురాని రోజని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 40 లక్షల మంది రైతులకు రూ.31 వేల కోట్ల రుణ మాఫీ చేసే అద్భుతమైన అవకాశం తనకు దక్కిందన్నారు. ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రెండో విడత రుణమాఫీ చేస్తానని కేసీఆర్ ప్రకటించిన రోజు 2018 డిసెంబరు 12 నుంచి సరిగ్గా ఐదేళ్లకు సోనియాగాంధీ పుట్టిన రోజు, తెలంగాణ ప్రకటన చేసిన రోజు అయిన 2023 డిసెంబరు 9వరకు ఉన్న అన్ని పంట రుణాలు మాఫీ చేయాలని నిర్ణయించామన్నారు. రెండోవిడతలో రూ.1.50లక్షల వరకు రుణాలు, మూడో విడతలో రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించారు. ఆగస్టు పూర్తి కాకముందే రైతుల ఖాతాల్లో రూ.31వేల కోట్లు జమ చేస్తామని చెప్పారు. ఏడు లక్షల కోట్లు అప్పుచేసి కేసీఆర్ దిగిపోతే, ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వరిస్తున్న భట్టి విక్రమార్క రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతున్నారని కొనియాడారు. ఉద్యోగులు, పెన్షనర్లకు జీతాలు ఇవ్వలేని స్థితికి కేసీఆర్ రాష్ట్రాన్ని తీసుకెళ్లారని చెప్పారు. ఇప్పుడు నెలనెలా 1వ తేదీన రూ.5వేల కోట్లు జీతాలు, పెన్షన్లు చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఐదు గ్యారెంటీల అమలుకు రూ.29వేల కోట్లు ఖర్చు పెట్టామన్నారు. అధికారంలోకి వచ్చిన 8 నెలల్లో రైతులకు రుణమాఫీ చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామని చెప్పారు. 2004లో కరీంనగర్‌లో సోనియా గాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ప్రత్యేక రాష్ట్ర హామీని ఎన్ని ఆటంకాలు వచ్చినా, ఎంతమంది అడ్డంకులు సృష్టించినా, పార్టీకి తీరని నష్టం జరుగుతుందనే ఆందోళనలున్నా నెరవేర్చారని రేవంత్ గుర్తు చేశారు. కార్యకర్తలు రుణమాఫీ గురించి రైతులకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. రైతుల వైపు నుంచి సమస్యలు వస్తే అవగాహన కల్పించి రుణమాఫీ చేయాలని బ్యాంకు అధికారులకు విజ్ఞప్తి చేశారు.



రుణమాఫీ సందర్భంగా మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో భట్టి, గడ్డం ప్రసాద్, ఉత్తమ్, పొంగులేటి, పొన్నం

రూపాయి రూపాయి కూడబెట్టి: భట్టి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేసిన ఘనత భారతదేశ చరిత్రలో ఇప్పటివరకు ఏ రాష్ట్రంలో లేదన్నారు. ధనిక రాష్ట్రంగా తెలంగాణను టీఆర్ఎస్ చేతిలో పెడితే లక్ష రూపాయల రుణమాఫీని కూడా నాలుగైదు వాయిదాల్లో ఐదేళ్లలో చేశారన్నారు. ఆగస్టు 15లోగా రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి సవాల్ విసిరితే అంతా ఆశ్చర్యపోయారని, సాధ్యాసాధ్యాలు చూసుకోకుండా ఇబ్బందులు పడతారేమోననే భావాన్ని కూడా కొందరు వ్యక్తపరిచారని ప్రస్తావించారు. ధైర్యంతో రూపాయి రూపాయి కూడబెట్టి ఒకే రోజు లక్ష వరకు మాఫీ చేశామని, ఆగస్టు దాటకుండానే రూ.2 లక్షలు మాఫీకి నాంది పలికామని చెప్పారు. ఒకే సారి రూ.31వేల కోట్ల మాఫీ కార్పొరేట్ రంగంలో కూడా ఎక్కడా జరగలేదని తెలిపారు.



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న తుమ్మల

సాధ్యం కాదనుకున్నారు: తుమ్మల

ఖర్గే, సోనియా, రాహుల్‌ల సమక్షంలో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీకి హామీ ఇచ్చినపుడు విపక్ష నేతలు ఇది సాధ్యం కాదని నిర్ధారణకు వచ్చి, ఏకంగా తమ పదవులు కోల్పోయే విధంగా సవాళ్లు విసిరారని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. గత ప్రభుత్వ అస్తవ్యస్త పాలనతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి రుణ మాఫీ చేస్తున్న ఘనత రేవంత్‌కే దక్కిందని చెప్పారు. రైతుల పండుగ కంటే బ్యాంకర్ల పండుగే ఎక్కువగా ఉన్నదని, ఒకేసారి రూ.31 వేల కోట్లు బ్యాంకులకు వస్తున్నాయని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి పైసా తిరిగి రుణాల రూపంలో రైతుల చేతుల్లోకి వెళ్లాలని బ్యాంకులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, కె.కేశవరావు, హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లా మామిళ్లగూడెంలో ఫోన్‌లో రుణమాఫీ మెసేజ్‌ను చూసి ఆనందం వ్యక్తంచేస్తున్న రైతు దంపతులు



నిజామాబాద్ జిల్లా మందర్నా గ్రామంలో సీఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు

రుణపడి ఉంటాం!

బ్యాంకు అప్పు ఏకకాలంలో మాఫీ అయిపోయింది.. వ్యవసాయం చేయాలన్న సంకల్పానికి ప్రోత్సాహం

» సీఎంకు అన్నదాతల కృతజ్ఞతలు

» రేవంత్.. రైతుబాంధవుడు: కోమటిరెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

పంట రుణాల మాఫీపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. తొలి విడతలో లక్ష దాకా రుణం మాఫీ అయిన అన్నదాతలు రైతు వేదికల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. మాఫీతో పల్లెల్లో పండగ వాతావరణం నెలకొందని ఒక రైతు అంటే.. ఇచ్చిన మాటను సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకున్నారని, రాహుల్ గాంధీని ప్రధాని చేస్తాం అని మరో రైతు సంబరాన్ని వ్యక్తం చేశాడు. ఇంకో రైతేమో తన రూ.లక్ష రుణం అంతా కూడా ఏకకాలంలో మాఫీ అయిందని ఆనందాన్ని వ్యక్తం చేస్తే.. మరో రైతు, సీఎం రేవంత్ రెడ్డికి రుణపడి ఉంటానని.. ఆయన చరిత్రలో నిలిచిపోతారని భావోద్వేగానికి గురయ్యాడు! గురువారం రుణమాఫీ ప్రారంభం సందర్భంగా జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు వేదికల్లోని లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్ సంభాషించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ నుంచి రైతు మందర్న రవి మాట్లాడుతూ గతంలో రుణమాఫీ ప్రకటనలొస్తే అనుమానాలు ఉండేవని.. ఏకకాలంలో రుణమాఫీ చేయడం ద్వారా సీఎం చరిత్రలో నిలిచిపోతారని కృతజ్ఞతలు చెప్పారు. స్పందించిన రేవంత్ "మరి.. నాకు అంకాపూర్ దేశీ చికెన్ తినిపిస్తవా?" అని ఆయన్ను అడిగారు. తనకు ఉన్న రూ.78వేల రుణం మాఫీ అయిందని ఖమ్మం జిల్లా వెంకటాయపాలెం గ్రామానికి చెందిన సీతారాం చెప్పాడు. తనకు రూ.50వేల మేర బ్యాంకు అప్పు మాఫీ అయిందని నాగర్ కర్నూల్ జిల్లా రామాపురానికి చెందిన రాములమ్మ, సీఎంకు కృతజ్ఞతలు చెప్పింది. తనకు రూ.లక్ష రుణం ఉంటే ఏకకాలంలో మాఫీ అయిందంటూ సీఎంతో నల్లగొండ జిల్లా తిప్పర్తి రైతు గూడూరు రాజు ఆనందాన్ని పంచుకున్నారు. ఈ రైతువేదిక నుంచి పాల్గొన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాకు ఒకేరోజు రూ. 455 కోట్ల రుణమాఫీ నిధులు మంజూరు చేయడం ద్వారా సీఎం రేవంత్ రైతుబాంధవుడిగా నిలిచారని కృతజ్ఞతలు చెప్పారు. గత ప్రభుత్వం ఆరేడు విడతలుగా చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయిందని అన్నారు. రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని.. మీ నల్లగొండ జిల్లాకే అత్యధిక నిధులు వచ్చాయని అన్నారు. తనకు నాలుగెకరాల భూమి ఉన్నదని, రూ. 70 వేల అప్పు మాఫీ అయ్యిందని నారాయణపేట జిల్లా ధన్వాడ మహిళా రైతు కుర్వ లక్ష్మి చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా తాంసి నుంచి బుర్రి మహేందర్ అనే రైతు మాట్లాడుతుండగా సీఎం జోక్యం చేసుకున్నారు. తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు ఇస్తామని చెప్పారు. రుణమాఫీపై ఇచ్చిన మాటను సీఎం రేవంత్ నిలబెట్టుకున్నారని, ఆయనకు తాము రుణపడి ఉంటామని, రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తామని వరంగల్ జిల్లా కేంద్రం ఉర్సు ప్రాంతానికి చెందిన బొల్లు ఎల్లయ్య అన్నారు. స్పందించిన రేవంత్.. రుణమాఫీ ప్రకటన వరంగల్ డిక్లరేషన్‌లో జరిగిందని, అక్కడి ఆర్ట్స్ కాలేజీలో రాహుల్‌గాంధీని పిలిచి 5 లక్షల మందితో సభ పెడతామని ప్రకటించారు.



నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రైతులకు చెక్కుల పంపిణీ

రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా సచివాలయంలో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల నుంచి రైతులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీకి కృతజ్ఞతలు తెలుపుతూ సీఎం రేవంత్‌రెడ్డి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రైతువేదికల నుంచి వీసీలో పాల్గొన్న రైతులంతా తీర్మానాన్ని బలపరిచారు. గ్రామసభలు పెట్టి రుణమాఫీ గురించి ప్రజలకు చేరవేయాలని, రైతులు ఏవైనా ఇబ్బందులు పడితే కాంగ్రెస్ కార్యకర్తలు బ్యాంకులకు తీసుకెళ్లి సహకరించాలని సూచించారు. రాహుల్‌గాంధీని వరంగల్ సభకు ఆహ్వానించటానికి ఉప ముఖ్యమంత్రి, మంత్రులతో కలిసి ఢిల్లీకి వెళ్తామని, రైతులు సంఘీభావం ప్రకటించాలని కోరారు.

తిరిగి పంట రుణాలు ఇవ్వాలి



రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేయడం హర్షణీయం. అయితే ఐటీ పేరిట మాఫీకి రైతులను దూరం చేయొద్దు. మాఫీ పొందిన రైతులకు తిరిగి పంట రుణాలు అందజేయాలి.

-కల్లెం బోజారెడ్డి, రైతు, అలూరు, నిజామాబాద్ జిల్లా

పల్లెల్లో పండగ వాతావరణం



నాకు రూ.లక్ష రుణం మాఫీ అయింది. అప్పు భారం తగ్గింది. రుణ మాఫీతో పల్లెల్లో పండగ వాతావరణం నెలకొంది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నిలబెట్టుకుంది.

- శ్రీనివాస్, రైతు, భూషణ్ రావుపేట, జగిత్యాల జిల్లా

500 రైతువేదికల్లో వీసీ సెంటర్లు ప్రారంభం

రైతునేస్తంలో భాగంగా గత జనవరి నెలలో 566 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు ప్రారంభించారు. తాజాగా గురువారం మరో 500 రైతు వేదికల్లో ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్ వ్యవస్థను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ఏడాదే అన్ని రైతువేదికల్లో వీసీ యూనిట్లు ఏర్పాటు చేస్తామని కార్యదర్శి రఘునందన్‌రావు తెలిపారు.

నాకు కాదు.. దామోదరసార్‌కు
నమస్కారం పెట్టు!
ఆయనకు పెడితే అందరికీ పెట్టినట్టే: రేవంత్

'ఆగస్టులో రుణమాఫీ చేద్దామని మేమంతా అనుకుంటే.. వద్దు.. వద్దు.. ఈ నెలలోనే చేయాలని పట్టుబట్టి మాపై ఒత్తిడి తెచ్చారు మంత్రి దామోదర. ఆయన పట్టుదల వల్లే ఈ నెలలోనే రుణమాఫీ ప్రారంభించాం' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా జోగిపేట మండలం డాకూరులోని రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు కర్నోల్ల శివయ్య, లక్ష్మమ్మతో రేవంత్ మాట్లాడారు. వారి మాటామంతీ..

కర్నోల్ల శివయ్య: నమస్కారం సార్
సీఎం రేవంత్: నమస్కారం శివయ్య.. ఎలా ఉన్నావు?
శివయ్య: బాగున్నాను సార్
రేవంత్: ఎంత లోన్ తీసుకున్నావు.. రుణమాఫీ చేయడం బాగుందా?
శివయ్య: రూ. 25 వేలు తీసుకున్నా సార్... బాగుంది సార్.. ధన్యావాదాలు.. నమస్కారం సార్
రేవంత్: నమస్కారం నాకు కాదు నీ పక్కన కూర్చున్నారు చూడు దామోదర్ సార్.. ఆయన అందరికంటే పెద్దసారు.. ఆయనకు నమస్కారం పెడితే మాకందరికీ పెట్టినట్టే.
శివయ్య: సరే సార్
రేవంత్: ఆగస్టులో రుణమాఫీ చేద్దామని మేము అనుకుంటే, దామోదర సారే ఈ నెలలో చేయాలని మాతో పట్టుపట్టారు. ఆయన ఒత్తిడితోనే ఈ నెలలో ప్రారంభించినం.
శివయ్య: ధన్యావాదాలు, నమస్కారం సార్..
రేవంత్: నమస్కారం శివయ్య
లక్ష్మమ్మ: నమస్కారం సార్.
రేవంత్: నమస్తే లచ్చమ్మా.. నీకు ఎంత భూమి ఉంది
లక్ష్మమ్మ: ఎకరన్నర సార్
రేవంత్ : ఎంత రుణ మాఫీ అయింది.
లక్ష్మమ్మ: రూ. 56 వేలు సార్..
రేవంత్: ఢిల్లీ పోతున్నా.. సోనియమ్మకు ఏం చెప్పాలె లక్ష్మమ్మ
లక్ష్మమ్మ: ధన్యవాదాలు సార్...
రేవంత్: సరే నీ తరపున సోనియమ్మకు ధన్యవాదాలు చెపుతా

2లక్షల క్యాటగిరికే ఎక్కువ బడ్జెట్!

» ఏకంగా 18 వేల కోట్లు సర్దాల్సిందే

» 'లక్షన్నర' మాఫీ కోసం మరో 7 వేల కోట్లు

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ పథకం అమలుకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి నిధుల సమీకరణ సవాలుగా మారింది. రెండు లక్షల రుణ మాఫీ చేయటానికి మొత్తం రూ.31 వేల కోట్ల నిధులు అవసరమవుతుండగా తొలివిడతలో లక్ష వరకు మాఫీ చేయటానికి రూ. 6,100 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా రూ. 25 వేల కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చేయాల్సి ఉంది తొలి విడతతో పోలిస్తే... మూడో విడతలో భారీ ఎత్తున నిధులు సమకూర్చాల్సి ఉంటుంది. దాదాపు 60 శాతం బడ్జెట్ రూ.2లక్షల కేటగిరిలో ఉన్న రైతులకే చెల్లించాల్సి ఉంటుంది. ఈలెక్కన మూడో విడత రుణమాఫీకి రూ.18 వేల కోట్లు, రెండో విడతకు రూ.7 వేల కోట్ల నిధులు అవసరం పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి బ్యాంకులు సమర్పించిన నివేదిక ప్రకారం.. 40 బ్యాంకులు, 5,782 శాఖల్లో 41,78,892 లోనింగ్ అకౌంట్లు ఉన్నాయి. గత 2023 డిసెంబరు నెల తొమ్మిదో తేదీ నాటికి ఈ ఖాతాలపై రూ. 42,956 కోట్ల అప్పు ఉండటం గమనార్హం. వీటిలో ఆధార్ లేనివి, ఆధార్‌తో సరిపోల్చని ఖాతాలు 1,47,293 ఉన్నాయి. వీటిపై రూ. 1,745 కోట్ల పంట రుణ బకాయిలు ఉన్నాయి. లోన్ అకౌంట్ ఎర్రర్ ఉన్న బ్యాంకు ఖాతాలు 2,93,632 ఉన్నాయి. వీటిపై రూ. 2,190 కోట్ల పంటరుణాలు ఉన్నాయి. ఇవిపోగా 38,85,260 లోనింగ్ అకౌంట్లు సజావుగా ఉన్నాయి. వీటిపై రూ. 40,765 కోట్ల పంట రుణాలు ఉన్నాయి. ఇందులో రెండు లక్షల రుణమాఫీ పథకానికి అర్హత పొందే రైతులకు రూ. 31 వేల కోట్ల నిధులు అవసరమవుతున్నాయి. ఈ రూ. 31 వేల కోట్లలో తొలివిడతలో రూ. 6 వేల కోట్లు పంపిణీచేశారు. రుణమాఫీకి ఇంకా రూ. 25 వేల కోట్లు కావాలి. రెండో విడతకు రూ.7 వేల కోట్లు, మూడో విడతకు రూ.18 వేల కోట్లు అవసరమవుతాయనే అంచనాలున్నాయి. మూడో కేటగిరీలో రూ. 2 లక్షల వరకే అప్పు ఉన్న రైతులతోపాటు... రూ.2 లక్షలకు మించి అప్పు ఉన్న రైతులు కూడా ఉంటారు. అంటే రూ. 3 లక్షలున్న రైతులు, రూ.4 లక్షలు తీసుకున్న రైతులు, అంతకంటే ఎక్కువ అప్పు తీసుకున్న రైతులు కూడా ఉంటారు. ఎన్ని లక్షల అప్పు ఉన్నా... అర్హులైనవారికి రూ. 2 లక్షల చొప్పున రుణమాఫీ చేయాల్సి ఉంటుంది. ఈలెక్కన రూ. 2 లక్షల కంటే ఎక్కువ అప్పు ఉన్న రైతులు కూడా మూడో విడత రుణమాఫీలోకి వస్తారు. ఈ క్రమంలో మొదటి విడత, రెండో విడత కంటే మూడో విడత బడ్జెట్ గణనీయంగా పెరుగుతుంది. రుణమాఫీకి మొత్తం బడ్జెట్ రూ. 31 వేల కోట్లు అయితే... ఇందులో 60 శాతం అంటే... సుమారు రూ. 18వేల కోట్లు మూడో విడత రుణమాఫీకి సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. రైతుల నుంచి వచ్చే అర్జీలు, సవరణలతో పెరిగే రైతుల సంఖ్య, నిధుల మొత్తం కూడా మూడో విడత బడ్జెట్‌లో జమ అవుతుంది.

అసలుకు వడ్డీ, వడ్డీలకు వడ్డీ పెరగడంతోనే

2018లో కూడా కేసీఆర్ ప్రభుత్వం రూ.లక్ష రుణ మాఫీ పథకాన్ని ప్రకటించింది. పూర్తిస్థాయిలో అమలుచేయలేదు. ఫలితంగా రైతులకు అసలుకు వడ్డీ, వడ్డీలకు వడ్డీ పెరిగిపోయి.. వారి కేటగిరీ మారింది. లక్షకులోపు అప్పు తీసుకున్న రైతుల్లో కొందరు లక్షన్నర కేటగిరీలోకి, మరికొందరు రెండు లక్షల కేటగిరీలోకి వెళ్లిపోయారు. అందుకే రెండు, మూడో విడతలకు కలిపి సుమారు రూ. 25 వేల కోట్ల బడ్జెట్ సర్దుబాటు చేయాల్సి వస్తోంది. దీనికితోడుగా రుణపరిమితి పెరగడంతో అప్పు పెరిగింది.

రైతులకు మళ్లీ రుణాలు ఇవ్వండి

రూ. 31వేల కోట్ల మేర రుణ మాఫీ..బ్యాంకింగ్ చరిత్రలోనే ఓ రికార్డు: భట్టి

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రైతు రుణ మాఫీ కింద వచ్చిన నిధులను బ్యాంకర్లు జమ చేసుకొని... భవిష్యత్తు అవసరాల కోసం రైతులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. రైతులకు రుణాలు ఇచ్చే విషయంలో ఎక్కడ కూడా అశ్రద్ధ చూపొద్దని, లీడ్ బ్యాంకు పెద్దన్న పాత్ర పోషించాలని కోరారు. రుణ మాఫీ మొదటి విడత నిధులు విడుదల నేపథ్యంలో గురువారం ఉదయం ప్రజాభవన్‌లో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సదర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను రుణమాఫీ పథకానికే వినియోగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర అప్పులకు జమ చేసుకోవద్దని ఆదేశించారు. వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం రానున్న రోజుల్లో మరిన్ని పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనుందని తెలిపారు. మొదటి విడతలో రూ.లక్ష లోపు బకాయి ఉన్న 11.50 లక్షల మంది రైతులకు రూ.6098 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. నెలాఖరులోగా రూ.లక్షన్నర వరకు, ఆగస్టు నెలలో రూ.2లక్షల వరకు రుణ మాఫీ చేస్తామని ప్రకటించారు. మూడు విడతల్లో కలిపి 40 లక్షల మంది ఖాతాల్లో రూ.31 వేల కోట్లను జమ చేయనున్నట్లు చెప్పారు. ఇంత పెద్దమొత్తంలో ఒకే సారి రుణాలు రికవరీ కావడం దేశ బ్యాంకింగ్ చరిత్రలోనే ఓ రికార్డు అని పేర్కొన్నారు. రెండు లక్షల కంటే ఎక్కువ బకాయిలు ఉన్న రైతులతో బ్యాంకర్లు మాట్లాడాలని, ప్రభుత్వం జమ చేసిన మొత్తాన్ని మినహాయించుకుని... మిగిలిన మొత్తాన్ని రికవరీ చేసుకోవాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులను ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. రుణమాఫీ నేపథ్యంలో బ్యాంకుల వద్ద అధికారులు ఉత్సవాలు జరపాలని, విస్తృతంగా ప్రచారం చేయాలని భట్టి పిలుపు నిచ్చారు.

ప్రభుత్వ ఉత్తర్వులు పాటించాల్సిందే..

ప్రభుత్వ ఉత్తర్వులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బ్యాంకర్లను హెచ్చరించారు. బ్యాంకులకు వచ్చే వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులకు పూర్తి సమాచారం ఇవ్వాలని, రైతులకు సహకారం అందించాలని సూచించారు. రుణ మాఫీ విజయవంతం కావడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నెల రోజుల పాటు రుణాల రెన్యువల్, నగదు చెల్లింపులకు బ్యాంకుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రుణ మాఫీ నిధులను రైతులకు తప్పకుండా అందేలా చూడాల్సిన బాధ్యతను బ్యాంకర్లు తీసుకోవాలని సూచించారు. పీఏసీఎస్‌లకు సంబంధించి డీసీసీబీలకు విడుదల చేసిన నిధులు ఒకటి, రెండు రోజుల్లో సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించారు. రుణమాఫీ పథకాన్ని ప్రకటించినపుడు ఎవరూ నమ్మలేదని, బ్యాంకింగ్ చరిత్రలోనే ఇది కనీవినీ ఎరుగని సందర్భమని అన్నారు.

డీఎస్సీ పరీక్షలపై జోక్యానికి హైకోర్టు నిరాకరణ

» 2.45 లక్షల మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు

» పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి: ఏఏజీ

» యథాతథంగా డీఎస్సీ పరీక్షలు



హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో 11 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షల్లో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. పరీక్షలు వాయిదా వేయాలంటూ దాఖలైన పిటిషన్‌లో ఎలాంటి ఉత్తర్వులు జారీచేయడానికి హైకోర్టు ఆసక్తి చూపకుండా విచారణను వాయిదా వేసింది. దీంతో ఈనెల 18 నుంచి ప్రారంభమైన డీఎస్సీ పరీక్షలు యథాతథంగా కొనసాగనున్నాయి. డీఎస్సీ-2024 పరీక్షలను వాయిదా వేసేలా ఆదేశించాలని.. పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు తగిన సమయం ఇవ్వకుండా హడావుడిగా పరీక్షలు నిర్వహిస్తున్నారని పేర్కొంటూ రాంపల్లి అశోక్, మరో తొమ్మిది మంది అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలను వినిపిస్తూ.. టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్-1, గ్రూప్-2, ఇతర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన పోస్టులకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారని.. ఈ నేపథ్యంలో తగిన సమయం ఇవ్వకుండా ప్రభుత్వం పరీక్షల విషయంలో హడావుడిగా ముందుకెళ్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ తేరా రజినీకాంత్‌రెడ్డి వాదనలను వినిపిస్తూ.. టీచర్ పోస్టుల భర్తీకి ఎన్నో ఏళ్లుగా అభ్యర్థులు ఎదురుచూస్తున్నారని.. ప్రభుత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిందని.. గురువారం నుంచి వచ్చేనెల 5 వరకు పరీక్షలు కొనసాగనున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే 2.45 లక్షల మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరయ్యేందుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. ఎవరికీ లేని అభ్యంతరం పిటిషనర్లకు ఎందుకని ప్రశ్నించారు. సెంటర్ల గుర్తింపు, ప్రశ్నపత్రాల పంపిణీ, సిబ్బందికి విధుల కేటాయింపు, ఇన్విజిలేషన్, లాజిస్టిక్స్ తదితర అన్ని ఏర్పాట్లు పూర్తయిన దశలో పరీక్షలను వాయిదా వేయాలని కోరడం సమంజసం కాదని విన్నవించారు. వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వడానికి ఇష్టపడలేదు. తదుపరి విచారణ వచ్చే నెల 28కి వాయిదా వేసింది.

డీఎస్సీ పరీక్షలు షురూ

తొలి రోజు 16,221 మంది హాజరు

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డీఎస్సీ పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. గురువారం నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. తొలి రోజు, గురువారం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 56 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 16,221 మంది అభ్యర్థులు హాజరయ్యారు. తొలి రోజు పరీక్షకు 19,746 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 82.14 శాతం హాజరు నమోదైంది. మొత్తం 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ పోస్టుల కోసం సుమారు 2.79 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా 2.48 లక్షల మంది ఇప్పటిదాకా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు.

అభ్యర్థులకు ఆల్ ది బెస్ట్



'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్ ట్వీట్

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి 'ఆల్ ది బెస్ట్' చెప్పారు. 2012 తరువాత మళ్లీ ఇన్నాళ్లకు జరుగుతున్న డీఎస్సీ ద్వారా అభ్యర్థుల కలలు ఫలించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. భావి భారత పౌరులను తీర్చిదిద్దే, పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలోకి రావాలనుకుంటున్న వారి ఆకాంక్ష నెరవేరాలని కోరుకుంటున్నానని 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

గ్రూపు-2 పరీక్షలు వాయిదా?

» మళ్లీ నవంబరు లేదా డిసెంబరులో?

» ప్రత్యామ్నాయ తేదీలను పరిశీలిస్తున్న అధికారులు

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గ్రూపు-2 పరీక్షలను వాయిదా వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆగస్టులో జరగాల్సిన ఈ పరీక్షలను వాయిదా వేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు ప్రత్యామ్నాయ తేదీలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. గురువారం ప్రారంభమైన డీఎస్సీ పరీక్షలు ఆగస్టు 5 వరకు జరుగుతాయి. 7, 8 తేదీల్లో గ్రూపు-2 పరీక్షలను నిర్వహించాలని షెడ్యూల్ జారీ చేసిన సంగతి తెలిసిందే. డీఎస్సీ పరీక్షలు పూర్తయిన వెంటనే గ్రూపు-2 పరీక్షలను నిర్వహించడం వల్ల నష్టపోతామని, వాటిని వాయిదా వేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పరీక్షలు వాయిదా వేసే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ ఈ పరీక్షలు వాయిదా పడితే.. మళ్లీ నవంబరు లేదా డిసెంబరులో నిర్వహించే అవకాశం ఉంది. ఈ అంశంపై రెండు మూడు రోజుల్లో అధికారిక నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. గ్రూపు-2 పరీక్షల వాయిదా అంశంపై ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మానవతా రాయ్ తదితరులు గురువారం నిరుద్యోగులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మరోవైపు గ్రూపు-1 ప్రిలిమనరీ పరీక్షలో 1:100 అభ్యర్థుల ఎంపిక సాధ్యం కాదని, దీని ద్వారా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఈ చర్చల విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.

'వసతిగృహ సంక్షేమ అధికారి' పోస్టుల ప్రిలిమనరీ కీ 22న

వసతి గృహ సంక్షేమ అధికారుల పోస్టుల భర్తీ కోసం జూన్‌లో నిర్వహించిన పరీక్షల ప్రిలిమనరీ కీని 22న విడుదల చేయాలని టీజీపీఎస్సీ అధికారులు నిర్ణయించారు. కీపై అభ్యంతరాలను 23 నుంచి 27వ తేదీలోపు తెలియజేయాలి. వాటిని పరిశీలించి, తుది కీని విడుదల చేయనున్నారు.

మహీంద్ర యూనివర్సిటీలో 'స్కూల్ ఆఫ్ డిజైన్'

» నూతన విభాగాన్ని ప్రారంభించిన వైస్‌చాన్స్‌లర్

హైదరాబాద్ సిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): మహీంద్రా యూనివర్సిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన స్కూల్ ఆఫ్ డిజైన్ ఇన్నోవేషన్ విభాగాన్ని వర్సిటీ వీసీ మేడూరి యాజులు గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ డిజైన్ రంగంలో భవిష్యత్తు ఉద్యోగాలకు, వాణిజ్యానికి యువతను సిద్ధం చేసేందుకు స్కూల్ ఆఫ్ డిజైన్ దోహదపడుతుందన్నారు. ఇటలీకి చెందిన పినిన్‌ఫరినా డిజైన్ అకాడమీ, ఐఐటీ ముంబైలోని షెనోయ్ ఇన్నోవేషన్ స్టూడియో ఇందులో భాగస్వామ్యం కలిగి ఉన్నాయని చెప్పారు. ఆగస్టు 15 నుంచి మొదటి అకడమిక్ సెషన్ ప్రారంభమవుతుందని, బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బి.డిజైన్) కోర్సును ఈ ఏడాది 30 సీట్లతో ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కోవడానికి అవసరమైన నైపుణ్యాలను, మనస్తత్వాన్ని విద్యార్థులలో పెంపొందించడమే స్కూల్ ఆఫ్ డిజైన్ లక్ష్యమని దాని వ్యవస్థాపక డీన్ ప్రొఫెసర్ బీకే చక్రవర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో మహీంద్ర యూనివర్సిటీ అడ్మిషన్ల విభాగాధిపతి రాకేశ్ శ్రీధరన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో అకాడమీ ఏర్పాటు చేయండి

» కరణం మల్లీశ్వరికి కేంద్ర మంత్రి రామ్మోహన్ విజ్ఞప్తి



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న కరణం మల్లీశ్వరి

న్యూఢిల్లీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో వెయిట్ లిఫ్టింగ్ అకాడమీని ఏర్పాటు చేయాలని సిడ్నీ ఒలింపిక్ కాంస్య పతక విజేత కరణం మల్లీశ్వరికి కేంద్ర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. గురువారం, ఇక్కడ రాజీవ్‌గాంధీ భవన్‌లో మంత్రితో కరణం మల్లీశ్వరి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వెయిట్ లిఫ్టింగ్ అకాడమీ ఏర్పాటుకు కావాల్సిన భూమి, నిధులు, మౌలిక సదుపాయాలను కల్పిస్తామని తెలిపారు. మంత్రి విజ్ఞప్తికి మల్లీశ్వరి సానుకూలంగా స్పందించారు. క్రీడల పట్ల ఆయనకున్న ఆసక్తి, క్రీడరంగం అభివృద్ధి కోసం ఆయన తన ఆలోచనలను పంచుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాగా, మల్లీశ్వరి విజయగాథ భావి చాంపియన్లకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని మంత్రి రామ్మోహన్‌నాయుడు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

చిన్నారులపై కుక్కల దాడి.. హైకోర్టు ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

బర్త్ కంట్రోల్ కమిటీకి ఆదేశాలు జారీచేసింది. చిన్నారులపై వీధికుక్కల దాడులకు సంబంధించిన పత్రికల్లో వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. గతంలో ఇదే అంశంపై దాఖలైన పిటిషన్‌లతో కలిపి విచారణ చేపడుతోంది. ఈ వ్యవహారంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. "ఇది ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) కాదు. చిన్న పిల్లల ప్రాణాలకు సంబంధించిన అంశం. మానవీయకోణంలో అర్థం చేసుకోవాల్సిన ఈ అంశంలో ప్రభుత్వం, జీహెచ్ఎంసీ పనిచేయడం లేదంటూ పరస్పర ఆరోపణలకు అవకాశం లేదు. స్టెరిలైజేషన్ ఒక్కటే దీనికి మార్గం కాదు. స్టెరిలైజేషన్ చేసినంత మాత్రాన.. కుక్కలు పిల్లలపై దాడి చేయకుండా ఎలా నిరోధించగలుగుతాం. ఈ సమస్య ఢిల్లీ, కోల్‌కతా వంటి నగరాల్లో ఉంటే అక్కడ ఎలాంటి చర్యలు తీసుకున్నారో పరిశీలించి.. అమలు చేసే అవకాశం ఉండేది. ఇది ఇక్కడ స్థానికంగా ఉన్న ప్రత్యేక సమస్య. దీనికి నిపుణులు మాత్రమే పరిష్కారం చూపగలరు. మాంసం దుకాణాల నుంచి వెలువడుతున్న వ్యర్థాల వల్ల కూడా కుక్కలు క్రూరంగా మారుతున్నాయి. ఈ సమస్యపై ఫిర్యాదులు స్వీకరించేందుకు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించండి" అని వ్యాఖ్యానించింది. 3.79 లక్షల కుక్కలకు స్టెరిలైజేషన్ చేశామన్న ప్రభుత్వ వాదనను హైకోర్టు తోసిపుచ్చింది.. ఇదొక్కటే పరిష్కారం కాదని తెలిపింది. చిన్నారుల మరణాలు, కుక్కల దాడులపై పత్రికల్లో వచ్చిన కథనాల క్లిప్పింగ్స్‌ను ధర్మాసనం ప్రదర్శించింది. భవిష్యత్తులో ఇలాంటి దారుణాలు జరగకుండా నిపుణులను సంప్రదించి, తగిన పరిష్కార మార్గాలతో రావాలని యానిమల్ బర్త్‌కంట్రోల్ కమిటీ, జీహెచ్ఎంసీ, ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది.

వాగుతో పెద్ద డేంజర్

(మొదటి పేజీ తరువాయి)



ఆశ్వారావుపేట మండలంలో నీట మునిగిన పామాయిల్ తోట

వర్షాలు కురవడంతో పెదవాగు ఉగ్ర రూపం దాల్చింది. ఉదయం 11 గంటలకు సాగునీటి అధికారులు రెండు గేట్లు ఎత్తి 22,500 క్యూసెక్కులను విడుదల చేశారు. అంతలోనే ఎవరూ ఊహించని రీతిలో పెదవాగు ఉధృతి పెరిగింది. మూడు చోట్ల గండ్లు పడ్డాయి. ఔట్ ఫ్లోకు ఇన్‌ఫ్లో కొన్ని రెట్లు ఎక్కువగా ఉండడంతో ప్రాజెక్ట్ నిండిపోయింది. అన్నివైపులా కట్టపై నుంచి నీరు పొంగి ప్రవహించింది. మోటారు కాలిపోవడంతో మూడో గేటు తెరుచుకోలేదు. కట్ట కింద గుమ్మడపల్లి గ్రామస్థులు భయంతో మెరక ప్రాంతానికి వెళ్లిపోయారు.

వాగుల మధ్యలో 25 మంది

పెదవాగు వరద నారాయణపురం-పెద వాగు ప్రాజెక్టు మధ్య కట్టమైసమ్మ ఆలయం సమీపంలోని రోడ్డును దాటి పంట పొలాలను చుట్టుముట్టింది. నారాయణపురం, జగన్నాథపురం, బచ్చువారిగూడెం గ్రామాలకు చెందిన 25 మంది రైతులు, కూలీలు, పశువుల కాపర్లు సాయంత్రం వరకు వాగు మధ్యలోనే ఉండిపోయారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ రెస్క్యూ బృందాలను పిలిపించే ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యేతో పాటు స్థానికులు ఫోన్ ద్వారా మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ఆలస్యం అవుతుందని.. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు ఫోన్ చేశారు. ఏలూరు మీదుగా హెలికాప్టర్ పంపేలా చూశారు. ఈలోగా భద్రాద్రి జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని అప్రమత్తం చేశారు. హెలికాప్టర్ రాత్రి 7.30 గంటల ప్రాంతంలో.. వరదలో చిక్కుకున్న వారిని కాపాడింది. కాగా, పెద వాగు ఘటనపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కూడా స్పందించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడారు.



నారవారిగూడెం-గుర్రాలచెరువు మధ్య కొట్టుకుపోయిన రోడ్డు

18 గ్రామాలకు ముప్పు

పెదవాగు ఉధృతితో కొత్తూరు, ఏపీలోని వేలేరుపాడు మండలం కమ్మరిగూడెం సహా మొత్తం 18 గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఇప్పటికే గండ్లతో పెద వాగు నీరు భారీగా పోతోంది. గుమ్మడపల్లిలోకి చేరి 50 ఇళ్లను చుట్టుముట్టింది. గండ్లు మరింత పెరిగి కట్ట తెగితే భారీ ప్రమాదం తప్పదనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో భద్రాద్రి కలెక్టర్ జితిన్ వి.పాటిల్ ప్రాజెక్టు దిగువన ఉన్న గ్రామాల ప్రజలందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు.

అశ్వారావుపేటలో 16 సెం.మీ. వర్షం

కొత్తగూడెం జిల్లాలో గురువారం భారీ వర్షంతో వాగులు, వంకలు, చెరువులు, ప్రాజెక్టులు పొంగి ప్రవహించాయి. పలు మండలాలు, గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దమ్మపేట మండలం జమేదారు బంజరలో పిడుగుపడి బొర్రా మల్లేష్- నాగమణి దంపతుల కుమారులు సిద్దూ(15), చందు(11) చనిపోయారు. మల్లేష్ దంపతులు పిల్లలతో చేపలు పట్టేందుకు చెరువుకు వెళ్లగా ఈ ఘటన జరిగింది. అశ్వారావుపేట మండలంలో అత్యధికంగా 16 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అనంతారం గ్రామం జల దిగ్బంధమైంది. 30 ఇళ్లను ఖాళీ చేయించారు. భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 18.2 అడుగుల వద్ద ఉంది. ఖమ్మం జిల్లాను ముసురు కమ్మేసింది. వేంసూరు, సత్తుపల్లిలో 4 సెం.మీ. పైగా వర్షపాతం నమోదైంది. కాగా, నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలంలో 8.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నల్లగొండ జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసింది.

నేడు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు

రాష్ట్రంలో శుక్ర, శనివారాల్లో భారీ, అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30-40 కిలో మీటర్ల వేగంతో, అప్పుడప్పుడు 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపింది. ఈదురుగాలులతో పాటే అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

ఏపీలో కొట్టుకుపోయిన కారు

అందులో ఐదుగురు.. కాపాడిన గ్రామస్థులు

ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం కొండవాగు ఉధృతిలో కారు కొట్టుకుపోయింది. రాజమహేంద్రవరం నుంచి వేలేరుపాడు మండలం రుద్రంకోట వెళ్లేందుకు గడ్డం సాయికుమారి తల్లి సింగవరపు జ్యోతి, మేనమామ, రామారావు, తన ఇద్దరు పిల్లలు కుందనకుమార్, జగదీష్‌కుమార్ (8)తో గురువారం బయల్దేరారు. కోయమాధవరం - అల్లూరినగర్ మధ్య కొండ వాగు ప్రవాహంలో 200 మీటర్లు కొట్టుకువెళ్లి ఎదురుపొదల్లో చిక్కుకుంది. 40 మంది గ్రామస్థులు ఈదుకుంటూ కారువద్దకు చేరుకున్నారు. అప్పటికే జగదీష్‌కుమార్ బయటపడి వెదురుపొదల్లో చిక్కుకున్నాడు. గ్రామస్థులు 3 గంటలు శ్రమించి వారందరినీ ఒడ్డుకు చేర్చగలిగారు. ఆ ప్రాంతానికి మరో 200 మీటర్ల దూరంలోనే పెదవాగు భీకరంగా ప్రవహిస్తోంది. ఆ వాగులో పడితే గోదావరిలో కలిసిపోయేవారు. కారు కొట్టుకుపోయిన విషయంపై ఏపీ సీఎం చంద్రబాబు క్షణాల్లో స్పందించారు. రెండు హెలికాప్టర్‌లను సమకూర్చారు. కాగా, ఏపీలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.

రహదారులపై గుంతల సమస్య పరిష్కారానికి ప్రత్యేక యాప్

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచన

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రహదారులపై గుంతల సమస్య పరిష్కారానికి ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచన చేసింది. ఆ యాప్ ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యను పరిష్కరించాలని పేర్కొంది. కర్ణాటకలో ఈ విధానం విజయవంతంగా అమలవుతుందని చెప్పింది. రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్వహణ అధ్వానంగా ఉందని, రహదారి భద్రతపై సుప్రీం కోర్టు మార్గదర్శకాలను ప్రభుత్వం అమలు చేయడం లేదని పేర్కొంటూ హైకోర్టులో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలు నివేదికను ప్రభుత్వం ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. హైదరాబాద్ విస్తరణలో భాగంగా పంచాయతీ రోడ్లను జీహెచ్ఎంసీలో విలీనం చేశారని.. అందుకే అక్కడక్కడా సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే.. ఓ మొబైల్ యాప్ ద్వారా రహదారిపై గుంతల సమస్య పరిష్కరించే విధానం అమలును పరిశీలించాలని సూచించారు. తాను కర్ణాటక హైకోర్టులో పని చేసేటప్పుడు ఇదే తరహా సమస్య తన దృష్టికి వచ్చిందని గుర్తు చేశారు. కర్ణాటకలో మొబైల్ యాప్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించి.. గుంతలను పూడ్చేసి అమలు నివేదికను అప్‌లోడ్ చేస్తారని చెప్పారు. అలాగే సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రహదారి భద్రతకు తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని పేర్కొంటూ విచారణను ఈనెల 31కి వాయిదా వేశారు.

మాకు టైమ్ కావాలి

ఫిరాయింపులపై వాదనకు సమయం కోరిన ఏజీ

మరింత మంది పార్టీ మారేందుకే తాత్సారమని పిటిషనర్ల ఆరోపణ

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేపై అనర్హత వేటు అంశంపై దాఖలైన పిటిషన్లపై వాదనలు వినిపించేందుకు తమకు సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానాన్ని కోరింది. అయితే, మరింత మంది పార్టీ మారేందుకే ప్రభుత్వం గడువు కోరుతోందని పిటిషనర్లు ఆరోపణ చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్(ఏజీ) సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వరాదని సుప్రీంకోర్టు ఐదుగురు జడ్జిల ధర్మాసనం పేర్కొందని హైకోర్టుకు నివేదించారు. వాదనలు వినిపించడానికి తనకు మరింత సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు, జే రామచంద్రరావు వాదిస్తూ ఏజీ కావాలనే తాత్సారం చేస్తున్నారని, మరింత మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరే వరకు ఇలాగే వాయిదాలు తీసుకుంటారని ఆరోపించారు. ఏజీ సమయం కోరడంతో విచారణ ఈనెల 22కు వాయిదా పడింది.

మలబార్ గోల్డ్ పెట్టుబడి రూ.750 కోట్లు

» 1,500 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు

» మంత్రి శ్రీధర్‌బాబుతో.. మలబార్ చైర్మన్ సమావేశం



మంత్రి శ్రీధర్‌బాబుతో మలబార్ గోల్డ్ చైర్మన్ ఎంపీ అహ్మద్

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దిగ్గజ ఆభరణాల తయారీ సంస్థ మలబార్ గోల్డ్ రాష్ట్రంలో రూ.750 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనుంది. ఇప్పటికే రూ.183 కోట్లతో రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో బంగారు, వజ్రాభరణాల తయారీ యూనిట్ నిర్మాణాన్ని పూర్తి చేసిన ఆ సంస్థ.. తాజా పెట్టుబడులతో 1500 మందికి ప్రత్యక్షంగా, మరో 1,250 మందికి పరోక్షంగా ఉపాధి కల్పించనుంది. మలబార్ గోల్డ్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ గురువారం ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబుతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల వివరాలను ప్రకటించారు. వచ్చే మూడేళ్లలో రూ.750 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు వివరించారు. ఈ ఏడాది చివరికల్లా ఆభరణాల తయారీ యూనిట్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. మలబార్ సంస్థ.. మహేశ్వరం యూనిట్‌లో ఆభరణాల తయారీలో శిక్షణ ఇచ్చేందుకు 120 మంది మహిళలను ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, గ్రామీణ యువతకు ఆభరణాల తయారీ, మార్కెటింగ్‌లో శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మలబార్ గోల్డ్ మహేశ్వరం యూనిట్‌కు ప్రత్యేక తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుచేయాలని, మౌలిక సదుపాయాల కల్పన పనులను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఏఐపై 20 ఏళ్ల రోడ్ మ్యాప్..

ప్రభుత్వ పాలన, పారిశ్రామిక రంగాల్లో కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ వినియోగంపై.. రానున్న 20 ఏళ్లకు సంబంధించిన ఒక రోడ్ మ్యాప్ రూపొందించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. గురువారం ఆయన బ్రిటిష్ హైకమిషన్, ఎర్నెస్ట్ అండ్ యంగ్ ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 200 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఏఐ సిటీలో బ్రిటిష్ హైకమిషన్, ఎర్నెస్ట్ సంస్థలు కీలక భాగస్వాములు కావాలని కోరారు. ఏఐ సిటీలో అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంలో సహకరించాలని కోరారు.

ప్రభుత్వ ప్రాజెక్టులకు ప్రైవేటు అప్పులు

ఓవైపు సంక్షేమ పథకాలకు నిధుల లేమి..? మరోవైపు నిరాశాజనకంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి..! ఇంకోవైపు కొత్త అప్పులకు ప్రతిబంధకంగా మారిన ఎఫ్ఆర్‌బీఎం పరిమితి..! ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించింది. సోషల్ ఎక్స్ఛేంజీల ద్వారా నిధుల సమీకరణకు సిద్ధమైంది. ఈ క్రమంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం ఎక్స్విప్ దేసీ అనే పెట్టుబడుల సేకరణ సంస్థ, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు అవసరమయ్యే కొత్త అప్పులపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు కార్పొరేట్ సంస్థలు తక్కువ వడ్డీలకు రుణాలు ఇస్తుంటాయి. ఈ విధానాన్ని సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ అంటారు. దీనికి సెబీ ఆమోదం కూడా ఉంది. రాష్ట్రంలోని సంక్షేమ పథకాల అమలుకు ఈ విధానం ద్వారా అప్పులను సేకరించాలని నిర్ణయించినట్లు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

ఎయిమ్స్‌లో కవితకు వైద్య పరీక్షలు

» నివేదికలు తమకు సమర్పించాలని కోర్టు ఆదేశం

» జ్యుడీషియల్ కస్టడీ 22 వరకు పొడిగింపు



న్యూఢిల్లీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించింది. కవిత జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో గురువారం ఆమెను వర్చువల్‌గా ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. కవిత ఆరోగ్యం బాగా లేదని, జ్వరంతో బాధపడుతున్నారని ఆమె తరఫు న్యాయవాదులు జడ్జి కావేరి భవేజా దృష్టికి తీసుకెళ్లారు. తాను గైనిక్ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నానని, జైలులో వసతులు సరిగా లేవని, సరైన వైద్య పరికరాలు, సిబ్బంది అందుబాటులో లేరని స్వయంగా కవిత.. న్యాయమూర్తికి తెలిపారు. జ్వరంతో ఇబ్బంది పడుతున్నానని, ఆరోగ్యం బాగా క్షీణించిందన్నారు. కవిత ఆరోగ్యం క్షీణించడంతో మంగళవారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారని, అక్కడ కూడా సరైన వసతులు లేవని ఆమె తరఫున న్యాయవాది మోహిత్ రావు వివరించారు. ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జడ్జి కవితకు ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించాలని జైలు అధికారులను ఆదేశించారు. శుక్ర, శనివారాల్లో వైద్య పరీక్షలు పూర్తిచేయాలని, సోమవారంలోపు రిపోర్టులు న్యాయస్థానంలో సమర్పించాలన్నారు. వైద్య పరీక్షల సమయంలో కవితతోపాటు ఆమె భర్త అనిల్ తోడుగా ఉండవచ్చన్నారు. కాగా, ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన సీబీఐ కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 22 (సోమవారం) వరకు జడ్జి కావేరి భవేజా పొడిగించారు. సీబీఐ ఛార్జిషీట్, కవిత బెయిల్ పిటిషన్లపై కూడా సోమవారమే విచారణ జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే కస్టడీని 22వ తేదీ వరకు పొడిగించారు.

మార్మోగుతున్న ఉషా చిలుకూరి పేరు

» అమెరికాలో రిపబ్లికన్ పార్టీ తరఫున

ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ సతీమణి మూలాలు ఏపీలో



విశాఖపట్నం, హైదరాబాద్, జూలై 18: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున ఉపాధ్యక్ష అభ్యర్థిగా జేడీ వాన్స్‌ను ఎంపిక చేయడంతో ఆయన సతీమణి ఉషా చిలుకూరి పేరు ఇప్పుడు భారత్‌లో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో మార్మోగిపోతోంది. విద్యావంతుల కుటుంబం నుంచి వచ్చి అమెరికాలో స్థిరపడి.. దేశం గర్వించే స్థాయికి ఎదిగిన ఉష పూర్వీకుల మూలాలు కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం సాయిపురం గ్రామంలో ఉండగా.. విశాఖపట్నంలోనూ ఆమెకు బంధువులున్నారు. వైజాగ్‌కు చెందిన ఫిజిక్స్ ప్రొఫెసర్ సి శాంతమ్మ (96)కు ఉష మనవరాలు వరుస అవుతారు. శాంతమ్మ కూడా ఆంధ్ర యూనివర్సిటీలో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. 96 ఏళ్ల వయస్సులో ఇప్పటికీ పిల్లలకు పాఠాలు చెబుతున్నారు. 'నా భర్త చిలుకూరి సుబ్రహ్మణ్యశాస్త్రి ద్వారా ఉషతో నాకు కుటుంబ సంబంధం ఉంది. ఆమె నాకు మనవరాలు అవుతుంది. ఐఐటీ ప్రొఫెసర్‌గా పనిచేసిన నా మరిది రామశాస్త్రి మనవరాలే ఆమె' అని శాంతమ్మ చెప్పారు. రామశాస్త్రి కుమారుడు రాధాకృష్ణ, లక్ష్మి దంపతులు 1970వ దశకంలో అమెరికాకు వలస వెళ్లారు. వారు శాన్ డియాగోలో ఇంజనీరింగ్, మాలిక్యులర్ బయాలజీ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. వారి కుమార్తే ఉషా చిలుకూరి. ఆమె భర్త జేడీ వాన్స్ అమెరికా ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఎంపికైన విషయం తనకు తెలిసి సంతోషించానని, ఈ ఎన్నికల్లో వాన్స్ గెలవాలని కోరుకుంటున్నానని శాంతమ్మ చెప్పారు. ఉష తాత రామశాస్త్రి కుటుంబానిది పశ్చిమ గోదావరి జిల్లా తణుకు సమీపంలోని వడ్లూరు. చెన్నైలో వైద్యురాలిగా పనిచేస్తున్న ఉషా మేనత్త శారద కూడా.. జేడీ వాన్స్‌ను అమెరికా ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director: Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్)- దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 'జవహర్ నవోదయ విద్యాలయ సెలెక్షన్ టెస్ట్(జేఎన్‌వీఎస్‌టీ) 2025' ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఇవి కో-ఎడ్యుకేషనల్ రెసిడెన్షియల్ స్కూళ్లు. బాల బాలికలకు విడివిడిగా హాస్టల్స్ ఉంటాయి. భోజన, వసతి సౌకర్యాలతోపాటు పన్నెండో తరగతి వరకు బోధన ఉచితం. యూనిఫాం, పాఠ్య పుస్తకాలు కూడా ఇస్తారు. తొమ్మిది నుంచి పన్నెండో తరగతి విద్యార్థులు మాత్రం విద్యాలయ వికాస్ నిధి కోసం నెలకు రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. బాలికలు; దివ్యాంగులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు; పేదింటి పిల్లలకు దీని నుంచి మినహాయింపు వర్తిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలైతే నెలకు రూ.1500 చెల్లించాలి. ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు మాతృభాష/ప్రాంతీయ భాషలో బోధన ఉంటుంది. తరవాత మేథమెటిక్స్, సైన్స్ సబ్జెక్టులను ఆంగ్ల మాధ్యమంలో; సోషల్ సైన్స్‌ను హిందీలో బోధిస్తారు. ఈ విద్యాలయాల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) వార్షిక పరీక్షలు నిర్వహిస్తుంది.

జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరోతరగతి ప్రవేశాలు



విద్యాలయాలు-సీట్లు: దేశవ్యాప్తంగా మొత్తం 653 జేఎన్‌వీలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 13 విద్యాలయాలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ వర్గాల జనాభా అధికంగా ఉన్న ప్రాంతాలకు మరో రెండు విద్యాలయాలు కేటాయించారు. తెలంగాణలో 9 జేఎన్‌వీలు ఉన్నాయి. ఒక్కో విద్యాలయంలో ఆరోతరగతిలో గరిష్ఠంగా 80 మందికి అవకాశం కల్పిస్తారు. జిల్లాల వారీగా సంబంధిత జేఎన్‌వీల్లో గ్రామీణ విద్యార్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు.

అర్హత వివరాలు: ప్రస్తుతం ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో అయిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్ఐఓఎస్ నుంచి 2024 సెప్టెంబరు 15 నాటికి 'బి' సర్టిఫికెట్ కాంపిటెన్సీ కోర్సు పూర్తిచేసేవారు కూడా అర్హులే. విద్యార్థులు 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి.

జేఎన్‌వీ సెలెక్షన్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం 2 గంటలు. మొత్తం మార్కులు 100. ఈ పరీక్షలో మూడు సెక్షన్లు ఉంటాయి. వీటిలో మొత్తం 80 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌లో 40 ప్రశ్నలు అడుగుతారు. దీనికి 50 మార్కులు కేటాయించారు. అర్థమెటిక్ టెస్ట్, లాంగ్వేజ్ టెస్ట్‌ల్లో ఒక్కోదానిలో 20 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో దానికి 25 మార్కులు ఉంటాయి. నెగెటివ్ మార్కులు లేవు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌కు గంట; మిగిలినవాటికి ఒక్కోదానికి అర్ధగంట పరీక్ష సమయం ఇస్తారు. విద్యార్థులు బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద సమాధానాలు గుర్తించాలి. తెలుగు రాష్ట్రాల్లో ఈ పరీక్షని తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మరాఠీ, ఉర్దూ, ఒరియా, కన్నడ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **జేఎన్‌వీ సెలెక్షన్ టెస్ట్ తేదీలు:** 2025 జనవరి 18, ఏప్రిల్ 12
- **వెబ్‌సైట్:** www.navodaya.gov.in

పంచకర్మ టెక్నీషియన్ కోర్సు

భారత ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్(సీసీఆర్ఏఎస్)- పంచకర్మ టెక్నీషియన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. హెల్త్‌కేర్ సెక్టర్ స్కిల్ కౌన్సిల్(హెచ్ఎస్ఎస్‌సీ)-నేషనల్ స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్‌డీసీ)కి అనుబంధంగా ఉన్న ట్రెయినింగ్ సెంటర్లలో శిక్షణ ఇస్తారు. ఇది ఏడాది వ్యవధి గల సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ రెగ్యులర్ నాన్ రెసిడెన్షియల్ కోర్సు. ప్రతి రోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు థియరీ తరగతులు, ప్రాక్టికల్ సెషన్స్ నిర్వహిస్తారు. హిందీ, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన ఉంటుంది. అవసరం మేరకు ప్రాంతీయ భాషల్లో వివరణ ఇస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. నిబంధనల ప్రకారం కోర్సు పూర్తి చేసినవారికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు. శిక్షణ సమయంలో ఇతర కోర్సుల్లో చేరేందుకు అనుమతించరు. అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ట్రెయినింగ్ సెంటర్లు-సీట్లు: సెంట్రల్ ఆయుర్వేద రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఏఆర్ఐ)కి సంబంధించి న్యూఢిల్లీ, గువహటి సెంటర్లలో ఒక్కోదానిలో 10 సీట్లు; కేరళ - చెరుతురుతిలోని నేషనల్ ఆయుర్వేద రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పంచకర్మ(ఎన్ఏఆర్ఐపీ)లో 30 సీట్లు; జమ్ములోని రీజనల్ ఆయుర్వేద రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఆర్ఏఆర్ఐ)లో 15 సీట్లు ఉన్నాయి. ప్రతి సెంటర్లో సగం సీట్లను మహిళలకు ప్రత్యేకించారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రెయినింగ్ పూర్తయ్యేనాటికి అభ్యర్థులకు 18 ఏళ్లు నిండాలి.

ముఖ్య సమాచారం

- ఈ కోర్సు పూర్తిచేసినవారికి దేశవిదేశాల్లోని ఆయుర్వేదిక్ సంస్థలు, ఆసుపత్రుల్లో పంచకర్మ టెక్నీషియన్, పంచకర్మ అసిస్టెంట్ తదితర ఉద్యోగావకాశాలు లభిస్తాయి.
- **కోర్సు ఫీజు:** రూ.30,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **రిజిస్టర్డ్/స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 31
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 31
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** అక్టోబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.ccras.nic.in

సీఈసీఆర్ఐలో బీటెక్

కరైకుడి(తమిళనాడు)లోని సెంట్రల్ ఎలక్ట్రోకెమికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎస్ఐఆర్-సీఈసీ ఆర్ఐ)-బీటెక్ (కెమికల్ అండ్ ఎలక్ట్రోకెమికల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో అదర్ స్టేట్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అయిదు సీట్లు ఉన్నాయి. జేఈఈ మెయిన్ 2024 ఆలిండియా ర్యాంక్ ఆధారంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు(తమిళనాడు మినహా) నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్, ఓబీసీ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 40 శాతం మార్కులు ఉండాలి. జేఈఈ మెయిన్ 2024 అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 6
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** ఆగస్టు 9
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్:** ఆగస్టు 21
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 23
- **వెబ్‌సైట్:** cecri.res.in

మ్యాట్ నోటిఫికేషన్



ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ)-మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్) 2024 ఆగస్టు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా దేశంలోని ప్రముఖ బిజినెస్ స్కూళ్లు అందిస్తున్న మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఎంబీఏ, పీజీడీఎం, ఎంఎంఎస్ తదితర ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు. మ్యాట్‌ను ఇంటర్నెట్ బేస్డ్ టెస్ట్, పేపర్ బేస్డ్ టెస్ట్, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానాల్లో నిర్వహిస్తారు. వీటిలో ఒకదాన్ని లేదా రెంటిని అభ్యర్థులు ఎంచుకోవచ్చు. పీబీటీ, సీబీటీలకు పరీక్ష కేంద్రాలు వేరుగా ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

మ్యాట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో లాంగ్వేజ్ కాంప్రహెన్షన్, ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్, మేథమెటిక్ స్కిల్స్, డేటా అనాలిసిస్ అండ్ సఫిషియెన్సీ, ఎకనామిక్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ అనే అయిదు సెక్షన్‌లు ఉంటాయి. సెక్షన్‌కు 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 150 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

ఐబీటీ షెడ్యూల్: ఆగస్టు 14న ఎగ్జామ్ రాయాలనుకొనేవారు ఆగస్టు 9లోపు, ఆగస్టు 23న పరీక్ష రాయాలంటే ఆగస్టు 18లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఎగ్జామ్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ తరవాత రెండోరోజు నుంచి అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

సీబీటీ షెడ్యూల్

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 11
- **అడ్మిట్ కార్డుల డౌన్‌లోడింగ్:** ఆగస్టు 14 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- **సీబీటీ టెస్ట్ తేదీ:** ఆగస్టు 18

పీబీటీ షెడ్యూల్

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 18
- **అడ్మిట్ కార్డుల డౌన్‌లోడింగ్:** ఆగస్టు 21 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం
- **పీబీటీ టెస్ట్ తేదీ:** ఆగస్టు 25

ముఖ్య సమాచారం


- **దరఖాస్తు ఫీజు:** ఒక టెస్ట్(ఐబీటీ/పీబీటీ/సీబీటీ)నకు రూ.2100; రెండు టెస్టులు అంటే డబుల్(ఐబీటీ/పీబీటీ/సీబీటీ) లేదా (పీబీటీ+ఐబీటీ)/ (పీబీటీ+సీబీటీ)/(సీబీటీ+ఐబీటీ)లకు రూ.3,600.
- **వెబ్‌సైట్:** mat.aima.in

ఐఐఎఫ్‌టీలో ఆన్‌లైన్ పీజీ డిప్లొమా

ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- ఎగ్జిక్యూటివ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(ఈపీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది 15 నెలల వ్యవధి గల వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో మూడు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లు పూర్తయిన తరవాత ప్రోగ్రామ్‌లో బ్రేక్ తీసుకోవచ్చు. గరిష్ఠంగా మూడేళ్లలో ప్రోగ్రామ్‌ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌ని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. వారాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు వరకు సెషన్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా పోర్ట్ విజిట్, ఇండస్ట్రీ విజిట్, రీసెర్చ్ ప్రాజెక్ట్, అసైన్‌మెంట్స్ ఉంటాయి. సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం అయిదేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. పనిచేస్తున్న సంస్థ నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 20
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరు 14 నుంచి
- **వెబ్‌సైట్:** www.iift.ac.in



పోస్టల్ శాఖలో ఉద్యోగాలు

ఖాళీలు 44228

దేశ వ్యాప్తంగా వివిధ పోస్టల్ సర్కిళ్లలో గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్) ఖాళీల భర్తీకి ప్రకటన వెలువడింది. పదో తరగతిలో సాధించిన మార్కులతో ఉద్యోగం పొందవచ్చు.

మొత్తం ఖాళీలు: 44,228(ఆంధ్రప్రదేశ్-1,355, తెలంగాణ-981)

పోస్టుల వివరాలు

1. బ్రాంచ్ పోస్టు మాస్టర్(బీపీఎం)
2. అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్(ఏబీపీఎం)
3. డాక్ సేవక్

అర్హతలు: పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి

జీతభత్యాలు: నెలకు బ్రాంచ్ పోస్టు మాస్టర్ పోస్టుకు రూ.12,000 నుంచి రూ.29,380; అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్/డాక్ సేవక్ పోస్టుకు రూ.10,000 నుంచి రూ.24,470 చెల్లిస్తారు.

వయోపరిమితి: 18 నుంచి 40 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది.

ఎంపిక విధానం: పదోతరగతిలో సాధించిన మెరిట్‌లిస్ట్ మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 5

వెబ్‌సైట్: https://indiapostgdsonline.gov.in/

ఇండియన్ ఆర్మీలో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్

ఇండియన్ ఆర్మీ... షార్ట్ సర్వీస్ కమిషన్ ద్వారా స్పెషల్ ఎంట్రీ స్కీమ్ 57వ కోర్సులో ప్రవేశాలకు అర్హులైన అవివాహిత పురుషులు, మహిళల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ 57వ కోర్సు (ఏప్రిల్ 2025)

కేటగిరీ వారీగా ఖాళీలు

- ఎన్‌సీసీ పురుషులు: **70 పోస్టులు**
- ఎన్‌సీసీ మహిళలు: **6 పోస్టులు**
- ఈ రెండు విభాగాల్లోనూ 8 పోస్టులను యుద్ధంలో మరణించిన ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు కేటాయించారు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే మూడు అకడమిక్ సంవత్సరాలు ఎన్‌సీసీ సీనియర్ డివిజన్ వింగ్‌లో కొనసాగి ఉండాలి. ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్‌లో కనీసం 'బి' గ్రేడ్ పొంది ఉండాలి. యుద్ధంలో మరణించిన ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు ఎన్‌సిసి 'సి' సర్టిఫికెట్ అవసరం లేదు.

వయోపరిమితి: 2025 జనవరి 1 నాటికి 19 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి.


ఎంపిక విధానం: అప్లికేషన్ షార్ట్‌లిస్ట్, స్టేజ్-1, స్టేజ్-2 టెస్టులు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు.

శిక్షణ, వేతనాలు: ఎంపికైన అభ్యర్థులకు ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ చెన్నైలో 49 వారాల శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో ప్రతి నెలా రూ.56,100 స్టయిపెండ్ చెల్లిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారికి పీజీ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ డిగ్రీని మద్రాస్ యూనివర్సిటీ ప్రదానం చేస్తుంది. వీరిని లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 9

వెబ్‌సైట్: joinindianarmy.nic.in

జాబ్ కార్నర్



మెకాన్ లిమిటెడ్‌లో ప్రొఫెషనల్ పోస్టులు

రాంచీలోని మెకాన్ లిమిటెడ్... ఫుల్ టైం ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న విభాగాల్లో ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. డిప్యూటీ ఇంజనీర్
2. ఇంజనీర్
3. అసిస్టెంట్ ఇంజనీర్
4. జూనియర్ ఇంజనీర్
5. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్
6. జూనియర్ ఎగ్జిక్యూటివ్
7. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్
8. ఎగ్జిక్యూటివ్

విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, డిజైన్, స్ట్రక్చరల్, సేఫ్టీ, ఐటీ, హెచ్ఆర్, పర్చేజ్ అండ్ స్టోర్, ఎస్టేట్, ప్రాజెక్ట్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్.

అర్హత: సంబంధిత విభాగంలో సీఎంఏ/సీఏ/డిప్లొమా/డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 జూన్ 15 నాటికి 50 ఏళ్లు మించకూడదు

ఎంపిక: విద్యార్హతలు, పని అనుభవం, పర్సనల్ ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ల వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 31


వెబ్‌సైట్: www.meconlimited.co.in/

లిటిల్స్




అద్భుతమైన అద్దం

ఒక దేశాన్ని పాలించే రాజుకు విక్రముడు అనే కొడుకు ఉన్నాడు అతనికి వివాహం చేయాలని నిర్ణయించుకుని, రాజు తన మంత్రులను పిలిచి ఇలా చెప్పాడు 'అందగాడు, గుణవంతుడు ధైర్యశాలి ఐన విక్రముడికి అంతే సుగుణాలున్న వధువును వెతకాలి. మీరు ఇలా ప్రకటన చేయించండి. 'మన దగ్గర ఒక అద్భుతమైన మాయా అద్దం ఉందనీ అందులో మొహం చూసుకున్నా వారి మనసులో ఏమైనా దురాలోచనలు ఉంటే, అద్దంలో వారి మొహం మీద నల్లటి మచ్చలు కనిపిస్తాయనీ దీనికి సిద్ధ పడినవారు పరీక్షలో నెగ్గి, యువరాణి కావచ్చుననీ ప్రచారం చేయండి అని చెప్పి మంత్రులను పంపేశాడు రాజు. చాలా మంది అమ్మాయిలు యువరాజును వివాహమాడాలి అనుకున్నారు కానీ, అద్దంలో చూసుకున్నపుడు తమ మొహం మీద మచ్చలు కనిపిస్తే ఎలా అన్న భయంతో వారెవరూ అద్దం పరీక్షకు ముందుకు రాలేదు. చివరగా ఒక పల్లె పడుచు పరీక్షకు తాను సిద్ధం అని ముందుకు వచ్చింది. నిబంధన తెలుసుగా అన్నాడు రాజు తెలుసు మహారాజా.. నా మనసులో ఎలాంటి దురాలోచనలు ఉండవు. మా పల్లెలో ఎవరైనా తప్పులు చేస్తే, దిద్దుకుంటాం, ఒకరినొకరు క్షమించుకుంటాం అన్నది ఆమె. అద్దంలో తన మొహం చూసుకుంది. మచ్చలేమీ కనపడలేదు అపుడు మహారాజు ఇది మిగతావాటిలాగే ఒక సాధారణ అద్దం కానీ దురాలోచన విషయం చెప్పేసరికి ఎవ్వరూ సాహసం చేయలేదు. ఈ అమ్మాయి మాత్రమే ఆత్మ విశ్వాసంతో ముందుకు వచ్చింది కాబట్టి, ఈమెనే విక్రముడికి కాబోయే భార్య, మరియు ఈ దేశపు యువరాణి ఇలాంటి ఆత్మ విశ్వాసం కల అమ్మాయిని వెతకడానికే ఈ పరీక్ష, ప్రకటన అంతానూ అన్నాడు మహారాజు.



10 తేడాలను గుర్తించండి?






రంగులు వేయండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 362

2		1	
	2		3

సుడోకు - 361 సమాధానం

3	6	4	2	5	1
5	1	2	3	6	4
1	2	6	4	3	5
4	5	3	6	1	2
6	4	1	5	2	3
2	3	5	1	4	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.